అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 22-07-2024

సంపుటి : 10 సంచిక : 156 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు వెల : 6.50



అదరలే..బెదరలే..

చైనాపై ప్రభావం చూపని క్రౌడ్ స్ట్రైక్

బీజింగ్ : రెండ్రోజుల క్రితం మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య ప్రపంచాన్ని కుదిపేసింది. దీని కారణంగా ప్రపంచ వ్యాప్తంగా విమానయాన సేవలు, బ్యాంకులు, వివిధ వ్యాపార సంస్థల కార్యకలాపాలు నిలిచిపోయాయి. కంప్యూటర్లలో బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ కనిపించడంతో సిస్టమ్‌లు షట్‌డౌన్ / రీస్టార్ట్ అయ్యాయి. కాని, చైనాపై ఈ ప్రభావం పెద్దగా కనిపించలేదు. అక్కడి విమాన సర్వీసులు, బ్యాంకులు ఎప్పటిలాగే కొనసాగాయి. క్రౌడ్ స్ట్రైక్ అప్‌డేట్ చేయడంతోనే సాంకేతిక సమస్య తలెత్తినట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. క్రౌడ్ స్ట్రైక్ అనేది అమెరికాకు ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ. విండోస్‌తోపాటు దిగ్గజ ఐటి సంస్థలకు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీని అందిస్తుంటుంది. కాని, చైనాలో మాత్రం చాలా తక్కువ కంపెనీలే క్రౌడ్ స్ట్రైక్‌ను వినియోగిస్తున్నాయి. అది ...11లో



స్వేచ్ఛకు ముప్పు

మీడియాపై పెత్తనం కోసం
మోడీ ప్రభుత్వం చర్యలు
పార్లమెంటులో ప్రస్తావించండి
ప్రతిపక్ష నేత రాహుల్‌కు
ఎడిటర్స్ గిల్డ్ లేఖ

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా మీడియాని తన చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపడుతోందని ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాలని ప్రతిపక్షాలను కోరింది. ఈ మేరకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఎడిటర్స్ గిల్డ్ ఓ లేఖ రాసింది. ప్రాథమిక స్వేచ్ఛకు ముప్పు ...11లో

బోనమెత్తిన లష్కర్



- అంగరంగ వైభవంగా ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర
- వర్షంలోనే అమ్మవారికి బోనం సమర్పించిన మహిళలు
- సందడిగా ఆలయ పరిసర ప్రాంతాలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి
- తొలిబోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు
- ప్రత్యేక పూజలో గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి

వివరాలు 10లో

డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకే ఇవ్వాలి

పార్లమెంట్‌లో ప్రజల గొంతు వినిపించాలి



దేశ సమస్యలపై చర్చించాలి :
అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు
ప్రత్యేక హెూదాలపైనా డిమాండ్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ వేదికగా తమ గొంతు వినిపించేందుకు అవకాశం ఇస్తామన్న భరోసా ప్రభుత్వం కల్పించాలని ప్రతిపక్షాలు కోరాయి. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతిపక్షాలు నీట్ పేపర్ లీక్, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అగ్నివీర్ పథకం రద్దు, లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి, కన్వయర్ యాత్ర వివాదం వంటి పలు అంశాలను లేవనెత్తాయి. దీనికి ముందు పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు సహకరించాలని ప్రభుత్వం అన్ని పక్షాలను కోరింది.

ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాల సహకారం కావాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కోరిన తర్వాత, సమస్యలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలను అనుమతించాలని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ అన్నారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయించాలని, ఈ పదవిని ఖాళీగా ఉంచడం సమంజసం కాదని సూచించారు. బీహార్‌కు ప్రత్యేక హోదాపై ఆర్‌జేడీ, జేడీయూ, ఎల్‌జేపీ, ఏపీ కోసం వైసీపీ, అలాగే ఒడిశా కోసం బీజేడీ డిమాండ్ చేశాయి. మరోవైపు ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షం టీడీపీ డిమాండ్ చేయకపోవడాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ తప్పుపట్టారు. ఈ విషయంపై టీడీపీ ...11లో

ప్రజా సమస్యలపై
చర్చించాలి

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవాలి

రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలి : అఖిల పక్ష సమావేశంలో సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిట్టాస్




11లో..

తుమ్మితే ఊడే ఉద్యోగం

తయారీ రంగంలో పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

- సహస్రాబ్ది ప్రారంభం నుంచి ఇదే ధోరణి
- పట్టణాల కంటే గ్రామాల్లోనే అధికం
- వర్తించని ఉద్యోగ ప్రయోజనాలు





దేశంలోని కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య పెరుగుతోంది. అయితే వారంతా ఇప్పుడు కాంట్రాక్ట్ కార్మికులేనని 2001-02, 2017-18 మధ్యకాలంలో ఏఎస్ఐ అందించిన సమాచారం చెబుతోంది. 2001-02లో ఉత్పత్తి రంగంలో 59.6 లక్షల మంది కార్మికులు పనిచేశారు. 2017-18 నాటికి వారి సంఖ్య కోటీ ఇరవై లక్షలకు చేరింది. అయితే ఇదే కాలంలో ఫ్యాక్టరీల్లో నేరుగా నియామకాలు పొందిన కార్మికుల సంఖ్య 78.2 శాతం నుంచి 63.6 శాతానికి పడిపోయింది. మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులు 21.8 శాతం నుంచి 36.4 శాతానికి పెరిగారని సెంటర్ ఫర్ ఎకనమిక్ డాటా అండ్ అనాలసిస్ (కెడా) తెలిపింది. 2002-03 నుంచి 2021-22 వరకూ ఫ్యాక్టరీల్లో కార్మికుల నియామకాలకు సంబంధించిన గణాంకాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి.

న్యూఢిల్లీ : దేశంలో 2021-22 నాటికి తయారీ రంగంలో 1.3 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారని పరిశ్రమల వార్షిక సర్వే (మాన్యువల్ సర్వే ఆఫ్ ఇండస్ట్రీస్) తెలిపింది. వీరిలో 81 లక్షల మంది నేరుగా నియమితులైన శాశ్వత ఉద్యోగులు కాగా యాభై ఐదు లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులే. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) ప్రతి ఏటా పరిశ్రమల వార్షిక సర్వేను నిర్వహిస్తుంది. పారిశ్రామిక గణాంకాలకు ఇదే ఆధారం. దేశంలో తయారీ రంగం సాధించిన ఫలితాలను ఈ సర్వే సవివరంగా అందిస్తుంది.

తగ్గుతూ... పెరుగుతూ

2002-03లో దేశంలో 1,40,748 ఫ్యాక్టరీ యూనిట్లు పనిచేస్తున్నాయి. 2021-22 నాటికి వీటి సంఖ్య 2,00,576కు... అంటే 43 శాతం పెరిగింది. ఇదే సమయంలో ఆయా ఫ్యాక్టరీల్లో నియమితులైన కార్మికుల సంఖ్య 61 లక్షల నుంచి 1.36 కోట్లకు పెరిగింది. అంటే కార్మికుల సంఖ్య రెట్టింపునకు పైగా పెరిగిందన్న మాట. అయితే ఈ పెరుగుదల అసమాతలతో కూడి ...11లో

దేశంలో కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య పెరుగుతోంది. అయితే వారంతా కాంట్రాక్టు కార్మికులే.

పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే సహస్రాబ్ది మొదలైనప్పటి నుండి పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య బాగా పెరిగిపోయింది. 2002-03, 2021-22 మధ్యకాలంలో నేరుగా నియమితులైన కార్మికుల సంఖ్య 47 లక్షల నుంచి 81 లక్షలకు పెరగ్గా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 14 లక్షల నుంచి 55 లక్షలకు పెరిగింది. అంటే నేరుగా నియమితులైన కార్మికుల సంఖ్య 72.3 శాతం పెరిగితే కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య ఏకంగా 292.9 శాతం పెరిగింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమిటంటే ...11లో

పండుటాకులు

2050 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య రెట్టింపు



ఆరోగ్యం, గృహ నిర్మాణం, పెన్షన్‌పై దృష్టి సారించాలి
సమ్మిళిత వృద్ధి సాధించాలి : యూఎన్ఎఫ్‌పీఏ భారత్ చీఫ్ ఓజ్‌నర్

న్యూఢిల్లీ : 2050 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య రెట్టింపు అవుతుందని యునైటెడ్ నేషన్స్ ఫర్ పాప్యులేషన్ యాక్టివిటీస్ (యూఎన్ఎఫ్‌పీఏ) భారత విభాగం అధిపతి ఆండ్రూ ఓజ్‌నర్ తెలిపారు. వృద్ధుల సంఖ్య పెరగనున్నందున వారి ఆరోగ్య రక్షణ, గృహనిర్మాణం, పెన్షన్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఆమె చెప్పారు. ముఖ్యంగా ఒంటరిగా నివసిస్తూ, పేదరికంతో జీవిస్తున్న వృద్ధ మహిళల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆండ్రూ ఓజ్‌నర్ పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ సమ్మిళిత వృద్ధిని వేగవంతం చేయడానికి భారత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అరవై సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న వారి సంఖ్య 2050 నాటికి 34.6 కోట్లకు చేరుతుందని ఓజ్‌నర్ తెలిపారు. భారత్‌లో 10-19 సంవత్సరాల మధ్య వయసున్న వారి సంఖ్య 25.2 కోట్లుగా ఉన్నదని ఆమె చెప్పారు. దేశాన్ని సమ్మిళిత వృద్ధి దిశగా ముందుకు నడిపించాలంటే ఆరోగ్యం, విద్య, ఉద్యోగ శిక్షణపై పెట్టుబడులు పెంచాలని, లింగ సమానత్వాన్ని సాధించాలని సూచించారు. 2050 నాటికి దేశంలో ...11లో

గోదావరి ఉధృతిపై
నిఘా పెట్టండి

అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆదివారం అన్ని జిల్లాల్లో వరద పరిస్థితిని మంత్రి సమీక్షించారు. జిల్లా యంత్రాంగం సహాయ పునరావాస చర్యల్లో నిమగ్నమై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి ఉధృతి వల్ల అక్కడి పరివాహ ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా రెస్క్యూటీమ్‌లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ...11లో



ఎడతెరిపివ్వని వాన

ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో జలదిగ్బంధం

- నిండుకుండల్లా ప్రాజెక్టులు
- జూరాల నుంచి శ్రీశైలంకు భారీగా వరద నీరు
- కూలిన ఇండ్లు, రోడ్లు అస్తవ్యస్తం

వివరాలు 2లో

మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానతో రాష్ట్రవ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రాష్ట్రంలోనే కాక, ఎగువన కర్నాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహరాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి.

భద్రాద్రిలో గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక

అనుమానాస్పదంగా
ముగ్గురు మృతి

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఘటన

నవతెలంగాణ-బేగంపేట



హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో ముగ్గురు అనుమానాస్పదంగా మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం పనిమనిషి ఇంటికి వచ్చినప్పుడు ఎవరూ కనిపించలేదు. బాత్‌రూమ్‌లో ఉన్నారేమోనని ఇంట్లో పనిచేసి వెళ్లిపోయింది. తిరిగి సాయంత్రం 3 గంటల సమయంలో వచ్చినప్పుడు కూడా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. బాత్‌రూమ్ తలుపు అలాగే ఉండటంతో అనుమానం వచ్చి అపార్టుమెంట్ నిర్యాహకులకు చెప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డోర్ పగులగొట్టి చూడగా.. ఆర్.వెంకటేష్(55), ...11లో

5వ షెడ్యూల్ ప్రాంతాన్ని రీ నోటిపై చేయాలి

గిరిజనులు కోల్పోయిన భూముల్ని తిరిగి ఇప్పించాలి : గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన టీఏజీఎస్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని ఐదవ షెడ్యూల్ ప్రాంతాన్ని రీ నోటిఫై చేసి, గిరిజన తెగలకు కనీస వసతులు కల్పించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (టీఏజీఎస్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు, ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, తొడసం భీంరావు, సహాయ కార్యదర్శి ఆత్రం తనుష్ గవర్నర్‌ను కలిసి, ఆదివాసీ గిరిజనుల సమస్యల్ని వివరించారు. 9 జిల్లాల్లోని 85 మండలాల్లో 1,180 ప్రకటిత షెడ్యూల్డ్ గ్రామాలు ఉన్నాయనీ, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఐటీడీఏలు లేవని,



ఇక్కడ వాటిని ప్రారంభించాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూరు ఐటీడీఏ (చెంచుప్రాజెక్ట్) పీవో పోస్ట్ లేదనీ, దాన్ని సృష్టించి ఐఏఎస్ అధికారితో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. చెంచులు సాంప్రదాయ బద్ధంగా సాగుచేసుకుంటున్న భూముల్ని కోల్పోయారని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని షెడ్యూల్డ్ గ్రామాలతో పాటు 1,180 గ్రామాల్ని ఐదవ షెడ్యూల్ ప్రాంతంగా రీ నోటిఫై చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అభివృద్ధి కోసం పోస్టులు భర్తీ చేసి, బడ్జెట్ కేటాయించాలనీ, ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరారు. పిసా, ఎల్టీఆర్, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేస్తూ, షెడ్యూల్డ్ తెగల భూముల్ని గిరిజనేతరుల ఆక్రమణలకు గురికాకుండా చూడాలని చెప్పారు. మొలచింతపల్లిలో అత్యాచారానికి గురైన చెంచు మహిళకు ఆర్థికంగా సాయం అందించాలని, ఈశ్వరమ్మపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలనీ, బాధితురాలి బంధువు నాగన్న మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చెంచు కుటుంబాలకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వాలనీ, మంచినీరు, రవాణా సౌకర్యాలు కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

ఎడతెరిపివ్వని వాన

నవతెలంగాణ-విలేకరులు

మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానతో రాష్ట్రవ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రాష్ట్రంలోనే కాక, ఎగువన కర్నాటక, చత్తీస్‌గఢ్, ఒడిశా, మహరాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. గోదావరి ఉధృతిగా ప్రవహిస్తుండటంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. జూరాలకు వరద నీరు పోటెత్తడంతో శ్రీశైలంకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు.

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయానికి 41.9 అడుగుల వద్ద ప్రవహించిన నీటి మట్టం, రాత్రి 7గంటలకు 43 అడుగులకు చేరింది. దాంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి వల్ల భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఇంకా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులు గోదావరి వద్దకు వెళ్లొద్దని సూచించారు. వరద నీరు పెరగడంతో భద్రాచలం స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు నీటిలో మునిగిపోయాయి. ప్రస్తుతం భద్రాచలం వద్ద 9లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్ట్ 25 గేట్లు పూర్తిగా ఎత్తి 75,339 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్ట్ డీఈ తిరుపతి తెలిపారు. చర్ల మండల పరిధిలోని బత్తెనపల్లి సమీప రహదారి వరద బీభత్సానికి తెగిపో వడంతో అరణ్య గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా లింగాపురం పాడు చెరువు కట్ట తెగి పంట పొలాలు ధ్వంసం అయ్యాయి.

పరవళ్లు తొక్కుతున్న కృష్ణ

మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకొంటున్నాయి. కర్నాటకలోని ఆల్మట్టి, నారాయణపుర, ఉజ్జయిని ప్రాజెక్టులు నిండుకుండల్లా మారటంతో దిగువకు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆదివారం సాయంత్రం జూరాల ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరడంతో ప్రాజెక్టు 17 గేట్లు తెరిచి దిగువకు 64974 క్యూసెక్కులు, జల విద్యుత్ ద్వారా 31167 క్యూసెక్కుల చొప్పున మొత్తం 100749 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుత 7.798 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గాను ప్రస్తుత నీటిమట్టం 317.580 మీటర్లు ఉన్నాయి. జూరాల నీటి విడుదలతో శ్రీశైలంకు వరదనీరు పోటెత్తింది. అలాగే, బీమా లిఫ్ట్ ద్వారా 1300 క్యూసెక్కులు, నెట్టెంపాడు ద్వారా 1500 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాలువ ద్వారా 596 టీఎంసీల నీటిని దిగువకు వదులుతున్నారు.

చత్తీస్‌గఢ్, ఒడిశాలకు రాకపోకలు బంద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో గోదావరి పరివాహకంలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన టేకులగూడెం సమీపంలో 163వ జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు వెళ్లకుండా ట్రాక్టర్లు, ట్రక్కులు అడ్డుపెట్టారు. చర్ల మండలం వద్ద ఈత వాగుపై నుంచి వరద నీరు పారడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలం వద్ద సీతవాగు, గుబ్బల మంగి వాగు ఉధృతంగా ప్రవహించడంతో పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగింది. భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్లే ప్రధాన రహదారి చట్టి వద్ద వరద నీరు చేరడంతో రాష్ట్రాలకు రాకపోకలు నలిచిపోయాయి.

నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాజెక్టులు జలకళ

ఎగువ, పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు అధికారి కొత్త రవి తెలిపారు.



బుధవారం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి క్రమంగా వరద ప్రవాహం కొనసాగుతూ ఆదివారం సాయంత్రం 18,518 క్యూసెక్కుల వరద నీరు చేరినట్టు తెలిపారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల సమీపంలోని మంజీరా నది జలకళను సంతరించుకుంది. జూన్ నెలలో 1.2 మీటర్ల నీటిమట్టం నమోదుకాగా.. ప్రస్తుతం 3.050 మీటర్ల నీటిమట్టం పెరిగిందని సెంట్రల్ వాటర్ కమిషన్ జూనియర్ ఇంజనీర్ జవహర్‌లాల్ తెలిపారు. 15 రోజుల కిందట ఎడారిగా ఉన్న రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం జలకలతో ఉట్టిపడుతోంది.

నిండుకుండలా హుస్సేన్‌సాగర్

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నిండు కుండలా మారింది. దాంతో మారియట్ హెూటల్ వద్దనున్న మత్తడి వద్ద భారీగా దిగువకు దూకుతోన్న నీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపడంతో సందడి నెలకొంది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 514.75 మీటర్లు కాగా ప్రస్తుతం 513.23 మీటర్లు నమోదైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు.

కూలిపోయిన ఇండ్లు

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇండ్లు కూలి నిరాశ్రయులయ్యారు. రోడ్లు తెగిపోయాయి. వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం లోని సోమలతండా, దుబ్బ తండ గ్రామాల్లో ఇండ్లు నేలమట్టమయ్యాయి. కూలిపోయిన ఇండ్లకు స్థానిక ఎంపీడీవో సిలార్ సాహెబ్ పరిశీలించారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బుర్ర నర్సయ్య ఇల్లు కూలి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ తడిసి నిరాశ్రయులయ్యారు. ములుగు జిల్లా వెంక టాపురం మండల పరిధి రామ చంద్రాపురం గ్రామానికి చెందిన కాంతారావు పూరిల్లు కూలిపోయింది. వరంగల్ జిల్లా శాయంపేట గ్రామం నుంచి మైలారం రోడ్డు వరకు నిర్మించిన బీటీ రోడ్డు బుంగ పడింది. పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికి చెందిన బడే నాగరాజు, పాయం నగేష్ ఇద్దరు కలిసి చేపలు పట్టేందుకు పోట పల్లి వాగు చెక్ డామ్ వద్దకు వెళ్లి చాపలు పడుతుండగా వరద ప్రవాహం అధికం కావడంతో పాయం నగేష్ వరదలో కొట్టుకొనిపోయాడు. బడే నాగరాజు సురక్షి తంగా ఒడ్డుకు చేరుకున్నారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలో పిడుగు పడటంతో కాడెద్దులు మృత్యువాత పడ్డాయి.

బైక్‌పై రీల్స్‌చేస్తూ యువకుడి మృతి

- మరొకరి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-హయత్ నగర్



రీల్స్ కోసం బైక్ పై స్టంట్స్ చేస్తూ యువకుడి ప్రాణాలు కోల్పోయిన ఘటన హైదరాబాద్‌లోని హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీ నగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న మేడ శివ(20) సిద్దార్థ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా, అతని స్నేహితుడు సంపత్‌తో కలిసి ఒక బైక్‌పై, పవన్, విజయ్.. మరో బైక్‌పై ఎల్బీ నగర్ నుంచి పెద్ద అంబర్‌పేటకు వెళ్తున్నారు. లక్ష్మారెడ్డి పాలెం వద్ద ఉన్న జేసీబీ జంక్షన్ వద్దకు రాగానే రీల్స్ చేస్తూ బైక్ ముందు టైర్ భాగాన్ని పైకి లేపి వాహనం నడుపుతున్నారు. దాంతో వర్షం కారణంగా బైక్ అదుపు తప్పి ముందున్న స్కూటర్‌ను ఢీ కొట్టాడు. శివ కింద పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. వెనుక ఉన్న సంపత్‌కు తీవ్ర గాయాలు కావడంతో హయత్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మెరుగైన సమాజం కోసం అడుగులేయాలి

- దాశరథి జీవితం కవులు, కళాకారులు, ప్రజలకు స్ఫూర్తి : ప్రముఖ వాగ్గేయకారులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య స్ఫూర్తితో మెరుగైన సమాజం కోసం అడుగులు వేయాలని ప్రజా వాగ్గేయకారులు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కవులు, కళాకారులకు పిలుపునిచ్చారు. ఆదివారం దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి సభను నిజామాబాద్ నగరంలోని టీఎన్జీవోస్ భవన్‌లో సిర్ప లింగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ఆయన హాజరై మాట్లాడుతూ.. దాశరథి కృష్ణమాచార్య నిజాం నిరంకుశ పాలన, రజాకారుల అకృత్యాలకు బలవుతున్న తెలంగాణను చూసి చలించి.. ప్రజల కోసం గొంతువిప్పారని తెలిపారు. తన రచనల ద్వారానే ఊరూరా తిరిగి ప్రజల్లో చైతన్యం రగిలించారని అన్నారు.

తెలంగాణ పోరాటానికి వేగుచుక్కగా నిలిచిన దాశరథి.. 1925 జులై 22న మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూ రులో పుట్టారని, చిన్నప్పటినుంచే రచనలు చేసిన ఆయన నిరంకుశ పాలన పై కన్నెర చేశారని గుర్తుచేశారు. టీచర్‌గా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆలిం డియా రేడియో ప్రయోక్తగా ఉద్యోగాలు చేసిన దాశరథి.. అనేక ప్రక్రియల్లో రచన వ్యాసం కొనసాగించారన్నారు. వందలాది సినిమాలకు పాటలు రాశారని, ఉర్దూలో ఉన్న గాలిబ్ గజల్లను తెలుగులో అనువదించారని తెలిపారు. మానవ పరిమాణాన్ని కండ్లకు కట్టినట్టు వర్ణించిన "ఆ చల్లని సముద్ర గర్భం.. దాచిన బడ బాణాల మెంతో" అన్న గేయం తెలుగులో ఎంతగానో ప్రాచుర్యం పొందిందని గుర్తుచేశారు. తన రచనలకు గాను ఎన్నో అవార్డులు, బహుమతులు అందుకున్న దాశరథి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్థాన కవిగా కూడా కొనసాగారని తెలిపారు. ఆయన అక్షయ శిఖరమని కొనియాడారు.

అనంతరం కవి సమ్మేళనం, అనంతరం కళాకారులతో ఆటపాట కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో దాశరథి జయంతి నిర్వహణ కమిటీ నాయకులు కవి దారం గంగాధర్, దాసు, ఇందూర్ సాయి బాబా, శ్రీనివాస్ ఆర్య, చంద్రశేఖర్, కళాకారులు అష్టగం గాధర్, ఆర్టీసీ శ్రీనివాస్, లయోల సాయిలు, సురేష్ బాబు, అబ్దుల్, ఎస్.రంజిత్, కామినేని రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

నవతెలంగాణ - జనగామ కలెక్టరేట్



ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నందున నాణ్యమైన విద్య అందుతుందని, అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) తెలిపారు. ఆదివారం జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి విస్తృతంగా పర్యటిం చారు. ఇందులో భాగంగా పలు గ్రామాల ప్రజల ఆహ్వానం మేరకు గతంలో వరదలకు కొట్టుకుపోయిన జనగామ మండలం చీటకోడూర్ వాగుపై నిర్మించిన లో-లెవల్ కల్వర్టును పరిశీలించారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకత ఎంతో ఉందని ప్రజలు ఆయనకు విన్నవించారు. అనంతరం చౌడారం గ్రామానికి చేరుకొని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేశారు. గ్రామస్తుల కోరిక మేరకు పాఠశాలలో ఇటీవల మంజూరు చేసిన దాదాపు రూ. లక్ష బెంచీలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు ఎప్పుడు ఎలాంటి అవసరం ఉన్నా ప్రభుత్వంతో పాటు తన నుంచీ అవసరమైన మేరకు సహాయం అందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు శివరాజ్ యాదవ్, జనగామ పీఏసీఎస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ వ్యాసారం కరుణాకర్, తీన్మార్ మల్లన్న టీం మౌనిక, ఇతర సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయాలి

- వర్షాలతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ- కరీంనగర్

అధ్వానంగా తయారైన కరీంనగర్ స్మార్ట్ సీటీ రోడ్లను, డ్రెయినేజీలను తక్షణమే మరమ్మతులు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ నగరంలోని బోయవాడ, గంజ్, కట్టరాంపూర్, హనుమాన్‌నగర్, విద్యానగర్, తిమ్మాపూర్ మండలంలో తదితర ప్రాంతాల్లో వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్లు, డ్రయినేజీలను ఐద్వా బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మల్లులక్ష్మి మాట్లాడుతూ.. పేరుకే కరీంనగర్ స్మార్ట్‌సిటీ అని, నగర పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులకే రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీ గొప్పతనమంతా ప్రచార అర్భాటమే తప్ప అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. స్మార్ట్ సిటీపేరుతో ఖర్చు చేసిన రూ.కోట్ల ప్రజాధనం ఏమైందని ప్రశ్నించారు. గుంతలు పడి ఉన్న రోడ్లలో నీళ్ళు నిండటంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. తక్షణమే నగర పరిధిలో అధ్వానంగా ఉన్న రోడ్లు, డ్రెయినేజీలను మరమ్మతు చేయాలని, లేనిపక్షంలో నగర పరిధిలోని అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. పర్యటించిన వారిలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగరాణి, జిల్లా ఉపాధ్యక్షులు ద్యావ అన్నపుర్ణ, జిల్లా నాయకులు చేవి రోజారాణి,పి.దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'పెద్దవాగు' నిర్వాసితులకు పరిహారం అందిస్తాం

ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి కృషి

- ఏపీ మంత్రులతో సంప్రదించి నిధులు తెస్తాం
- వరదలో చిక్కుకున్న వారిని కాపాడిన అధికారులకు అభినందనలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




నవతెలంగాణ-అశ్వారావుపేట



గుమ్మడివల్లి సమీపంలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. రైతులు పంటలు కోల్పోయారు. చాలా మంది పాక్షికంగా, పూర్తిగా ఇండ్లు నష్టపోయి నిర్వాసితులయ్యారు. పశువులు, జీవాలు మృత్యువాత పడ్డాయి, ఎవరెవరు ఏమేమి నష్టపోయారో, ఎంతెంత నష్టపోయారో స్థానిక అధికారులు నివేదిక ఇచ్చిన వెంటనే సీఎంతో మాట్లాడి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వానలతో సామర్థ్యం మించి వరద నీరు చేరడంతో గండిపడ్డ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టును ఆయన ఆదివారం పరిశీలించారు. మార్గం మధ్యలో గుమ్మడివల్లిలోని నిర్వాసితులను, విద్యుధ్ఘాతానికి గురై మృతి చెందిన చాపర్ల మురళీ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పెద్దవాగు ప్రాజెక్ట్ అతిథి గృహం ప్రాంగణంలోని మహిళా డిగ్రీ కళాశాల భోజనశాలలో ఏర్పాటు చేసిన అధికారుల సమీక్ష అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. తాను మంత్రి కాకముందు రెండు వేల ఎకరాలు మాత్రమే సాగు అయ్యే ఈ ప్రాజెక్టును కాలువలు పెంచి, నీటి నిల్వలు పెంచడం ద్వారా పదహారు వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచామన్నారు. 1989లో మొదటిసారిగా ఈ ప్రాజెక్ట్‌కు గండి పడిందని గుర్తు చేశారు. అధిక వానలు, సామర్థ్యం మించి వరదలు వచ్చినప్పటికీ అధికారుల అలసత్వమే నేడు గండి పడి చుక్క నీరు లేని పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్‌లో ఇంతకంటే అధికంగా వరద నీరు చేరినా ఎటువంటి ప్రమాదం లేని రీతిలో రీ డిజైన్ చేసి తిరిగి ఈ ప్రాజెక్ట్‌ను పునరుద్ధరణ చేయిస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో భౌగోళికంగా ప్రాజెక్ట్‌తో పాటు 20 శాతం సాగు విస్తీర్ణం మాత్రమే తెలంగాణలో, మిగతా 80 శాతం విస్తీర్ణం ఆంధ్రాలోకి వెళ్ళిందని, దాంతో తెలంగాణ-ఆంధ్ర ఉమ్మడి ప్రాజెక్ట్ అయిందని ఈ కారణంగా అక్కడి ప్రభుత్వంతో చర్చించి, నిధులు రాబట్టి ప్రాజెక్ట్‌ను ఉనికిలోకి తీసుకుని రావడానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ప్రాజెక్టుకు గండిపడి వరద ముంపునకు గురైన గుమ్మడవల్లి, కొత్తూరు, అనంతారం గ్రామాల నిర్వాసిత కుటుంబాలకు తక్షణమే నిత్యావసర సరుకులు అందించి ఆదుకుంటామని అన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్.. వరదలో చిక్కుకున్న కూలీలు, రైతులను రక్షించిన తీరు, తీసుకున్న చొరవ అభినందనీయమని వారి సేవలను కొనియాడారు. వరదలో పలువురు చిక్కుకున్నారు అనే సమాచారం తనకు అందగానే ఆంధ్రా అధికారులతో మాట్లాడి ఎయిర్ లిఫ్టింగ్‌కు చర్యలు తీసుకోవాలని అభ్యర్ధించామని, అందుకనుగుణంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం జరగకుండా చూసినందుకు వారికి అభినందనలు తెలిపారు. మంత్రి వెంట ఆయిల్‌ఫెడ్ బోర్డ్ మెంబర్ ఆలపాటి రామచంద్రప్రసాద్, నారాయణపురం పీఏసీఎస్ అధ్యక్షులు, డీసీసీబీ డైరెక్టర్ నిర్మల పుల్లారావు, మొగళ్ళపు చెన్నకేశవ రావు, బండి భాస్కర్, జ్యేష్ట సత్యనారాయణ, దొడ్డా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'చితి'పై చివరి కోరిక



- అంతర్మథనంతో దగ్ధమైన సనాతనం

ఆసక్తి రేపుతున్న 'పైడిమర్రి' చివరి లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'యద్భావం తద్భవతి'... మనసులో ఏదైనా చేయాలని గట్టిగా అనుకుంటే అది కచ్చితంగా నెరవేరుతుందనేది గీతాచార్యుడి ఉద్బోధ. కానీ మనుసులో అనుకున్నవన్నీ అచరణలో చూపించలేని భౌతిక పరిస్థితులు అనేకం ఉంటాయి. సనాతన ధర్మాన్ని ఆచరించే వారంతా దానికి కట్టుబడి ఉన్నారనుకోవడానికి వీల్లేదు. పరిస్థితులు, సంప్రదాయాలు, వంశపారంపర్య ఆచార, కుటుంబ వ్యవహారాలతో కూడిన బ్రాహ్మణ్యం వదిలించుకోవడానికి అందర్లోనూ ఆ తెగువ ఉండొద్దూ..! మనసుని దహిస్తున్న అనేక సమాజ చైతన్య ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కుంటూ బ్రాహ్మణత్వాన్ని భారంగా భరిస్తున్న కుటుంబాలు అనేకం. వారంతా పైకి సనాతనులే. కానీ అంతర్మథనంలో కరడుగట్టిన కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యే వారే. ఆ కోవకు చెందినవారే పైడిమర్రి వెంకట సుబ్బయ్య. 89 ఏండ్ల వయసు వరకు సనాతనవాదిగా జీవించినా, తన మరణంలో మాత్రం ఆత్మ కర్మఫలం, అంతిమ సంస్కారాల భావజాలాన్ని వదిలేసి, భౌతికవాదాన్నే ఆశ్రయించారు. తన చివరి కోరికను సీల్డ్ కవర్లో పెట్టి 2009లోనే నలుగురు సంతానానికి ఇచ్చారు. దాన్ని తన మరణానంతరమే విప్పాలని షరతు విధించారు. వారం క్రితం ఆయన మరణించాక సంతానం ఆ లెటర్ విప్పి చదివి ఆశ్చర్యపోయారు. సనాతన కుటుంబంలో పుట్టి, పెరిగి, జీవించిన తన తండ్రి మనసులో ఇంతటి భౌతికవాద చైతన్యం ఉందా? అని ఆశ్చర్యపోయారు. అంతిమకోర్కె రూపంలో పైడిమర్రి వెంకట సుబ్బయ్య తన మరణవాంగ్మూలాన్ని తానే రాసుకున్నారు. ఆ లేఖలో ఇలా ఉంది. "నా మరణానంతరం పార్థివ శరీరానికి ఎలాంటి సంస్కారాలు చేయవద్దు. దగ్గర్లోని ఎలక్ట్రిక్ క్రిమెటోరియం ఉంటే దానిలో దహనం చేయాలి. బూడిదను కూడా అలాగే వదిలేయాలి. ఎక్కడా కలపవద్దు. ఎలక్ట్రిక్‌ది అందుబాటులో లేకుంటే, మామూలు దహనం చేయాలి. బూడిదను అలా వదిలేయాలి. ఎలాంటి మంత్రతంత్రాలు వద్దు. శరీరానికి స్నానం కూడా చేయించొద్దు. ఇది నా గాఢమైన కోర్కె. తీరుస్తారని ఆశిస్తున్నాను. మాసికాలు, తద్దినాల ప్రసక్తే లేదు" అని తన చివరి వాంగ్మూలాన్ని రాసిపెట్టుకున్నారు. ఇప్పుడాయన దహనసంస్కారాలు ఎలా చేయాలనే దానిపై ఆయన నలుగురు సంతానంలో పెద్ద చర్చనే రేపింది. అభ్యుదయభావాలు, కమ్యూనిస్టు సహచర్యంతో విజయవాడలో నివసిస్తున్న కుమార్తె పీ అరుణ ఇంట్లోనే ఆయన తుది శ్వాస విడిచారు. దహన సంస్కారాలపై చర్చోపచర్చలు జరిగాక, కుమార్తె తన నిర్ణయాన్ని కుండబద్దలు కొట్టారు. 'నాన్న చివరి కోరిక మేరకు దహనం చేసేట్లయితే ఇక్కడే చేయండి. లేదంటే ఆయన భౌతికదేహాన్ని మీ ఇండ్లకు తీసుకెళ్లండి' అని తేల్చిచెప్పారు. ఎట్టకేలకు కుమారులు, బంధువులు దానికి ఒప్పుకోక తప్పలేదు. ఆయన చివరి కోరిక ప్రకారమే దహన సంస్కారాలు జరిగాయి. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి పెరిగిన పైడిమర్రి వెంకట సుబ్బయ్య చివర్లో తనలోని అభ్యుదయ చైతన్యాన్ని ఇలా వెల్లడించారు. మరెందరో సనాతనులకు ఆదర్శంగా నిలిచారు. 'మరణం నా చివరి చరణం కాదు...మౌనం నా చితాభస్మం కాదు'... అంటూ అలిశెట్టి ప్రభాకర్ రాసిన కవిత్వం యాధృచ్ఛికం మాత్రం కాదు!!

లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్

మోడీ-షా ద్వయంపై బీజేపీ శ్రేణుల తీవ్ర అసంతృప్తి

- వారి విధానాలను తప్పుబట్టటానికీ వెనకాడని నాయకులు
- ఆయా రాష్ట్రాల్లో ఓటమిపై కారణాలూ వెల్లడి
- మిత్రపక్షాలు కూడా తగ్గటం లేదు
- యూపీలో యోగి బుల్డోజర్ విధానంపై ఆగ్రహం



లోక్‌సభ ఎన్నికల్లో పేలవ ప్రదర్శన అనంతరం బీజేపీలో ముసలం మొదలైంది. పార్టీ దారుణ ప్రదర్శనకు మోడీ-షా ద్వయం నాయకత్వ లోపమే కారణమని చెప్పటానికి పార్టీ శ్రేణులు ఏ మాత్రమూ సంకోచించటం లేదు. ఇప్పటి వరకు పార్టీలో తాము చెప్పిందే జరిగేవిధంగా ఏకఛత్రాధిపత్యం వహించిన మోడీ-షా ద్వయానికి ఈ మార్పు ఆందోళన కలిగించక మానదని రాజకీయ నిపుణులు, పరిశీలకులు అంటున్నారు.

న్యూఢిల్లీ : భారత ప్రధానిగా మూడోసారి 'చారిత్రక' విజయాన్ని స్వంతం చేసుకున్న మోడీ ఆ పదవిని చేపట్టి ఇప్పటికీ నెల గడిచింది. అయితే అతని నాయకత్వంలో బీజేపీ బలాన్ని తగ్గించుకున్నదని బీజేపీ శ్రేణులు అంటున్నాయి. మోడీ-షాల కేంద్రీకృత విధానాలు పార్టీకి తీవ్ర నష్టాన్ని తీసుకొచ్చాయనీ, పార్టీలో నాయకులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని కొందరు కాషాయ నాయకులు చెప్తున్నారు. లోక్‌సభలో బీజేపీకి మెజారిటీ తక్కువ వచ్చినప్పటి నుంచి దాని శ్రేణులు ఎన్నికల ప్రచారంలో పార్టీ లోపాల గురించి తమ నిజాయితీ అభిప్రాయాలను తెలియజేయటానికి వెనుకాడలేదు. మరీ ముఖ్యంగా, యూపీ, మహారాష్ట్ర వంటి ప్రముఖ రాష్ట్రాల్లోని బీజేపీ నాయకులు పార్టీ ఎన్నికల వ్యూహంలోని 'బ్రాండ్ మోడీ' ప్రధానాంశాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా దెబ్బతీసే విమర్శనాత్మక వాదనలను ముందుకు తెచ్చారు.

ఈ అంశం యూపీలో బీజేపీ పతనానికి కారణంగా మారిందనీ, ఇక్కడ 'ఇండియా' కూటమి దెబ్బకు పార్టీ దారుణంగా దెబ్బ తినాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాషాయపార్టీ నాయకులు చెప్తున్నారు. యూపీలో పార్టీలో తీవ్రమైన అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని అంటున్నారు. భారత్‌లో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రంలో ప్రతిపక్ష 'ఇండియా' బ్లాక్ నాటకీయంగా పునరాగమనం చేసిన వెంటనే.. రాష్ట్రంలో పార్టీ బలహీనపడిపోయిందన్న వాదనను స్వంత పార్టీలోనివారే వినిపిస్తున్నారు. ముఖ్యంగా, యూపీలో రాష్ట్ర ముఖ్యమంత్రి యోగికి తగిన స్వేచ్ఛను మోడీ-షా ద్వయం ఇవ్వలేదని అంటున్నారు. యోగిని ఎదగనీయకుండా షా ఇలాంటి ప్రయత్నాలను చేశారనీ, వెరసి యూపీలో బీజేపీకి తీవ్ర నష్టాన్ని తీసుకొచ్చిందని స్వంత పార్టీ వారే చెప్తుండటం గమనార్హం. ఎన్నికలకు ముందు, రాష్ట్రంలో అభ్యర్థులను ఎంపిక చేయటంలో మోడీ-షా ద్వయం యోగిని కాదని వ్యవహరించారనీ, వీరిలో ఎక్కువ మంది ఓడిపోయారని పార్టీలోని కొందరు నాయకులు గుర్తు చేస్తున్నారు.

బీజేపీలోని యూపీ శాఖలో కనిపిస్తున్న టెన్షన్ మిగతా రాష్ట్రాల్లోనూ ప్రతిబింబిస్తున్నది. రాజస్థాన్‌లో, 2019లో బీజేపీ 25 ఎంపీ స్థానాలను గెలుచుకోగా.. అది ఈ సారి ఎన్నికల్లో 14కి పడిపోయింది. అయితే, ఇక్కడ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ బలహీన నాయకత్వాన్ని బీజేపీ నాయకులు ఎత్తి చూపారు. అలాగే, వసుంధర రాజేను మోడీ-షా ద్వయం దూరం పెట్టిన విషయాన్ని కూడా వారు గుర్తు చేస్తున్నారు.

మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 2019తో పోల్చుకుంటే తీవ్రంగా పడిపోయిందని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తాము చాలా అసౌకర్యంగా ఉన్నామన్న విషయాన్ని బీజేపీ నాయకులు వెల్లడించారు. రాష్ట్రంలో ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీ), దళితుల ఓట్లను ఏకీకృతం చేయటంలో ఆయన విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలో పార్టీ దారుణ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ ఫడ్నవీస్ రాజీనామాకు ముందుకొచ్చారు. కానీ పార్టీ కేంద్ర నాయకత్వం పునరాలోచన చేయాలని కోరటంతో ఆయన వెనక్కి తగ్గిన విషయం తెలిసింది. అలాగే, ఇక్కడి బీజేపీ మిత్రపక్షాలు సైతం తమ ఆందోళనలు, అసంతృప్తలను చెప్పటానికి ఏ మాత్రమూ సంకోచించటం లేదు. మరోపక్క, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో సహా ఉద్ధవ్ థాక్రే, శరద్ పవార్‌లతో తెగతెంపులు చేసుకున్న పలువురు త్వరలో ఎన్డీఏను వీడొచ్చనే ఊహాగానాలు కూడా జోరందుకున్నాయి.

బీజేపీ మిత్రపక్షాలు కూడా తమ అభిప్రాయాల్ని చెప్పటానికి వెనుకాడటం లేదు. అప్నా దళ్ (సోనీలాల్)కి చెందిన ఓబీసీ నాయకురాలు అనుప్రియా పటేల్ యూపీ సీఎం యోగికి లేఖ రాస్తూ దళితులకు, ఓబీసీలకు రిజర్వ్ చేసిన ప్రభుత్వ ఉద్యోగాలు ఆయన పర్యవేక్షణలో జనరల్ కేటగిరీ దరఖాస్తుదారులకు కేటాయిస్తున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, నిషాద్ పార్టీ నాయకుడు సంజయ్ నిషాద్.. యోగి "బుల్డోజర్ మోడల్"పై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పేదలను ఏరివేస్తే, వారు రాజకీయాల్లో మనల్ని నిర్మూలిస్తారని తీవ్ర ఆరోపణలు చేశారు. రాబోయే రోజుల్లో ఈ తీరు మరింత పెరిగే అవకాశమున్నందున, పార్టీ రాష్ట్ర నాయకత్వానికి వ్యతిరేకంగా స్పష్టమైన భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇవన్నీ పరోక్షంగా మోడీ-షా ద్వయాన్ని లక్ష్యంగా చేసుకున్నాని అంటున్నారు.

మరోపక్క, పార్టీ అధ్యక్షుడి ఎంపిక కూడా దగ్గరపడుతున్న ఈ తరుణంలో.. మోడీ మరోసారి పార్టీలో తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని చూస్తారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. క్రమశిక్షణకు, సిద్ధాంతానికి కట్టుబడి ఉండే పార్టీగా చెప్పుకొనే బీజేపీలో.. ప్రస్తుత ఈ పరిణామాలు కాషాయపార్టీ నాయకులు, కార్యకర్తలను తీవ్ర కలవరానికి గురి చేస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

> మధ్యప్రదేశ్‌లో బీజేపీ తన పనితీరును మెరుగుపరుచుకోవటంతో అక్కడి నాయకుల్లో ఉన్న వ్యతిరేకత బయటపడలేకపోయిందని చెప్తున్నారు. మోడీ-షా ద్వయం రఘుబర్ దాస్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి ముఖ్యమంత్రులను ఎన్నుకున్న తర్వాత ఇలాంటి ఉద్రిక్తతలే పార్టీ నాయకుల నుంచి వ్యక్తమైనా.. ఆ సమయంలో బీజేపీకి బలీయమైన ఎన్నికల బలం ఉండటంతో ఆ విభేదాలు గుర్తించబడలేదని విశ్లేషకులు చెప్తున్నారు. మోడీ-షా ద్వయం బలహీనంగా ఉన్న సమయంలో బీజేపీ నేతలు సంకోచించకుండా తమ విమర్శలను ముందుకు తీసుకురావటంతో ఇప్పుడు ఆ పార్టీ ఆటుపోట్లకు గురవుతున్నదని అంటున్నారు.

> ప్రస్తుతం బీజేపీలో యోగికి వ్యతిరేకంగా వ్యవస్థీకృత ప్రచారం జరుగుతున్నందున బీజేపీలో గందరగోళం మరింత ముదిరే అవకాశమున్నదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో అగ్రవర్ణ ఠాకూర్ నాయకుడిగా పేరున్న యూపీ సీఎంను రాష్ట్రంలో పార్టీ బలహీనపరిచే నష్టాలకు బలిపశువుగా మార్చవచ్చనే ఊహాగానాలను వారు చేస్తున్నారు. యోగిని టార్గెట్ చేయటానికి ఇదే సరైన సమయమని మోడీ-షా ద్వయం భావిస్తుండొచ్చని స్వంత పార్టీ నాయకులే చెప్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై గందరగోళం వద్దు

- రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై గందరగోళం సృష్టించొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) కోరింది. అలాంటి ప్రకటనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది.

ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయలక్ష్మి, కె.సునీత లేఖను ఆదివారం పంపారు. ఇప్పటికే ఐసీడీఎస్‌లో పక్కా భవనాలు, మౌలిక వసతులు లేక టీచర్లు, హెల్పర్లు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని అమలు చేసే దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నట్టు అర్థమవుతున్నదని తెలిపారు. విద్యావ్యవస్థలో మార్పులు తేవాలనుకుంటే ఉపాధ్యాయ, విద్యార్థి, అంగన్‌వాడీ సంఘాలతో సమాలోచనలు చేసి వాటి సూచనలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

పైపై నిర్ణయాలతో ముందుకెళ్తే రాష్ట్ర భవిష్యత్తు మొత్తం అంధకారంలోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలనీ, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని కోరారు.

ఢిల్లీలో సీఎం మకాం



- కాంగ్రెస్ అధిష్టానంతో భేటీ
- రైతు కృతజ్ఞత సభకు రాహుల్‌కు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో భేటీ అయ్యేందుకు ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. కాంగ్రెస్ పెద్దలు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర ముఖ్య నేతలను కలిసి రాష్ట్రంలో చేపట్టిన రైతురుణ మాఫీ అంశాన్ని వివరించనున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇప్పటికే ఢిల్లీలో ఉన్నారు. వారితో కలిసి సీఎం రేవంత్ పార్టీ పెద్దలను కలవనున్నారు. ఎన్నికల ముందు వరంగల్ డిక్లరేషన్‌లో రుణమాఫీని ప్రకటించిన నేపథ్యంలో తిరిగి అక్కడే ఏర్పాటు చేస్తున్న రైతు కృతజ్ఞత సభకు రాహుల్‌ను ఆహ్వానించనున్నారు. పీసీసీ అధ్యక్షుడి ఎన్నిక, క్యాబినెట్ విస్తరణ అంశాలపై కూడా వారి మధ్య చర్చ జరిగే అవకాశముందని భావిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 35 కార్పొరేషన్లకు చైర్మెన్లను ప్రకటించారు. మరో 15 నుంచి 20 కార్పొరేషన్లకు చైర్మెన్లను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో మిగిలిన నామినేటెడ్ పదవులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కాంగ్రెస్ అగ్రనేతలతో సీఎం చర్చించనున్నారు. ఈ నెల 23 నుంచి శాసన సభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పట్లో మార్పులు చేర్పులు జరగక పోవచ్చని భావిస్తున్నారు. అయితే పదవుల పంపకాలు, పీసీసీ అధ్యక్షుని ఎంపిక తదితర అంశాలపై నేతల మధ్య సమోధ్య కుదిర్చే అంశంపై అధిష్టానం సీఎంకు పలు సూచనలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మేడిగడ్డపై సీఎం రేవంత్ సమీక్ష

ఎన్‌డీఎస్‌ఏ సమావేశంపై అధికారులకు దిశానిర్దేశం



మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు, పరీక్షలు, కమిషన్ విచారణ తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం ఆదివారం తన అధికారిక నివాసంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జ, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో సమావేశమయ్యారు. ఢిల్లీలో శనివారం జరిగిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలను మంత్రి ఉత్తమ్, అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. సోమవారం ఢిల్లీలో జరగనున్న ఎన్‌డీఎస్‌ఏ సమావేశంలో అధికారులు, ఇంజినీర్ల సమావేశంపైనా వారికి రేవంత్ పలు సూచనలు చేశారు. ఏ ప్రాతిపదికన చర్చలు జరిగినా రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగకుండా నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

బీజేపీబలహీనం

రైతాంగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఓటమి

- దేశవ్యాప్తంగా బలపడ్డ ఇండియా కూటమి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బలహీనపడిందనీ, 2019 ఎన్నికలతో పోలిస్తే సీట్లు కూడా తగ్గాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమలానగర్‌లోని సీపీఐ(ఎం) ఆఫీసులో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి వెంకట్ హాజరై మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి బలపడి పార్లమెంట్‌లో ఎన్డీఏ కూటమిని ధీటుగా ఎదుర్కొనే ప్రతిపక్ష హోదా కూడా పొందినట్టు తెలిపారు. రైతాంగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ ఓటమిపాలైందన్నారు. గతంతో పోలిస్తే ఉత్తర భారతదేశంలో కొంచెం బలహీనపడి దక్షిణ భారత్‌లో బలం పెంచుకున్నదని తెలిపారు. ఈడీ, సీబీఐ లాంటి రాజ్యాంగ సంస్థలను ప్రభుత్వ సంస్థలుగా మార్చుకుని ఆయుధాలుగా వాడుకున్నదని, వాటి ద్వారానే బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అంతేకాదు, ఎలక్షన్ కమిషన్ కూడా బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారిందని ఆరోపించారు. ఎగ్జిట్ పోల్స్ బీజేపీకి 400 పైన సీట్లు వస్తాయని చెబితే, ఇదే విషయాన్ని అన్ని నేషనల్ మీడియాలు ప్రచురించాయని, దీనివల్ల స్టాక్ మార్కెట్‌లో కోట్ల మేరకు షేర్లు పెరిగాయనీ, మోడీ అనుకూల శక్తుల ఆస్తులూ విపరీతంగా పెరిగాయని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో వామపక్షాలు స్వల్పంగా బలపడ్డాయనీ, సీట్ల సంఖ్య కూడా పెంచుకున్నట్టు తెలిపారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన బీజేపీ విధానాల్లో ఎలాంటి మార్పులేదని, దాన్ని నివారించాలంటే.. సీపీఐ(ఎం) మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటాలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఓటింగ్ 19శాతం నుంచి 35 శాతానికి పెరిగిందనీ, ఇది చాలా ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేయని పరిస్థితి ఉందనీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఒక్క హామీ తప్పితే 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ లాంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. రుణమాఫీ కూడా అర్హులందరికీ వర్తింపజేయలేదనే విమర్శలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం) ప్రతిపక్ష పాత్ర పోషించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రవి, ఎం.వినోద, ఎ.అశోక్, సీహెచ్.కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార కళను ఉత్తమంగా చూసే ధోరణి సరిగాదు

- ప్రత్యామ్నాయ విలువలతో కూడిన సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాలి : దాశరథి ఫిలిం సొసైటీ లఘుచిత్రాల పోటీల బహుమతుల ప్రదానోత్సవంలో నందిని సిధారెడ్డి
- సమాజాన్ని ఉన్నతీకరించే దిశగా అడుగులు పడటం శుభపరిణామం
- ఆకట్టుకున్న, ఆలోచింపజేసిన లఘు చిత్రాల ప్రదర్శన
- ఉత్తమ లఘుచిత్రంగా నిలిచిన 'అందరం ఓటేద్దాం'.



సుందరయ్య విజ్ఞాన కేంద్రం.. చైతన్య కేంద్రం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యాపార కళనే ఉత్తమ కళగా చూసే ధోరణి చెలామణి కావటం సమాజానికి శ్రేయస్కరం కాదని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దాశరథి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన పలు లఘుచిత్రాలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టెక్నాలజీ ప్రజలకు ఉపయోగపడాలనీ, సంస్కరించే దిశగా, సమసమాజం వైపుగా నడిపించేలా ఉండాలని ఆకాంక్షించారు. కానీ, నేడు అది వెర్రితలలు వేస్తున్న దశను చూస్తున్నామని వాపోయారు. అది మనుషులను పతనం దిశగా నడిపిస్తున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కొమ్రంభీమ్, అల్లూరి సీతారామరాజులతో సంబంధం లేకుండా వారి పేర్లను వాడుకుని గొప్పతనాన్ని, జీవితాన్ని అవమానించి ప్రపంచ స్థాయి సినిమా తీయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో దాశరథి ఫిలిం సొసైటీ చేస్తున్న కృషిని అభినందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఒక చైతన్య కేంద్రం అని ప్రముఖ కవి నందిని సిదారెడ్డి కొనియాడారు. ఎస్వీకే నుంచి సమాజాన్ని ఉన్నతీకరించే దిశగా అడుగులు పడుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మనుషులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రతామ్నాయ విలువలతో కూడిన సంస్కృతిని రూపొందించడంలో ఎస్వీకే ముందువరుసలో ఉందన్నారు. దాశరథి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక అంశాలతో కూడిన లఘు చిత్రాలు ప్రదర్శించడం శుభపరిణామం అన్నారు. దాశరథి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రజాకళను బతికించుకోవాలనే బలమైన ఆకాంక్షతో ఎస్వీకే మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజాకళలు, ప్రజా చైతన్యం వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. సీనియర్ టీవీ దర్శకులు పి.వి.చలం మాట్లాడుతూ..దాశరథి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆయనపై నృత్యరూపకాన్ని, లఘుచిత్రాన్ని ఊరూరా ప్రదర్శించాలని సూచించారు. చైతన్యసారధి దాశరథి నృత్యరూపకం నవరసాలనూ పండించిందని కొనియాడారు. తెలంగాణ అధికార భాషా సంఘం మాజీ చైర్మెన్ మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ..తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను, అందులో పాలుపంచుకున్న మహనీయుల చరిత్రను బుర్ర కథల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని దాశరథి ఫిలిం సొసైటీకి సూచించారు. ఆ బృహత్ కార్యానికి తన వంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారు. ఆత్మీయ అతిథులు సినీ నిర్మాత డాక్టర్ మూసా అలీఖాన్ మాట్లాడుతూ..సమాజానికి మంచి సందేశమిచ్చే అంశంతో లఘుచిత్రం తీయడానికి ముందుకొచ్చే వారికి సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. మెగా ఫౌండేషన్ నిర్వాహకులు లయన్ ఎం.నాగరాజు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఏడు వేల కోతులకు తన వంతుగా ఆహారాన్ని అందిస్తున్నానని చెప్పారు. విన్నో విద్యాసంస్థల చైర్మెన్ లయన్ డాక్టర్ జి.రవీందర్‌లు మాట్లాడుతూ..దాశరథి ఫిలిం సొసైటీ నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షులు ఎస్.వినయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ కార్యదర్శి బీడీఎల్ సత్యనారాయణ, సభ్యులు జి.బుచ్చిరెడ్డి, సోమయ్య, న్యాయ నిర్ణేతలు భాస్కర చంద్ర, మెర్సీ మార్గరెట్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య సారథి దాశరథి నృతరూపక ప్రదర్శన... బహుమతుల ప్రదానం

లఘుచిత్రాల పోటీల్లో 'అందరం ఓటేద్దాం' ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఆ చిత్ర బృందానికి రూ.20వేల నగదు పురస్కారం, మెమెంటోను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ద్వితీయ బహుమతి పొందిన 'ఆర్టీఐ' చిత్రబృందానికి రూ.15 వేల పురస్కారం, మెమెంటో ఇచ్చారు. తృతీయ బహుమతిని పొందిన 'విముక్తి' లఘుచిత్ర బృందానికి రూ.10 వేల నగదు పురస్కారం, మెమెంటో అందజేశారు. స్త్రీశక్తి, బొట్టు, కొండమ్మ లఘుచిత్రాలకు ప్రశంసాపత్రాలిచ్చారు. అంతకుముందు 26 ఎంట్రీల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ లఘుచిత్రాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలోచింపజేసింది. నందిని సిధారెడ్డి రూపొందించిన 'చైతన్య సారథి దాశరథి' నృత్యరూపకాన్ని ఇందిరా పరాశరం బృందం ప్రదర్శించింది. ఆ నృత్యరూపకం దాశరథి జీవితాన్ని, ఆ కాలం నాటి తెలంగాణ సామాజిక పరిస్థితులను, ఆయన పోరాటతత్వాన్ని కండ్లకు కట్టినట్టు చూపింది.

స్మితా సభర్వాల్ పై చర్య తీసుకోవాలి

- వికలాంగులకు రిజర్వేషన్ అవసరం లేదని చెప్పే హక్కు ఆమెకు ఎక్కడిది? : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులను కించపరిచే విదంగా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టిన ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌పై చర్య తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో వికలాంగులకు ఎందుకు రిజర్వేషన్ ఇవ్వాలని ట్విట్టర్ వేదికగా ప్రశ్నించడం ఆమె అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉద్యోగ నియామకాల్లో వికలాంగుల రిజర్వేషన్ అమలు చేయాలని కోర్ట్ తీర్పులు ఉన్నాయనే విషయం తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రతిభ ఎవ్వరి సొత్తు కాదని గుర్తు చేశారు. వికలాంగుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేసిన ఆమె వికలాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 2016 ఆర్‌పీడబ్ల్యూడీ రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.



మహావాక్యానికి మరణం లేదు

సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా, సారస్వత కాల్పనిక లోకాలు తరచి చూసినా సామాన్య మానవుడి కోసం గళమెత్తి గర్జించిన కవి దాశరథి. ఆటంకాలెన్ని ఎదురైనా, ఆయాసాలెన్ని అనుభవించినా రాత్రింబవళ్లు తెలంగాణను పలవరించిన కవి దాశరథి. దాశరథి బలం తెలంగాణ. తెలంగాణ రైతాంగ పోరాటం. ఆ పోరాటంలో లీనమై ఉప్పొంగిన పద్యధార. మాత్రాచ్ఛందంతో శ్రీశ్రీ మహాప్రస్థానం ఎట్లాంటి ప్రభంజనం సృషించిందో, పద్యంతో దాశరథి అగ్నిధార అంతటి ప్రభంజనం సృష్టించింది.

తెలుగు సాహిత్యంలో దాశరథిది ప్రత్యేకస్థానం. కవిత్వంలో నిప్పులు చిమ్ముతూ ప్రజాపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న స్థితి ఆ తరంలో మరెవరికీ కనిపించదు. దాశరథి సహజ ఆవేశపరుడు కనుక సాక్షిగా ఉండలేక పోయాడు. తానే చెప్పుకున్నట్లు దాశరథిది 'బహు ఉద్రేక ప్రకృతి' నిజం నిరంకుశ రాచరిక దుష్కృత్యాలు చూస్తూ సహించగలడా? ఉద్రేకపడ్డాడు. ఉడుకెత్తాడు. ఆయన తత్వంలో 'అగ్ని' కవిత్వంలో 'అగ్ని'. ప్రజాపోరాటంలో అగ్ని. దాశరథి భగ్గుమన్నాడు. 'నాగీతావళి ఎంత దూరం ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళమ్మున కగ్గివెట్టెదను" అని ప్రకటించుకున్నాడు.

'Art is born in struggle' క్రిస్టఫర్ కాడ్వెల్ మాటలు దాశరథికి సరిగ్గా అన్వయిస్తాయి. 'పోరాటంలేనిదే కళలేదు. కవితలేదు. నేను ఉద్యమైక జీవిని' అని చెప్పుకున్నాడు దాశరథి. పోరాటమే తెలంగాణ అస్తిత్వం. పోరాటమే దాశరథి కవిత్వం. ప్రబంధకవికీ ప్రజాకవికీ ఎంత వ్యత్యాసం? తూగుటుయ్యాల మీద ఊగుతూ చెప్పే కవిత్వం ఎక్కడ? జైలు గోడల నడుమ అర్ధరాత్రి రజాకార్ల దాడిలో నెత్తురు కక్కుతూ చెప్పే కవిత్వం ఎక్కడ? దాశరథి జైల్లో నెత్తురు కక్కుతూ కవిత్వం చెప్పాడు. ఊహ తెలియగల లేఖక పాటకోత్తములు కాదు గదా, కనీసం కలమూ కాగితమూ లేవు. ఉంటే లాక్కున్నారు జైలు అధికారులు. పళ్లు తోముకోవడానికిచ్చే బొగ్గు. బొగ్గే కలం. జైలు గోడే కాగితం. దాశరథి పద్యం రాశాడు.

"ఓ నిజాము పిశాచమా కానరాడు./ నిన్నుబోలిన రాజు మా కెన్నడేని/ తీగలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణ కోటి రత్నాల వీణ"

పద్యం చెప్పినందుకు ప్రబంధకవికి పసిడి కాసులు. ప్రజాకవికి లాఠీదెబ్బలు. దాశరథికి పడ్డా, ఆళ్వారుస్వామికి పడ్డా అవి దాశరథి పద్యానికి పడ్డ దెబ్బలే. అదీ దాశరథి జీవితం.

వరంగల్ జిల్లా చినగూడూరులో 22 జులై 1925 రోజున వేంకటమ్మ, వేంకటాచార్యులు దంపతులకు దాశరథి జన్మించారు. తండ్రి సంస్కృత పండితుడు. ఇంట్లో సంస్కృతంలోనే మాట్లాడాలన్నంత ఛాందసుడు. తల్లి తెలుగు సారస్వత ప్రేమికురాలు. మదర్సా బడుల్లో ఉర్దూ మాధ్యమం నడుమ దాశరథి బాల్యం. కఠిన నియమాల్ని ఎదిరించటం చిన్నప్పుడే అలవర్చుకున్నాడు. కేశవార్య శాస్త్రి నుండి సామాజిక భావనలు సమకూర్చుకున్నాడు. ఖమ్మం హైస్కూల్‌లో 'జక్కసాబ్' ద్వారా ఉర్దూ, పారశీక పాఠాల్లో కవిత్వ సౌందర్యాలు అందుకున్నాడు. పాఠశాలలో నిజాం ప్రార్థనా గీతాన్ని ఆలపించడం దాశరథికి నచ్చలేదు. పాడలేదు. అందుకు దెబ్బతిన్నాడు. బాల్యం నుండే దాశరథికి ఇష్టాయిష్టాలు బలంగా వుండేవి. ఉర్దూ ఇష్టం. జక్కీసాబ్ వినిపించి విప్పి చెప్పే గాలిబ్ గీతాలు ఇష్టం. ఇక్బాల్ గీతాలు ఇష్టం. ఇక్బాల్ గీతాల్లో విప్లవాగ్నులిష్టం. మంచినీళ్ల బావికి వచ్చే చుట్టాలమ్మాయి 'చూడామణి' ఇష్టం. ఆమె చూపులిష్టం. చుట్టూ గ్రామాల్లో దొరల దురాగతాలపట్ల కోపం. జాగీర్దార్లకు అండగా వుండే నిజాం దౌర్జన్యాల పట్ల కోపం.

దాశరథికి యౌవ్వనంలో కవిత్వమొక మోహం. ప్రియురాలొక మోహం. ప్రజావిప్లవం మరో మోహం. త్రేతాగ్నులుగా చెప్పుకున్నాడు. కేశవార్య శాస్త్రి, జక్కీసాబ్, చూడామణి ముగ్గురూ మూడగ్నులుగా భావించాడు. అంగారం, శృంగారం, దాశరథిని బలంగా ప్రేరేపించిన భావనలు. పొయెట్రీ అన్నా, పబ్లిక్ యాటిట్యూడ్ అన్నా చిన్నప్పట్నుండే దాశరథికి అభిమానం అన్నాడు హీరాలాల్ మోరియా.

ఇంటి కారణాల వల్ల దాశరథి 'గార్ల'లో గడపవలసి వచ్చింది. తన జీవితంలో అదే పెద్ద మలుపు. తన తిరుగుబాటు ఆలోచనలకు, తీవ్ర కార్యకలాపాలకు గార్ల కేంద్రంగా మారింది.

'గార్ల' జాగీరు. జాగీర్దారు అధీనంలోని గ్రామాల్లో ప్రజల బాధలు దుర్భరంగా వుండేవి. ఒకవైపు వెట్టిచాకిరి, మరోవైపు రకరకాల పన్నులు. పడీపడని వర్షాలు, పండీ పండని పంటలు, ఎళ్లీఎళ్లని సంసారాలు, బడుగు జీవుల బాధలు దాశరథిని ఉద్వేగపర్చాయి. జాగీర్దార్ల అత్యాచారాలు, వాళ్ల తాబేదార్ల హింసాకాండ, దౌర్జన్యాలు అతని పసిమనసును కలచివేశాయి. ఉడుకు రక్తంతో ఉద్రేక పడుతున్న దాశరథిని కమ్యూనిస్టులు ఆకర్షించారు. గార్ల జాగీరులోని కమ్యూనిస్టు పార్టీ ప్రజల్ని చైతన్య పర్చేది.

'గార్ల' జాగీరు. జాగీర్దారు అధీనంలోని గ్రామాల్లో ప్రజల బాధలు దుర్భరంగా వుండేవి. ఒకవైపు వెట్టిచాకిరి, మరోవైపు రకరకాల పన్నులు. పడీపడని వర్షాలు, పండీ పండని పంటలు, ఎళ్లీఎళ్లని సంసారాలు, బడుగు జీవుల బాధలు దాశరథిని ఉద్వేగపర్చాయి. జాగీర్దార్ల అత్యాచారాలు, వాళ్ల తాబేదార్ల హింసాకాండ, దౌర్జన్యాలు అతని పసిమనసును కలచివేశాయి. ఉడుకు రక్తంతో ఉద్రేక పడుతున్న దాశరథిని కమ్యూనిస్టులు ఆకర్షించారు. గార్ల జాగీరులోని కమ్యూనిస్టు పార్టీ ప్రజల్ని చైతన్య పర్చేది. 1942 నాటికి కమ్యూనిస్టు పార్టీ సెల్ సమావేశాలు, రహస్య చర్చలు నిర్వహిస్తే దాశరథి హాజరయి చైతన్యం ఆవహింపచేసుకున్నాడు. గిరిజన గూడాల్లో, కోయవాడల్లో తిరిగి చైతన్యపరుస్తూ గటక తిని, నీళ్ల తాగడం అలవాటు చేసుకున్నాడు. 'ఆంధ్ర మహాసభ' సమావేశాల్లో ఆంధ్రసారస్వత్ పరిషత్ సభల్లో ఉత్సాహంగా పాల్గొని ఉద్రేకంగా ప్రసంగించేవాడు. కవిత్వం ప్రసారం చేసేవాడు.

1944 ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవం ఓరుగల్లుకోటలో. సభలకు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షుడు. భారీ ఏర్పాట్లు, ప్రసంగాలు, కవి సమ్మేళనాలు. వేసిన చలువ పందిళ్లను రజాకార్లు రాత్రికి రాత్రి తగులబెట్టారు. ఉదయం కవులు వెళ్లేసరికి బూడిద, నివురు పొగలు పలకరించాయి. ఇంకెక్కడి కవిసమ్మేళనం? అని నిట్టూర్చారు కొందరు. ఇక్కడే, ఇప్పుడే, ఇట్లాంటి చోటే కవి సమ్మేళనం. నిప్పుల నడుమ నిజమైన కవిసమ్మేళనం అని దాశరథి కవిత అందుకున్నాడు.

"లడేంగే - జెర్ మరేంగే/ టూటేంగేనహీ - ఘుమకేంగే నహీ/ వద్దంటే గద్దె ఎక్కి పెద్దరికం చేస్తావా?/ దగాకోరు బడాచోరు రజాకారు పోషకుడవు/ దిగిపోవోయ్ - తెగిపోవోయ్"

దాశరథి కవన గర్జనలను ప్రతాపరెడ్డి మెచ్చుకున్నాడు. దేవులపల్లి రామానుజరావు పూలమాల వేసి కౌగిలించుకున్నాడు. కవి సమ్మేళనం జరిగిన ఘటన రజాకార్లను భంగపర్చిన చరిత్ర - భయపెట్టిన చరిత్ర.

మానుకోట తాలూకా జయవరంలో మరో సభ జరిగింది. రాత్రి సభలో పాల్గొని ప్రసంగించి తెల్లవారే సమయానికి చినగూడూరు చేరుకున్నాడు దాశరథి. భోజనం చేస్తుండగా తలుపు తట్టి పోలీసులు దాశరథిని అరెస్ట్ చేశారు. చేతులకు బేడీలు వేసి నడుముకు తాడు కట్టి తుపాకులు పట్టిన పోలీసులు నడిపించుకుంటూ 'నెల్లికుదురు' పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాపలా పోలీసులు తినేసమయంలో తాడు విడిచారు. దాశరథి తప్పించుకున్నాడు. వెంటపడ్డారు పోలీసులు. పశువుల మందనడ్డం చేసుకుంటూ పరుగెత్తి ముప్పై మైళ్ల దూరంలో 'నాగారం' గ్రామం చేరుకున్నారు. వేషం మార్చుకుని మళ్లా ఉద్యమం కార్యక్రమాల్లోకి వెళ్లాడు. 'పులులు చిలుకను బంధించగలవె చెపుమ' ఉద్వేగ వాక్యం ఎగిసిపడింది.

మానుకోట తాలూకా జయవరంలో మరో సభ జరిగింది. రాత్రి సభలో పాల్గొని ప్రసంగించి తెల్లవారే సమయానికి చినగూడూరు చేరుకున్నాడు దాశరథి. భోజనం చేస్తుండగా తలుపు తట్టి పోలీసులు దాశరథిని అరెస్ట్ చేశారు. చేతులకు బేడీలు వేసి నడుముకు తాడు కట్టి తుపాకులు పట్టిన పోలీసులు నడిపించుకుంటూ 'నెల్లికుదురు' పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. కావలా పోలీసులు తినేసమయంలో తాడు విడిచారు. దాశరథి తప్పించుకున్నాడు. వెంటపడ్డారు పోలీసులు. పశువుల మందనడ్డం చేసుకుంటూ పరుగెత్తి ముప్పై మైళ్ల దూరంలో 'నాగారం' గ్రామం చేరుకున్నారు.

తరువాత నిఘా ఉంచిన గార్ల పోలీసులు 1947 సెప్టెంబర్‌లో దాశరథిని అరెస్ట్ చేశారు. ఉద్యమకారుల రహస్యాలు చెప్పమని కొరడాలతో కొట్టారు. 'జిందా దఫ్నా దూంగా, ఖబడ్దార్' (సజీవంగా పాతిపెట్టిస్తా, జాగ్రత్త) అని గార్ల తాలూక్‌దారు హెచ్చరించాడు. అయినా దాశరథి వెరవలేదు. కేసు పెట్టి వరంగల్ జైలుకు పంపారు. అటునుంచి నిజామాబాద్ జైలుకు తరలించారు. అక్కడ పరిచయమయ్యాడు ఆళ్వారుస్వామి. రోజుకో పద్యం గోడమీద ప్రత్యక్షమయ్యేది. అధికారులు తుడిచివేసినకొద్దీ కొత్త పద్యం, లాఠీ దెబ్బలు పద్యాల్ని ఆపలేకపోయాయి.

నిజామాబాద్‌కు ఇందూరు మరో పేరు. ఇందూరు జైలు నిజానికి జైలు కాదు. అది రఘునాథ దేవాలయం. ఇందుపుర దుర్గం. నిజాం కాలాన జైలుగా అవతరించింది. దాశరథి పద్యం అవతరించింది. "ఒక కాలమ్మున ఇద్ది దేవళము, వేరొకప్పుడు దుర్గంబు. నేడకటా జైలయికానిపించెను. భవిష్యత్ కాలమునందు ఎట్టి రూపమున్ దాల్చునో" అని ఆవేదన చెందాడు.

1948 జనవరి 11, స్థానిక రజాకార్లు నిజామాబాద్ జైలుమీద దాడి చేశారు. ఎగబడి కర్రలతో కొట్టారు. ఎందరో రాజకీయ ఖైదీలు విపరీతంగా గాయపడ్డారు. 'కవిగాని సంగతి చూడండి' అరిచారు. దాశరథికి తీవ్రగాయాలయ్యాయి. ఖైదీలు తేరుకుని రజాకార్ల మీద ఎదురుదాడికి దిగారు. దుర్మార్గులు పరారయ్యారు. తర్వాత దాశరథి, మరికొందరిని చంచల్‌గూడ జైలుకు పంపించారు. ఆళ్వారుస్వామిని నాగపూర్ జైలుకు పంపారు. ఖైదీల్ని విడదీసినా ఉద్యమం మరింత ఉధృతమైంది. దాశరథి కవిత్వం మరింత ఉద్వేగభరితమైంది.

"వేదను దేవుళ్లను, దెయ్యాలను వేదను/ ఓడను రాజుకు, ధనరాజుకు రారాజుకు ఓడనన్నాడు".

స్థానికంగా కమ్యూనిస్టు ఉద్యమం, జాతీయంగా కాంగ్రెస్ ఉద్యమం రెండూ ప్రజా ఉద్యమాలే. కమ్యూనిస్టుల సమసమాజ భావన, కాంగ్రెస్ స్వేచ్ఛాస్వాతంత్ర్య భావన రెండూ దాశరథిని ప్రభావితం చేశాయి. దాశరథి రెండు ఉద్యమాలనూ ప్రేమించాడు. తన కవిత్వంలో రెండు ఉద్వేగాలు బలంగా ప్రతిఫలించాయి. **"అనాదిగా సాగుతోంది అనంత సంగ్రామం/ అనాథుడికీ ఆగర్భ శ్రీమంతుడికీ మధ్య/ సేద్యం చేసే రైతుకు భూమి లేదు పుత్ర లేదు/ రైతుల రక్తం తాగే జమిందార్లకు ఎస్టేట్లు"** అన్నప్పుడు **"రానున్నది ఏది నిజం/ అది ఒకటే సోషలిజం"** అన్నప్పుడు వ్యక్తమైంది కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తే.

"జెండా ఒక్కటే మూడు వన్నెలది, శాంతికోదండ ఉద్యద్విజయుండు గాంధి ఒకడే" అన్నప్పుడు, "నీ తుపాకి నిప్పులతో చేతులు కాల్చేసుకోకు, నీళ్లమీద నిప్పులు పడి చల్లబడకపోతాయా?" అని చల్లపర్చినప్పుడు కనిపించేది కాంగ్రెస్ దీప్తే మరి.

తన మిత్రుడు డి.రామలింగం చెప్పినట్లు 'మనసును వస్త్రం పరిచినట్లు పరుస్తాడు'. మనసే దాశరథి పద్యం. 'హృదయం వినా నా దగ్గర ఏ వస్తువు లభించదు'. అది దాశరథి అభివ్యక్తి. "దుష్టులతో రాజీ పడలేను. వారితో సామరస్యం చేతకాదు. శాంతిని కోరే క్రమంలో సమరసం కన్నా సమరమే ఇష్టం" అన్న సమయాన సమరమే దాశరథి దారి. అంతలోనే మనసు కుదుటపడుతుంది. "ఎవడైనా మానవుడే, ఎందుకు ద్వేషించడాలు. రాక్షసినైనా మైత్రికి రానిత్తును" ఆ సమయానా సహనమే. సమరసం వైపే మొగ్గు. గాలిబ్ కవితో, గాంధీ సూక్తో మనసులో మెరుస్తుంది. "ఏనాడెవ్వడు కత్తితో గెల్వలేడీ విశ్వమున్ ప్రేమ పాశానన్ కట్టుము" అంటాడు. గంజి దొరకని పేదలు కళ్లముందు కదులుతారు. ప్రాణాలు పణం పెట్టే ప్రజా ఉద్యమకారులు తలపుకొస్తారు. "ప్రాణం పోయినా కూడ సమ్మె గావింతుమటంచు ఆకట తపించెడి పేదల గూర్చి నేను మోగింతును రుద్రవీణ. పలికింతును విప్లవగీతికావళుల్" అని తన కవిత్వ తత్వాన్ని వ్యక్తం చేస్తాడు.

నిజాం రాచరికం కూలిపోయినప్పుడు అంత పరవశించాడు. "గెలిచినది గడ్డిపోచ, ఓడినది గొడ్డలి" అని వర్ణించాడు. తెలంగాణ విలీనాన్ని హర్షించాడు. 'విశాలాంధ్ర' కోసం పలవరించాడు. 'మూడుకోటులనొక్కటే ముడిబిగించి కలిసిపోగోరుచున్నదీ తెలుగునేల' అని కవితీకరించాడు.

విలీనంతోనే ప్రజాసమస్యలు పరిష్కారం కాబోవనే స్పష్టత వుంది. అరమరికలు లేకుండా దాశరథి అంతరంగం ప్రకటించాడు. "ఇంకా అధర్మం ఉన్నది హిట్లర్‌లు, రావణులు, నిజాములున్నారు. నా పోరాటం ముగియలేదు. ప్రజల పోరాటం ముగియలేదు. నా చేతిలోని కాగడా అందుకొని ఎవరో ఒకరు పురోగమిస్తారు".

ఉర్దూ సాహిత్యానికి వ్యాప్తి తెచ్చిన గజల్, రుబాయీ రూపాలను తెలుగుకు పరిచయం చేశాడు. ఆంగ్లేయులను ధిక్కరించి నానా హింసల పాలయిన ఢిల్లీ చివరి చక్రవర్తి బహదూర్ షా జఫర్ భావనల్ని ఆర్ద్రంగా పరిచయం చేశాడు. "గుండెలో నుండి బాణమ్ము గుంజివేయబోకు ప్రాణాలు దానితో పోవునోయి", "ఎవరు కనులు తిప్పి ఈ భూమి తిప్పిరో ధరణి ఆగకుండ తిరుగుచుండె".

దాశరథికి పద్యం మీద ఎంత పట్టుందో పాటమీద మరింత పట్టుంది. అంతకుమించి ప్రేమ. లలిత గీతాలు, సినిమా గీతాలు తిరుగులేని రుజువులు. ఎనభై వసంతాలు దరిజేరుతున్నా చెక్కుచెదరకుండా ఇప్పటి తరాన్ని కూడా అలరిస్తున్న గీతం - "ఆ చల్లని సముద్రగర్భం దాచిన బడబానలమెంతో, ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో" యౌవనోద్వేగంలో దాశరథి సంధించిన ప్రశ్నలు ఈనాటికీ వాడిగా, పదునుగా తాకుతాయి. 'పసిపాపల నిదుర కనులలో ముసిరిన భవితవ్యం, గాయపడిన కవి గుండెలలో రాయబడని వాక్యాలు' అన్ని కాలాల సందర్భాలకు అద్దం పడతాయి. తలనిండ పూదండ ధరించిన రాణి ఘంటసాల గొంతులో ప్రాణం పోసుకుని నడయాడుతుంది.

ఆధునిక కళారూపాల్లో సినిమా అత్యంత ప్రభావశాలి కళ. దృశ్య, శ్రవ్య, సాహిత్య, సంగీత, నాట్య సమాహార కళ. సినిమా గీతాలు రాయటం కోసం ఆకాశవాణి ఉద్యోగాన్నే వదులుకున్న ఉద్వేగపరుడు దాశరథి. ఆ మోహమే అతి పేదరికానికి దారి తీసింది. ప్రేమగీతాలతో రంజింపచేసినా వ్యథ గీతాలతో మనిషి బాధలు చిత్రించాడు.

దాశరథి పదికి పైగా కథలు రాశాడు. వాటిల్లో 'నిప్పు పూలు' ఉత్తమ కథ. తెలుగులో గుర్తింపు పొందిన ఏ గొప్ప కథకూ తీసిపోని కథలు. దాశరథి మరికొన్ని నాటికలు రచించాడు. వాటిల్లో 'త్యాగజ్వాల' జాతీయోద్యమాన్ని ఆకట్టుకునేలా ఆవిష్కరించింది. ఆయన రాసిన నవల 'మహాశిల్పి జక్కన్న' దాశరథి వచన రచనల మీద జరగవలసినంత పరిశోధన కానీ, చర్చ గానీ జరగలేదు.


'యాత్రాస్మృతి' దాశరథి ఆత్మకథ. ఉద్యమ జీవితాన్ని, కవిత్వ ప్రస్థానాన్ని చిత్రించే దృశ్య కావ్యం. వచనం, కవిత్వం చెట్టపట్టాలు వేసుకుని ఉద్వేగభరితంగా సాగుతాయి. చదువుతుంటే నరాల్లో రక్తం వేడెక్కుతుంది. మహా రచయితే కాదు, దాశరథి క్రియాశీల కార్యకర్త. ఒక సందర్భం ముందుకొచ్చి 1951 - 52 లో తెలంగాణ రచయితల సంఘం నిర్మించారు. తొలి అధ్యక్షుడు దాశరథే. ఊరూరా తిరిగి కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ సాహిత్య వాతావరణం విస్తరింపజేశాడు. హైదరాబాద్ వైవిధ్యం ప్రతిబింబించేలా బహుభాషా కవి సమ్మేళనాలు; తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ, బెంగాలీ, గుజరాతీ కవుల సందడి. జిల్లాల్లో, పట్టణాల్లో కొత్త రచయితలకు ఊపిరిలూదిన చరిత్ర.

'ధరకు సురాలయమ్మునకు దారులు వేసెడువాడె సత్కవీశ్వరుడు'. భూమ్మీద స్వర్గం నిర్మించడానికి క్షోభపడ్డాడు దాశరథి. క్షోభ లేకుండా ఏదీ రాయలేదు. క్షోభ తనదీ, ప్రజలదీ. విడదీయలేం. స్వసుఖం కోరుకున్న కవికాదు. ప్రజల సుఖం కోరుకున్న కవి దాశరథి. పిరికివాడు కవి కాలేడని ఆయన భావించాడు. సాహసోపేతంగా ప్రయాణించాడు.

వానగాలికి, వడదెబ్బకు భయపడని ప్రయాణం పేరు దాశరథి. ఆకలికి, అశ్రువులకు వెనుకాడని ధీరత్వం చిరునామా దాశరథి. శతజయంతి సందర్భంగా దాశరథి వినిపించే మహాసందేశం రాగబంధమే. ప్రజానురాగబంధం.

(జులై 22, 2024 దాశరథి శతజయంతి ఆరంభం సందర్భంగా)

- నందిని సిధారెడ్డి
9440381148



బొమ్మ

ఎల్లవేళలా పగబట్టే అమావాశ్య రాత్రుల్నే కలగనలేనుగా!
గున్నమామి లేలేత చివుళ్ళలో
తలదాచుకునే పిసినారి ఉదయాలు
మరిగి మసకబారిపోయే మధ్యాహ్న సమయాలు
సాంధ్య సమీరాల్లో విరబూసే ఏకాంతాలు
పున్నమి రాత్రుళ్ళతో పోరాడి ఓడి గెలిచిన నగ్నాగ్నావేశాలు
పిచ్చుక గూళ్ళల్లో తనకుతానుగా ఒదిగిపోయిన ప్రకృతిలా
విరామమెరుగని, బోసినవ్వుల సృష్టి రహస్యం ఇదంతా!
కరిగే పోయే కలల కల్లోలంలోనే కొట్టుకుపోలేనుగా!
హరివిల్లుల్ని వంచి పొదరిళ్ళ కౌగిట్లో భద్రపరిచే
ముక్కుపచ్చలారని బాల్యాకాశాలు
నింగి గర్భాన్ని చీల్చుకుని అప్పుడే
బైట కొచ్చిన నక్షత్ర సమూహాలు
ఎన్ని యుగాలు దాటుకొచ్చినా ఇదంతా ఎప్పటికప్పుడు
ఏపూటకాపూట మనసు నిండని పున:పున: పారవశ్యం
నింగి నేలకు మధ్య నిచ్చెన్లు కట్టిన
మనుషులెవరికీ పట్టని లేలేత పసితనమిదంతా
ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే సూర్యోదయమే కాదు
చల్లని వెన్నెలకు కూడా ఆలీనం తాను
ఎన్ని చెమట చుక్కలు ఆవిరైతేనో
టీకప్పులో సువాసనై గుభాళిస్తుంది
గుండె మాంసమై ఎంతగా కుతకుత ఉడికితేనో
అన్నం ముద్దై ఆకలి తీర్చుతుంది
నరాలు ఎంతగా నీరసించిపోతేనో
ఇల్లంతా రక్తపు దీపమై పరుచుకుంటుంది
వాక్యాలూ మరీ ఇంత బరువుగా
ఉంటాయా... అనుకోకూ!
పసుపు కుంకుమ పునాదుల మీద నిలబెట్టి,
అమ్మనంటావు సరే
ఆటబొమ్మను చేశావుగా దేవరా?!

- వైష్ణవి శ్రీ, 8074210263

నివాళి
సాహిత్య రంగంపై అడిగోపుల 'నిలువెత్తు సంతకం'



ప్రముఖ అభ్యుదయ కవి, రచయిత అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం ఉదయం తిరుపతిలో కన్నుమూశారు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు గ్రామంలో అడిగోపుల వెంకటయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు 1945 జులై 1న జన్మించారు. వృత్తిరీత్యా సివిల్ ఇంజనీర్‌గా కొంతకాలం గుంటూరు జిల్లాలో, ఆ తరువాత తిరుపతిలో పనిచేశారు. ఐదు దశాబ్దాలకు పైగా సాహితీ సేద్యం చేస్తూ 27 కవితాసంపుటాలు, 1 కథాసంపుటిని ప్రచురించారు. మార్క్సిస్టు భావజాలంతో మంచికోసం, మానవీయత కోసం తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన అభ్యుదయ రచయిత, కవి అడిగోపుల వెంకటరత్నం. వీరికి భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు.

'సూర్యదయం'తో ప్రారంభమైన ఆయన సాహిత్య ప్రస్థానం సాహిత్యలోకంపై 'నిలువెత్తు సంతకం' చేసి వెళ్లిపోయింది. వీరి తొలి కవితా సంపుటి 'సూర్యోదయం'కు ఆరుద్ర, రెండో కవితా సంపుటి 'ఎన్నాళ్ళీ చరిత్ర' కు ఆత్రేయ, 'మరణానికి రెండు ముఖాలు' కవితా సంపుటికి గుంటూరు శేషేంద్ర శర్మ వంటి ప్రముఖులు ముందుమాటలు రాశారు. చివరగా ఈ ఏడాది 'నిలువెత్తు సంతకం' కవితా సంపుటి వెలువరించారు. అడిగోపుల వారు రాసిన సూర్యోదయం (1984), ఎన్నాళ్ళీచరిత్ర (1985), జీవన పోరాటం (1986), బానిసత్వం అమ్మబడును (1987), మరణానికి రెండు ముఖాలు (1988), విప్లవానికి పురిటిగది (1990), అశ్రువీధిలో అగ్నిగానం (1991), యుద్ధమంటే మాకు భయంలేదు (1992), మట్టి మౌనం వహించదు (1994), మహాపథం (1996), రాతిచిగుళ్ళు (1998), అదృశ్యకుడ్యం (2000), సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు (2002), శ్వేతపత్రం (2004), విశ్వగీతం (2006), రంగుల చీకటి (2009), రేపటి వర్తమానం (2011), రెక్క విప్పిన రాగం (2013), రేపటి జ్ఞాపకం (2016), ముందడుగు (2017) పదండి ముందుకు (2019) , కాలం నా చేతిలో వుంది (కవితా సంపుటి) 2020, జయభేరి (కవితా సంపుటి) 2021, కొత్త గాలి (కవితా సంపుటి) 2022, నిలువెత్తు సంతకం (కవితా సంపుటి)2024.

వీరి కవితలు దేశంలోని 18 భాషల్లోకి, కథలు తమిళ, మళయాళ, కన్నడ భాషల్లోకి అనువాదం కాబడ్డాయి. 2008లో 'సమకాలీన తెలుగు తీరుతెన్నులు' అనే అంశంపై సిడ్నీలో ప్రసంగం చేశారు. 1991లో 'పురోగతి అంచున' కథా సంపుటికి నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి శ్రీశ్రీ స్మారక గోల్డ్ మెడల్ అందుకున్నారు. కుందుర్తి స్మారక అవార్డు, తానా అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవార్డు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిష్ఠాకర ప్రతిభా పురస్కారం, 2014 లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు చే "కవిరత్న" బిరుదు ప్రదానం. 2015లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం, కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారం, ఫ్రీవెర్స్ ఫ్రంట్ పురస్కారం వంటి అనేక అవార్డులు అందుకున్నారు. వీరి రచనలపై ఇప్పటికీ నాగార్జున, వెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు కొనసాగుతున్నాయి. వీరికి తెలంగాణ సాహితి తరపున నివాళులు.

- అనంతోజు మోహన్‌కృష్ణ, 91 88977 65417

'సోమేపల్లి' పురస్కారాలకు చిన్నకథలు ఆహ్వానం

సోమేపల్లి సాహితీ పురస్కారాల కోసం చిన్న కథలను ఆహ్వానిస్తున్నారు. అత్యుత్తమ కథకు రూ.2500/-, ఉత్తమ కథకు రూ.1500/-, మంచి కథకు రూ.1000/- ప్రత్యేక బహుమతులు రూ.500/-చొప్పున ఇద్దరికి ఇస్తారు. ఈ పురస్కారం కొరకు పంపే కథల నిడివి రాతప్రతిలో 2-4 పేజీలలోపు, డి.టి.పిలో 2 పేజీలు ఒక ప్రక్కనే రాయాలి. ఒకరు ఎన్ని కథలైనా పంపవచ్చు. కథ పుటలపై రచయిత పేరుగానీ, ఆయా వివరాలు గానీ వుండకూడదు. కథలను ఆగస్టు 30వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 (సెల్:9247475975) చిరునామాకు పంపాలి. విజేతలకు నగదు బహుమతులతోపాటు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ప్రత్యేక సభలో సత్కరించబడుతుంది.

- వశిష్ట సోమేపల్లి, చలపాక ప్రకాష్

రా! రాతి గోడలు బద్దలుకొట్టుకొని

రా! రాతి గోడలు బద్దలుకొట్టుకొని
రక్షణ వలయంగా మోహరించిన రాగచెమ్మ
కర్కశ కరవాలానికి ఎరగా ఏమార్చబడకుండా
పసిరెమ్మలకు ప్రాణవాయువునందించే పిత్రు కొమ్మ
అసంగత అమ్మకానికి పాల్పడకుండా
అప్రమత్తంగా కాపలా కాయాల్సిన కనురెప్ప
ప్రమత్తతలో కంటిపాపను కాటేయకుండా
మందకు మాలిమైన మేకవన్నె పులి
మాయాజూదంలో మయూరాల్ని
మట్టుపెట్టకుండా
మొగలివనంలో మిసమిసబుసకొట్టే మిన్నాగు
దోగాడే వెన్నెల సిరులను వేలంలో
వెలకట్టనీయకుండా
కంకరారణ్యంలో కలియదిరిగే కాలసర్పం
కౌటిల్యంతో క్రౌంచ పక్షులను ఎడబాపకుండా
రోడ్లపై అడ్డదిడ్డంగా సంచరించే అడ్డాకుక్కలు
ఆగడాల అగడ్తలతో విస్తర్లను చించకుండా
రెండుకళ్ళసిద్ధాంతానికి ససేమిరా అనే సన్నాసులు
దుస్తంత్రాలతో ఒంటికాలిపై విసురుగా లేవకుండా!
చీకటికొట్టులో శిలువవేయబడిన ఓ శిలాఫలకమా
మూఢత్వ ముసుగును ఎడమకాలితోతన్ని తగలేసి
చెరవీడిన జలపాతపు హృదయహోరువై
ఉరితీయబడని ఉషోదయ ఊయలపాటపై
అట్టడుగు మెట్టునుండి
ఆపాత మధుర ఆరోహణతో
ఆకాశ నక్షత్రాలను కరచాలనం చేయడానికి
విశ్వనొక విమల సంగీతాన్ని వినిపించడానికి
రా! రాతి గోడలు బద్దలుకొట్టుకొని త్రినయనివై!!

- కరిపె రాజ్‌కుమార్, 8125144729

చొప్పదండి ఎస్ఐగా జి.అనూష



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి ఎస్ఐగా జి.అనూష పోలీస్ స్టేషన్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 11మంది ఎస్సైలను బదిలీ చేస్తూ శుక్రవారం పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఈ బదిలీల్లో భాగంగా కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని చొప్పదండి పోలీస్ స్టేషన్లో ఇప్పటివరకు పనిచేసిన ఎస్సై ఉపేంద్రచారి కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 2018 బ్యాచ్ చెందిన ఎస్సై జి.అనూష చొప్పదండికి వచ్చారు. ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి.అనూష మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ఎల్లవేళల అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ఆమెకు చొప్పదండి పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎడతెరిపి లేని వాన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు

- మరో మూడు రోజుల పాటూ కొనసాగనున్న ముసురు
- అన్ని మండలాల్లో సాధారణాన్ని మించిన వర్షపాత నమోదు
- ఉస్సేన్‌మియా, మోయతుమ్మెద, మానేరువాగులో మొదలైన వరద ప్రవాహం
- ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 42వేల క్యూసెక్కులు దాటిన ప్రవాహం
- మిగిలిన ప్రాజెక్టుల్లోకి వెయ్యి క్యూసెక్కులలోపే వస్తున్న ప్రవాహం
- రామగుండం ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- కరీం'నగరం'లో లోతట్టు ప్రాంతాల్లో వరదమళ్లింపు చర్యలు
- సహాయకచర్యలకు దిగిన 64 మందితో 3 బందాల రెస్క్యూటీం
- భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి :నాలుగు జిల్లాల కలెక్టర్ల ప్రకటనలు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

శనివారం ఉదయం నుంచి రెండు రోజులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తోంది. పలు చోట్ల మోస్తారు నుంచి భారీ వర్షమే పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఆదివారం నాటికి సాధారణానికి మించి అధిక వర్షపాతమే నమోదైంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రధాన మానేరు, గోదావరిలోకి పరివాహక ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లాలో ఉస్సేనిమియా, కరీంనగర్ జిల్లా పరిధిలోకి వచ్చే మోయతుమ్మెద వాగులోనూ వరద ప్రారంభమైంది. ఇప్పటికే డెడ్‌స్టోరేజీలో ఉన్న ప్రధాన జలాశయాల్లో స్వల్పంగానే వదర ప్రవాహం మొదలైంది. ఒక్క శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువన కడెం నుంచి, పరివాహక ప్రాంతాల నుంచి 42వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. మరోవైపు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతుండగా..ఆయా మున్సిపల్, పంచాయతీ సిబ్బంది వరద మళ్లించే పనిలో పడ్డారు. సహాయకచర్యలకు నాలుగు జిల్లాల కలెక్టరేట్ల నుంచి టోల్‌ఫ్రీ నెంబర్లు ప్రకటించారు. మరోవైపు రామగుండం పరిధిలోని ఓసీపీల్లో వరద చేరడంతో బొగ్గుఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.

శనివారం ఒడిశా తీరం వద్ద చిలికా సరస్సు వద్ద 19.6 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 85.4 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకతమై ఉన్న వాయుగుండం అదే రోజు రాత్రికి అల్ప పీడన ప్రాంతం గా బలహీనపడింది. ఇది వాయువ్య దిశలో కదిలి ఆదివారం ఉదయం అంతర్గత ఒడిషా, దాని సమీపం లోని ఛత్తీస్‌ఘడ్ ప్రాంతం లో కేంద్రీకృతమైనట్టు వాతావరణశాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజులూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపింది. పలు చోట్ల భారీ వర్షసూచన సైతం చేసింది. ప్రస్తుతం రెండురోజులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ఆదివారం ఒక్క రోజే దాదాపు అన్ని మండలాల్లో 70మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడం గమనార్హం.

వర్షాలతో నగర పాలక సంస్థ అప్రమత్తం

ఎడతెరిపి లేకుండా కరుస్తున్న వర్షాలతో కరీం'నగర' పాలక సంస్థ అప్రమత్తమైంది. 64 మందితో కూడిన మూడు బృందాలు 24గంటల పాటు సహాయకచర్యలకు దిగాయి. ఇప్పటికే గుర్తించిన 107 శిథిల గృహాల్లో 20కిపైగా ఇండ్లను తొలగించారు. డీఈల ప్రత్యేక నోడల్ అధికారుల సమక్షంలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది నగరంలో పలు చోట్ల విరిగిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంబాలను తొలగిస్తున్నారు. వీరితోపాటు నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫూల్ దేశాయ్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షం కారణంగా నిలిచిన నీటిని డ్రైనేజీలోకి మళ్లిస్తూ పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగిస్తున్నారు. ఇప్పటికే కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అత్యవసర సేవల కోసం 24గంటల కాల్‌సెంటర్ (9849906694)ను ఏర్పాటు చేశారు. ఈ సహాయక చర్యల్లో డీఈలు ఓం ప్రకాష్, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, అయూబ్ ఖాన్, యాదగిరి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి, నవీన్, రాజు, ఎన్వీరాల్ మెంట్ ఇంజనీర్ స్వామి, ఏఈలు గట్టు స్వామి, గఫూర్, ఎస్సై ల, గట్టు శ్రీనివాస్, వెంకన్న, నర్సోత్తం, మహేంధర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బొమ్మకల్ బైపాస్‌రోడ్డులో వరదనీటిని మళ్లిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరద

- శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో శనివారం ఉదయం వరకు ప్రాజెక్టు 20.175టీఎంసీల సామర్థ్యానికిగాను 5.71టీఎంసీల నీళ్లు మాత్రమే ఉండేవి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 2వేల క్యూసెక్కులతో మొదలైన వరద ఆదివారం అర్ధరాత్రివరకు 42,314 క్యూసెక్కుల నీరు వరకు పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.8779టీఎంసీల నీటికి చేరింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులోకి కడెం డ్యామ్ నుంచి 14,333క్యూసెక్కుల నీరు వస్తుండగా.. పరివాహక వాగులు, వంకల నుంచి 27,981క్యూసెక్కులు వస్తోంది.
- ఎగువ మానేరు డ్యామ్‌లోకి ఆదివారం నుంచి ఉదయం స్వల్ప వరద వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి కేవలం 360క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు 2టీఎంసీల సామర్థ్యానికిగాను 0.39టీఎంసీల నీరు ఉంది.
- కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్‌లోకి కూడా 25క్యూసెక్కుల స్వల్ప వరద వచ్చి చేరుతోంది. 3.50టీఎంసీల సామర్థ్యం ఉన్నఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.774టీఎంసీల నీరు మాత్రమే ఉంది.
- మధ్యమానేరు జలాశయంలోకి మూలవాగు, మానేరు నుంచి వరద వచ్చి చేరుతోంది. రాజన్నసిరిసిల్ల వేములవాడ,రుద్రంగి, చందుర్తి, బోయిన్‌పల్లి, తంగళ్లపల్లి మండలాల పరిసరాల నుంచి అటు మానేరు, మూలవాగుల నుంచి ప్రాజెక్టులోకి 1850క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు 27.54టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 5.67టీఎంసీల నీరు మాత్రమే ఉంది.
- దిగువమానేరు జలయాశయం ప్రస్తుతం డెడ్‌స్టోరేజీలో ఉంది. 24.034టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ డ్యామ్‌లో ప్రస్తుతం 5.135టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం మానేరువాగులోకి 771క్యూసెక్కుల ఇన్‌ఫ్లోమాత్రమే వస్తోంది.

ప్రజలు ఎలాంటి ఆందోళనా చెందవద్దు

- కరీంనగర్ నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

'నగర ప్రజలు ఎలాంటి ఆందోళనా చెందవద్దని... మీ రక్షణే మా ధ్యేయం' అని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నగరంలో శనివారం అర్ధరాత్రి నుంచి లోతట్టు ప్రాంతాలు, వరద నీటిని మళ్లించే చర్యలు చేపట్టామని తెలిపారు. నగరపాలక సంస్థ రెస్క్యూ టీం సిబ్బంది, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ అధికారులు సిబ్బంది అప్రమత్తమై సహాయక చర్యల రంగంలోకి దిగారని చెప్పారు. ఆదివారం రోజు ఉదయం 5 గంటలకే తాను, కమిషనర్ ప్రఫూల్ దేశాయ్ వేరు వేరుగా నగరంలో పలు చోట్ల పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తున్నాని తెలిపారు. ఓపెన్ స్థలాల్లో నీరు నిలిస్తే ప్రత్యేక ట్రాక్టర్ మోటార్ల సహాయంతో నీటిని తొలగిస్తున్నామయని తెలిపారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలిపోయే ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితులలో కంట్రోల్ రూమ్ నెంబర్ 18005995459, 8008469511 నెంబర్లను సంప్రదించాలనిలి కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రజలెవరూ ఇండ్లనుండి బయటికి వెళ్లవద్దు

రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలెవరూ ఇండ్ల నుంచి బయటకు వెళ్లవద్దని, జిల్లా సమీకృత కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం హెల్ప్ లైన్ నెంబర్ ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటన లో తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు నిండి ఉన్న దష్ట్యా అధికారులు కనిపెట్టుకుంటూ ఉండాలని సూచించారు. ముఖ్యంగా సిరిసిల్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను, జిల్లా వ్యాప్తంగా శిథిలమైన ఇండ్లలో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.

వృత్తి ఎక్సైజ్ పోలీసు.. ప్రవృత్తి సాహిత్యం

- కార్మికుడిని నుండి హెడ్‌కానిస్టేబుల్‌గా
- ఆయన సేవలకు అవార్డులు దాసోహం

నవతెలంగాణ - కరీంనగర్

సమాజంలో జరగుతున్న పరిణామాలు, సామన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అతడిని కదిలించాయి. ఎక్సైజ్ పోలీసుగా విధులు నిర్వహిస్తునే స్నేహితుల సహకారంతో సాహిత్య రంగం వైపు అడుగులు వేశారు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్. గతంలో ఆయన పేరు కొంత మందికే తెలసు, ఇప్పుడు రాష్ట్రంలో సాహితివేత్తగా, కళారంగం, సామాజిక సేవారంగాలలో ఆయన సుపరిచితులయ్యారు. కరీంనగర్‌కు చెందిన పసుల రవి తొలుత కార్మికుడిగా జీవితాన్ని ఆరంభించి అకుంటిత దీక్ష, శ్రమతో కానిస్టేబుల్ అయ్యి తరువాత హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొందారు. విధి నిర్వహణతో పాటు సమాజం శ్రేయస్సు కోసం పాటు పడుతున్నారు. ఉద్యోగం చేస్తునే కలం పట్టి కవితలు, పాటలు రాస్తూనే సమాజానికి ఉపయోగపడేలా అందరిని ఆకర్షిస్తున్నారు. సమాజ మార్పుకోసం సోషల్ మీడియా వేదికగా తన కవితలను చేరవేస్తు పలువురిలో మార్పుకు శ్రీకారం చుట్టారు. ఇంతటితో ఆగకుండా తన నెలవారి జీతం నుండి సమాజ సేవకు ఉపయోగిస్తున్నారు. పేదలకు అన్నదానం, తొచిన సహాయం చేస్తూ అందరి మన్నలను పొందుతున్నారు. ఆయన సేవలను గుర్తించిన పలు స్వచ్ఛంద సంస్థలు ఆయనకు అవార్డులు, సత్కరాలతో సన్మానాలు చేస్తున్నాయి.





కార్యక్రమంలో అవార్డు అందుకుంటున్న పసుల రవి

ప్రజల్లో చైతన్యం కల్గించిన కవిత్వాలు..

ఆరోగ్యనికి రక్షణ పచ్చనిచెట్లు.. ప్రగతికి మెట్లు పచ్చని చెట్లు అంటూ హరితహారంపై రాసిన కవిత అందరిని ఆకట్టుకుంది. భూమిపై మక్కువతో మనకు అమ్మ తర్వాత ఈ నెల తల్లి అమ్మపై ప్రేమతో 'అవ్వ అవ్వ అవ్వనేను పోతున్న దుబాయ్‌దేశం'.. పోతే జరిగే నష్టాలుగూర్చి బాగారాశారని పలువురి ప్రశంసలుపోందారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలు, అంతరించిపోతున్న భూగర్భ జలాలు, పిల్లలు తల్లిదంద్రులను మర్చిపోయి ఆశ్రమాలలో వదిలి స్మార్ట్‌పోన్‌లతో తల్లిదండ్రులను బాధ్యతను మరచిన కొడుకులపై రాసిన కవితా అందరిని కంటతడి పెంటించింది. రైతన్నల బాధలపై రాసిన కవితా అందరిని ఆకట్టుకుంది. మద్యం, డ్రగ్స్, బాలకార్మికులు ఇలా అనే సమాజిక అంశాలపై చైతన్యవంతమైన కవితలు రాశారు. ఎస్‌ఎస్ 24 టీవీ సంస్థ ఆధ్వర్యంలో కాకతీయ మహనంది పురస్కారం అందజేశారు. గుండి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నిర్మాణం కోసం డాక్టర్ రాచూరి రాజన్న, రాచూరి శ్రీహరి, రాచూరి రత్నయ్య, డాక్టర్ శ్యాంసుందర్, విశ్వనాథం, సుధాకర్‌కు చెందిన రూ.30లక్షల విలువ గల భూమిని గుండి గ్రామ ప్రజల కోసం ఉచితంగా అందజేశారు. ఇండియన్ ఐకాన్ అవార్డు గ్రహిత సామాజిక సేవలును స్పూర్తిగా తీసుకోని తామే సైతం తమ భూమని గ్రామ ప్రజల కోసం ఉచితంగా అందించినట్ల పేర్కొనడం గమనార్హం.

అందుకున్న సత్కారాలు..

వృత్తిరీత్యా ఉద్యోగి అయినప్పటికి తన కవిత్వాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకరావడంతో పాటు, సామాజిక కార్యక్రమాల్లో ఆయన చేస్తున్న సేవలు గుర్తించిన పలు సంస్థలు అవార్డులు, సన్మానాలతో సత్కరించాయి. గాన కోకిల కళానిలయం అధ్వర్యంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, నమిలికొండ రమణాచార్య స్వామి చేతుల మీదుగా ఉగాదిపురస్కారం జ్ఞాపిక అవార్డు ఇచ్చి సన్మానించారు. కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్స్ జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గుండెటి రాజు స్వరాభిషేకం కార్యక్రమంలో పూటూరి వైకుంతం స్మారకార్థం కళాశ్రీ విశిష్ట పురస్కారాన్ని స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. కళా శ్రీ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహిత సి.నారాయణరెడ్డి జయంతి మహోత్సవ కార్యక్రమంలో సినారె సాహిత్య పురస్కార కవి రత్న పురస్కారం స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు. వసుంధర విజ్ఞాన మండలి 31వార్షికోత్సవంలో భాగంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో వివిధ రంగాలలో కళారంగం సామాజిక సేవలు చేస్తున్న పసుల రవికుమార్ ఆయన సతిమణీ మల్లీశ్వరికు ఆదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహరెడ్డి చేతుల మీదుగా స్పూర్తి పురస్కారంతో సత్కరించారు. కళారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు కాకతీయ మహానంది పురస్కారం అందజేశారు.

అవార్డులు, సత్కరాలతో మరింత బాధ్యత పెరిగింది

పసుల రవి, ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్, సాహితివేత్త

హెడ్ కానిస్టేబుల్‌గా సంతృప్తి ఉన్నప్పటికి ఏదో లోటు.. సమాజానికి తనవంతుగా ఏమైనా చేయాలనే తపనతో నాకు చిన్నానాటి నుంచి ఉన్న కవిత్వాలపై మొగ్గు చూపాను. నేను చిన్నతనంలోను ఉద్యోగం సాధించే వరకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. చిన్న సాయంచేస్తే బాగుండు అనుకున్న అప్పుడు నాకు ఎవరు సహాయం చేయలేదు. నేను అలాకాదు నాలా ఎవరు ఇబ్బంది పడవద్దని నాకు తోచినంతలో సహాయాలు చేస్తున్నాను. సేవలో ఉన్న తృప్తి ఎందులో ఉండదు. అవార్డులు, సత్కరాలతో సమాజం పట్ల మరింత బాధ్యత పెరిగింది.



పసుల రవిని సన్మానిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

డీఎస్పీ రఘుచందర్

నవతెలంగాణ-మల్యాల

కొండగట్టు ప్రాంతంలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండారి స్వామి కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో తన మోటార్ సైకిల్‌ని రోడ్డు పక్కన ఆపి మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో అక్కడే చెట్ల పొదలలో మద్యం సేవిస్తున్న గుర్రం వెంకటేష్ (రాజారాం గ్రామం), మల్యాల విష్ణువర్ధన్ (మల్యాల గ్రామం) బండారి స్వామిపై కర్రలతో బెదిరించి మెడలో ఉన్న బంగారు చైను, చేతికి ఉన్న మూడు తులాల వెండి బ్రాస్‌లెట్, జేబులో ఉన్న రూ.3500ల నగదు, మొబైల్ ఫోన్ (ఐఫోన్ 14 ప్రో మాక్స్), మోటార్ సైకిల్ లాక్కొని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు దొంగలించిన వస్తువులను గుర్రం వెంకటేష్ ఇంటికి రాజారం గ్రామానికి తీసుకొని వచ్చి భద్రపరిచారు. మళ్లీ దొంగతనం చేయడాలని ఇద్దరు కలిసి మాట్లాడుతుండగా వారిపై నిఘా పెట్టిన పోలీసులు అక్కడికి చేరుకొని వారిని పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి సేకరించిన వస్తువులను సీజ్ చేశారు. మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్ఐ నరేష్ కుమార్ తన సిబ్బంది రాజేందర్, సంతోష్ లతో కేసును ఛేదించినందుకు డీఎస్పీ రఘుచందర్ అభినందనలు తెలిపారు.



చిలుక వాగు ఉధృత ప్రవాహం

కనుకులగిద్ద-హుజురాబాద్‌కు రాకపోకలు బంద్

నవతెలంగాణ - హుజురాబాద్



ఉధృతంగా ప్రవహిస్తున్న చిలుక వాగు

హుజురాబాద్ ప్రాంతంలో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంతో పాటు మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో పలువురి ఇండ్లలోకి నీరు చేరింది. దుకాణాలల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు. అనేక చోట్లా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి నుండి నుండి ఆదివారం వరకు హుజూరాబాద్ పట్టణంతో పాటు మండలంలో ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. మండలంలో శుక్రవారం ఉదయం 8గంటల వరకు మాత్రమే 33.2 మిల్లీమీటర్ల వర్షాపాతం, శనివారం ఉదయం 8గంటల వరకు 15.2మిల్లీ మీటర్లు వర్షాపాతం, ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు 78.6 మిల్లీమీటర్ల వర్షాపాతం నమోదయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో చిలుకవాగు ఉధృతంగా పారడంతో కనుకులగిద్ద గ్రామంతో పాటు రంగనాయకుల గుట్టకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షానికి లోతట్టు ప్రాంతాలైన హుజురాబాద్‌లోని తెలుగువాడ, మామిండ్లవాడ, గ్యాస్‌గోదాం ఏరియా, ఏక్‌మినార్ ఏరియా, గాంధీనగర్, బుడగ జంగాల కాలనీ, ఎస్‌ఐడబ్ల్యూకాలనీ, సిద్ధార్థనగర్, ఏకలవ్య కాలనీ, కొత్తపల్లి, ఇందిరానగర్‌లోని సిక్కులవాడ, బోర్నపల్లిలోని తెనుగువాడ, దమ్మక్కపేట ఎస్సీకాలనీ, ఇప్పల్ నర్సింగాపూర్ ఎస్సీకాలనీ తదితర ప్రాంతాలలో వర్షం నీరు రోడ్లపై నిలవడంతో పాటు పలువురి ఇండ్లలోకి చేరాయి. మామిండ్లవాడలో నల్లల బావి దరులు మొత్తం కూలగా అధికారులు టిప్పర్లతో మెరం నింపారు. రోడ్లన్ని జలమయంగా మారగా స్థానిక కౌన్సిలర్ ఉజ్మానూరిన్, పారిశుధ్య కార్మికులతో నీరు లేకుండా చర్యలు తీసుకున్నారు. బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు ఎటు వెళ్లేదారిలేక అక్కడే నిల్వ ఉండడంతో చెరువును తలపించింది. లోతట్టు ప్రాంతాలల్లో బల్దియా కమిషనర్ సల్వాది సమ్మయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, జవాన్లు రాజు, రమేష్, అనిల్, ఆయా కౌన్సిలర్లు సందర్శించి శిథిలమైన ఇండ్లల్లో ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించి, సహాయ చర్యలు చేపట్టారు.

జెసిబితో కాలువ తీస్తున్న మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్

23వ వార్డు బుడగ జంగాల కాలనీ మొత్తం నీట మునగడంతో పూరి గుడిసెల్లో ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వార్డ్ కౌన్సిలర్ మొలుగు సజనా పూర్ణచందర్ వార్డులలో తిరుగుతూ నీటి సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు జేసీబీ సహకారంతో జలమయమైన ప్రాంతాల్లో నీరు నిలవకుండా చేశారు.

రైతాంగాన్ని మభ్యపెడుతున్న ప్రభుత్వం..

- అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



లక్ష రూపాయలలోపు రుణమాఫీని చేశామని గొప్పగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఇంకా మభ్యపెడుతూ మోసం చేస్తుందని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18లోపు లక్ష రూపాయల రుణం తీసుకున్న రైతులందరికీ నేరుగా రైతులు అకౌంట్లో జమ చేసామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో 30శాతం కూడా రుణాలు మాఫీ చేయలేదన్నారు. లక్ష రూపాయల లోపు రుణమాఫీ కావాలంటే సుమారు రూ.16వేల కోట్లు కావాల్సి ఉంటుందని, కేవలం 6వేలకోట్లు నిధులు విడుదల చేసి చేతులు దులుపుకొని అందరికీ మాఫీ చేశామని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ సర్కార్ మాయజాలంలో రైతులు విలవిల్లాడు తున్నారని, బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ అధికారుల చుట్టూ ఆందోళనగా తిరుగుతున్నారన్నారు. ఏ ఒక్క అధికారి కూడా సరైన సమాధానం రైతాంగానికి చెప్పడం లేదని అన్నారు. తమ రుణం ఎందుకు మాఫీ కాలేదని అడుగుతున్న రైతాంగానికి ఎక్కడికక్కడ చేదు అనుభవం ఎదురవుతుందన్నారు. సరైన సమాధానం ఎవరు చెప్పక రైతులు దిగాలుగా చూస్తున్నారన్నారు. రేషన్ కార్డు లేదని, స్పెల్లింగ్ మిస్టేక్ అని, ఆధార్ తప్పిదమని, ప్రభుత్వ బెనిఫిషర్ అని, రకరకాల కొర్రెలు పెట్టి రుణమాఫీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు తలోమాటా మాట్లాడడం చూస్తుంటే రుణమాఫీపై రాష్ట్ర మంత్రి మండలికి స్పష్టత లేదని అర్థమవుతుందన్నారు. లక్ష రుణమాఫీ చేశామని చెబుతూనే రెండు లక్షలు మాఫీ చేస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. 40 లక్షల మంది రైతులు లక్ష వరకు రుణాలు తీసుకుంటే కేవలం 10 లక్షల మందిని ఎలా ఎంపిక చేస్తారని? ప్రశ్నించారు. బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న రుణాలు మొత్తాన్ని చెల్లించి కొత్త రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీకి పట్టాదారు పాస్‌బుక్ ప్రతిపాదికన రుణాలు మాఫీ చేయాలని అన్నారు. మంత్రుల మాటలు నీటి మూటలుగా ఉన్నాయని, రుణమాఫీకి విడుదల చేసిన నిధులు ఒకరు 6000కోట్లని మరొకరు 31వేల కోట్లు అని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. రైతులకు పెట్టుబడి కోసం వానాకాలం ఇవ్వాల్సిన రైతు భరోసాకు కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెట్టిందని, ఆ నిధులను రుణమాఫీకి మళ్లించాలని ఆరోపించారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి 15000, రైతు కూలీలకు 12000 ఎందుకు ఇవ్వలేదని? ప్రశ్నించారు. దీనికి 20 వేల కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని, ఆ డబ్బుల్ని ఎగొట్టి అందులో 6000 కోట్లను రుణమాఫీకి మళ్లించి రైతులకు మేలు చేసినట్టు ప్రచార సంబరాలు చేసుకుంటన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యను అర్థం చేసుకుని రుణమాఫీకి సరిపడా నిధులు విడుదల చేయాలన్నారు. ఎలాంటి కొర్రీలు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని లేని ఎడల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ - మానకొండూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేడు(సోమవారం) క్యాంపు కార్యాలయంలో లాంఛ నంగా ప్రారంభిస్తారు. సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం మేరకు మానకొండూర్ నియోజకవర్గంలో సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఆన్‌లైన్ పద్ధతికి శ్రీకారం చుడుతున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియతో దరఖాస్తు నెంబరును వెంటనే పొందే వీలుతో పాటు దరఖాస్తుల పరిశీలన, స్టేటస్ వివరాలు సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ



నవతెలంగాణ - మానకొండూర్

మానకొండూరు మండలం లోని శ్రీనివాస్ నగర్ ముదిరాజ్ సంఘం యూత్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కూన రాజు, ప్రధాన కార్యదర్శిగా గోనె సతీష్, కార్యదర్శిగా అనవేని చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా అనవేని మహేష్, బొజ్జ శేఖర్, కోశాధి కారిగా కంకనాల అనిల్, ముఖ్య సలహాదారులుగా అనవేని అనిల్, సింగ సాని కోటేశ్వర్, కార్యవర్గసభ్యులుగా పురం సంపత్, బొజ్జ రాజు, అనవేని సుమన్, తాట్లేంక శ్రీకాంత్, పిట్టల అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మల్యాలలో చోరీ..

నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన పుప్పాల దేవయ్య 15 రోజుల క్రితం తనకు యాక్సిడెంట్ కాగా ఇంటికి తాళం వేసి మల్యాలలోనే బావమరిది ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 20, శనివారం రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి తులం బంగారం, 43వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం

నవతెలంగాణ-పెగడపల్లి

పెగడపల్లి మండల పరిధిలోని బతికెపల్లి గ్రామంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతంగానికి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసినందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ కార్యదర్శి తాటిపర్తి శోభారాణి ఆధ్వర్యంలో గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేసిందని. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎలగొండ కృష్ణహరి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లేశంగౌడ్, సుధీర్, గంగరాజం, గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, మహేష్, రవి,శ్రీను, రామచంద్రం, రాజయ్య,అంజయ్య, కనకయ్య, దుర్గ ప్రసాద్, మొగిలి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముసుర్ల వానలకు కదిలేదెట్ల

- రోడ్ల ఎత్తు పెంచారు.. డ్రైనేజీలు మరిచారు
- నిల్వ నీటితో వ్యాధుల సంక్రమణ

నవతెలంగాణ-రాయికల్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని వీధులకు వరద నీరు వచ్చి చేరుతోంది. గత పాలకులు కాలనీల అభివృద్ధిని మరిచి కేవలం ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేశారే తప్పా.. అమలుకు నోచుకోకపోవడంతో పల్లెల్లో అభివృద్ధి మరుగున పడింది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలైన రోడ్లు, మురుగు కాలువలు అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే గ్రామాల్లోని కాలనీ వాసులు ఇల్లు విడిచి బయటకు రాలేక అవస్థలు పడుతున్నారు.



బోర్నపల్లి 3వ వార్డులో నిలిచిన నీరు



రామాజీపేట్ ఎస్సీ కాలనీలోకి వరద నీరు

మండలంలోని రామాజీపేట్ గ్రామంలోని ఎస్సీ కాలనీకి శనివారం రాత్రి వరద నీరు రావడంతో పాటు మరుగు దొడ్ల చుట్టూ నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని శివాలయానికి దగ్గర్లోని చెరువు నిండి వరద పోటెత్తడంతో పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే పరిసర ప్రాంతంలో వారిని దగ్గర్లోని ఓ ప్రయివేట్ పాఠశాల హాస్టల్‌కు తరలించారు. పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న పలు ప్రయివేట్ కాలి స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమల వ్యాప్తి పెరిగి సీజనల్ వ్యాధులకు నిల్వ నీరు కారకాలుగా మారనున్నాయి. గతంలో మున్సిపల్ శాఖ ద్వారా నీటి నిల్వ గల కాలి స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసిన సందర్భాలున్నాయి.

వరద నీటితో తిప్పలు పడుతున్నాం



మాది రామాజీపేట గ్రామం ఎస్.సి కాలనీ ప్రతి ఏటా వర్షాకాలంలో కాలనీలోకి వరద నీరు వచ్చి చేరడంతో చాల ఇబ్బందులు పడుతున్నాం.గతంలో వేసిన సి.సి రోడ్డు ఎత్తు వల్ల డ్రైనేజి నీరు బయటకు వెళ్ళే పరిస్థితి లేదు.కొన్ని వీధుల్లో అయితే అసలు డ్రైనేజీలు లేకపోవడంతో వరదనీరు వచ్చి చేరుతుంది. వర్షం ఆగిపోతే తప్ప నీరు బయటకు పోదు.దాంతో దోమల బెడద ఎక్కువ అవుతుంది. గత సంవత్సరం గ్రామంలో ప్రతి ఇంటికి ఒక్కరు జ్వరంతో బాధ పడినవారే ఇప్పటికైనా అధికారులు స్పందించి మా కాలనీలో సరియగు డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

-(ఎం.అరవింద్-గ్రామస్తుడు)

రోడ్ల ఎత్తు పెంచారు, డ్రైనేజీలు మరిచారు



మాది బోర్నపల్లి గ్రామం గతంలో తారు రోడ్డు వెడల్పు చేసేటప్పుడు ఉన్న డ్రైనేజి కాస్త మూసుకు పోయింది.రోడ్డు ఎత్తు పెంచడంతో వీధుల వైపు గల మురికి కాలువలు మూసుకుపోయే పరిస్థితి వచ్చింది.ఓ చోట మురికి కాలువ మూసుకుపోయింది.పలు వీధుల్లో వర్షాలకు నీరు నిలిచిపోయింది.లోతట్టు వీధుల్లో బరంతు నింపాలి,మురికి కాలువల నిర్మాణం చేపట్టి నీరు నిల్వ లేకుండా ఉండే విధంగా చూడాలి.

- (రాగుల భూమేష్-గ్రామస్తుడు)

చేపల వేటకు వెళితే కఠిన చర్యలు

ఎస్ఐ ఏ.నరేష్ కుమార్



చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-మల్యాల

చెరువుల వద్ద చేపల వేటకు వెళితే కఠిన చర్యలు తప్పవని మల్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ.నరేష్ కుమార్ అన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి ఉన్నాయని తెలిపారు. అటు వైపు వెళ్లి ప్రమాదాన్ని కొని తెచ్చుకోవద్దని, చెరువుల వెంట చేపల వేటకు వెళ్లరాదని అన్నారు. మండలంలో పలు గ్రామాలలో వర్షం ప్రభావంతో నిండిన చెరువుల నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని ఎవరు కూడా చేపల వేటకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దన్నారు. అలాగే గ్రామాల్లో చెరువు అలుగు పారుతుందని సందర్శకులు అటువైపు వెళ్లకూడదని సూచించారు. వర్షాల మూలంగా పాత ఇండ్లు, శిథిలమైన రోడ్లపై ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించి అవసరమైన సమయంలో పోలీసు శాఖకు సమాచారం అందించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అనిల్ మండల ప్రజలను కోరారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న దృశ్య అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలని కోరారు. చిన్నపిల్లలను వర్షం వరద నీటిలో ఆడుకోకుండా బయటకు పంపరాదని సూచించారు. విద్యుత్ స్తంభాలు తాకరాదు శిథిలమైన గోడలు చెట్ల వద్ద నిలబడరాదని సూచించారు. శిథిలావస్థకు చెరిన ఇండ్లల్లో ఉండే వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన పాలేపు జల అనే మహిళ రైతుకు చెందిన గేదె విద్యుద్ఘాతంతో మృత్యువాత పడింది. ఇంటికి సమీపంలో గల ఎర్తింగ్ వైర్ తగిలి గేదె మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. దీంతో మహిళ రైతు తన ఉపాధిని కోల్పోయానని కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



మృతి చెందిన గేదె

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాలకు చెందిన 53 మంది లబ్ధిదారులకు రూ.9,14000 సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ రణవేణి సుజాత సత్యనారాయణ, నల్ల తిరుపతి రెడ్డి, ఎల్లాల దశరథ్ రెడ్డి, తోట శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ జెడ్పిటిసి సందిరెడ్డి శ్రీనివాస్, నాయకులు కంతం రమేష్, జాజాల జగన్, దేవా మల్లన్న, జెడి సుమన్, నోముల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-మెట్‌పల్లి



మెట్‌పల్లి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన కుంట అజయ్ తన సెల్ ఫోన్ ఎక్కడో పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సెంట్రల్ ఎక్యుపిమెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో ఫిర్యాదు చేయగా ఈ అప్లికేషన్ ద్వారా పోగొట్టుకొన్న సెల్ ఫోన్‌ను ట్రాక్ చేసిన పోలీసులు ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి ఆదివారం అందజేశారు.

వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఆర్డిఓ



పరిశీలిస్తున్న ఆర్డీవో

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ, కోమటి కొండాపూర్, ఎర్దండి, ఫకీర్ కొండాపూర్ గ్రామాలలోని గోదావరి నది అనుకుని ఉన్న ప్రాంతాలను మెట్‌పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. గోదావరి ప్రాంతాల్లో ప్రవహించే నది తీవ్రతను ఎప్పటికప్పుడు పరిశీలిం చాలని అధికారులకు సూచించారు. గోదావరి తీర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు చేపలు పట్టడానికి గాని గొర్రెలు మేపడానికి గాని ఆ ప్రాంతాలకు వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ గంగాధర్ పాల్గొన్నారు.

తెగిపోయిన తాత్కాలిక రోడ్డును పరిశీలించిన డీఎస్పీ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ నుంచి పకీర్ కొండాపూర్ వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్ష ప్రవాహానికి తెగిపోవడంతో ఆదివారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, ఎస్సై అనిల్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రాక పోకలకు కలుగుతున్న ఇబ్బందులను పరిశీలించారు



రోడ్డును పరిశీలిస్తున్న డీఎస్పీ

ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండల మాజీ ఎంపిపి రాజేంద్ర ప్రసాద్ తండ్రి అనారోగ్యంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండగా వారిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



కూల్చిన గుడిసెలకు నష్ట పరిహారం చెల్లించాలి

- అర్హులైన వారికి ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా టీఆర్‌నగర్, కోరుట్ల పట్టణంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఇండ్లు లేని పేదలకు పంచి, పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా నాయకురాలు ఇందూరి సులోచన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నాగయ్య హాజరై మాట్లాడారు. గత సంవత్సరం టీఆర్‌నగర్ గుట్ట వద్ద గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలపై సంక్రాంతి పండుగ రోజున పోలీసులు దాడి చేసి, గుడిసెలను కూల్చివేయడం అన్యాయమన్నారు. గత పాలకులకు ఈ పాలకులకు ఏమి తేడా లేకుండా పోయింది. ఈ రాష్ట్రంలో ఎమ్మెల్యే, ఎంపీలు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కబ్జా చేసి అమ్ముకుంటున్నారు. వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపకుండా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ ఉన్నారు. ఈ పాలకులు దొంగలకు వత్తాసు పలుకుతూ ఉండడం సరైంది కాదన్నారు. నేడు ఈ ప్రభుత్వం పేద ప్రజలపై చేస్తున్న దాడులను అరికట్టాలని, వెంటనే కూల్చిన



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

ఇండ్ల స్థలాలలోనే పేదలకు ఇంటి నిర్మాణం చేసి, వాటికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లల బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్, సీపీఐ(ఎం) నాయకులు గర్వందుల రమేష్, వి.వెంకట చారి, చంద్రయ్య , సురేష్, కె.చంద్రశేఖర్, రఫిక్,బి.శేఖర్, వినోద్, గణేష్, రజియా, సూలేమాన్ పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవే గాయత్రీ బ్యాంకు లక్ష్యం

- 45 శాఖలతో రూ. 2843 కోట్ల వ్యాపారం
- మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకుగా అవతరించిన గాయత్రీ బ్యాంక్
- గాయత్రీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ముత్యాల లక్ష్మణ్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

ఖాతాదారుల సేవే లక్ష్యంగా పని చేస్తూ 45 శాఖలతో రూ.2843 కోట్ల వ్యాపారంతో అభివృద్ధి పథంలో గాయత్రి అర్బన్ బ్యాంకు ఉందని బ్యాంకు చైర్మన్ ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశంలో జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ లక్ష్మణ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బ్యాంకు స్థాపించిన 24 సంవత్సరాల కాలంలో, 7 లక్షల 25 వేల మంది వినియోగదారులను కలిగి రూ.2843.44 కోట్ల వ్యాపారాన్ని కలిగి మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకుగా అవతరించిందని పేర్కొన్నారు. 344 బ్యాంకింగ్ కరస్పాండెంట్స్‌ను నియమించి వినియోగదారుల చెంతకు బ్యాంకు సేవలను తీసుకొచ్చామన్నారు. 2023-24 ఆర్థిక



చెక్కు అందజేస్తున్న బ్యాంకు ప్రతినిధులు



మాట్లాడుతున్న గాయత్రీ అర్బన్ చైర్మెన్ ముత్యాల లక్ష్మణ్‌రెడ్డి

సంవత్సరంలో బ్యాంక్ రూ.22 కోట్ల 44 లక్షల నికర లాభాన్ని నమోదు చేసుకొని స్టాటుటరీ ఆడిటర్లతో ఏ క్లాస్ బ్యాంకుగా వర్గీకరించినట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాంతానికి రూ.3500 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని, లక్ష నూతన ఖాతాదారులను సేకరించే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. రిజర్వు బ్యాంకు అనుమతితో ఆరు బ్రాంచీలు గల యాదగిరి లక్ష్మి నరసింహస్వామి కో-ఆపరేటివ్ అర్బను గాయత్రీ బ్యాంకులో గత నెలలో విలీనం చేసుకోవడం జరిగిందన్నారు. మొత్తం 66 బ్రాంచీల నెట్‌వర్క్‌కు గాయత్రి బ్యాంకు చేరుకోబోతుందని వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో 90 ఆన్సైట్ ఏటిఎంల ద్వారా రూ.1342.74 కోట్ల ఏటిఎం లావాదేవీలను, 462.39 లక్షల సంఖ్యలో యూపీఐ లావాదేవీలను నమోదు చేశామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రమాదవశాత్తు మరణించిన గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాదారులైన బోమ్మకంటి గణపతి, ఆమందు గంగారాం, పోటువత్తిని శంకరయ్యల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున ప్రమాదబీమా చెక్కులను చైర్మన్, సీఈవోలు అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు మన్నె సౌజన్య డైరెక్టర్లు రాజిరెడ్డి, సత్యం, అశోక్, శ్రీనాథ్, విజయ్, వాసాల మాధవి, రవికుమార్, ఆర్. సతీష్ పాల్గొన్నారు.

కురిసిన ముసురు.. పొంగుతున్న వాగులు వంకలు

పలుచోట్ల రాకపోకలు బంద్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల వంతెనల వద్ద నీరు అధికంగా పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎక్కడ చూసిన జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ నుండి పకీరి కొండాపూర్ వెళ్లే దారిలో నిర్మాణంలో ఉన్న హైలేవల్ వంతెన పనులు



తెగిపోయిన రోడ్డు



పొంగుతున్న వాగులు

నిర్మాణంలో ఉండగా పక్క సైడ్ నుండి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. కురిసిన వర్షానికి తాత్కాలిక రోడ్డు కొట్టకపోవడంతో నీటి ప్రవాహం అధికంగా పెరిగింది. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిచి పోయ్యాయి.. ఇబ్రహీం పట్నం నుంచి వర్షకొండ వెళ్లే రోడ్డులో లో లెవెల్ వంతెనపై నీరు ప్రవహిస్తోంది. డబ్బా గ్రామ శివారులోని ఉప్పులూరు వెళ్లే దారిలో వాగు పొంగిపొర్లడంతో ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయ్యాయి. కురుస్తున్న భారీ వర్షాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు, పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

కిరాణా వర్తక సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

నవతెలంగాణ-రాయికల్

రాయికల్ పట్టణంలోని కిరాణా వర్తక వ్యాపారస్తుల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని స్థానిక వి.ఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్య వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి,మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంప ఆనందం ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.అధ్యక్షులుగా ఎలుగందుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సిద్ధంశెట్టి శ్రీనివాస్,అనంతుల సంపత్, ప్రధాన కార్యదర్శిగా నరం శెట్టి మహేష్, కోశాధికారిగా సిద్ధంశెట్టి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా చౌడరపు లక్ష్మీనారాయణ,కార్యవర్గ సభ్యులుగా ఏ. రమేష్‌ఏ .నరేందర్,ఎం.ఆనందం, ఎస్.శ్రావణ్, ఏ.శివకుమార్, బి.నవీన్, సిహెచ్ సురేష్, టి.గోవర్ధన్,ఎస్ భూమ నర్సయ్య ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, ప్రా.వ్య.స. సంఘం చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, డిస్ట్రిబ్యూషన్ అధ్యక్షుడు మ్యాకల రమేష్, కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, మహేందర్, కిరాణా వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి వినతి

నవతెలంగాణ-జగిత్యాల



వినతి పత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి.ఓ ప్రకారం 3797 మంది 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించాలని ఆదివారం కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఆ సంఘం నాయకులు ఎమ్మెల్సీ నివాసంలో కలిసి వారి సమస్యలను వివరించారు. గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య (వారసత్వ) నియామకాల కోసం జి.ఓ. ఎం.ఎస్. నెం. 81, 85 ప్రకారం 3797 మంది 61 ఏండ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకం కోసం జీవోలు జారీ చేసినట్టు తెలిపారు. కానీ జీవోలపైన స్టే ఉన్న కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని 2023,11,21 హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను సారం జిఓ నెం. 81 పైన గల స్టే ఎత్తి వేసిన విషయం గురించి ఎమ్మెల్సీకి వివరించారు. వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇప్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఎమ్మెల్సీకి ఇచ్చిన వినతి పత్రంలో ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీ, కల్వర్టులను పరిశీలించిన చైర్‌పర్సన్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డు 19వ వార్డులో నివాస గృహాలకు అనుకోని ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీ కల్వర్టును మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న తరుణంలో డ్రెయినేజీ కల్వర్టు సగం కూలిపోయింది. త్వరలోనే కల్వర్టు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. జగిత్యాల బైపాస్ రోడ్డుపై రహదారి ఇరువైపుల ప్రమాదకరమైన చెట్లు విద్యుత్ స్తంభాలు, భారీ వర్షం కారణంగా కూలి ప్రమాదాలు జరుగతున్నాయని వెంటనే బైపాస్ రోడ్డు మీద ఉన్న చెట్లను చెట్ల కొమ్మలు తొలగించాలని అధికారులకు మున్సిపల్ చైర్పర్సన్ ఆదేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ శంకర్ ఉన్నారు

పాస్‌పోర్టు పోయినది

మల్యాల అనిల్ కుమార్ S/o తిరుపతి గ్రామం చెగ్యాం మండలం వెల్గటూర్ జిల్లా జగిత్యాల. తేదీ 20/07/2024 శనివారం రోజున చెగ్యాం నుండి వెల్గటూర్‌కు ఆటోలో వస్తుండగా ఎసెస్సీ మేమో,P1412580గల పాస్‌పోర్టుతో పాటు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి మొదలైన ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఎక్కడో పడిపోయాయి. దొరికిన వారు ఈ ఫోన్ నం 8187827966 కాల్ చేసి తెలుపగలరు.

నవతెలంగాణ 7
సమగ్ర తెలుగు దినపత్రిక
రాజన్న సిరిసిల్ల
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

అంగన్‌వాడీల్లో మూడో తరగతి వరకు సమంజసం కాదు

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.తిరుపతి జాదవ్



నవతెలంగాణ - వీర్నపల్లి: అంగన్‌వాడీలను ప్లే స్కూల్స్‌గా మార్చి మూడవతరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం వీర్నపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్ మాట్లాడారు. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించడం లేదన్నారు. గనుక 1, 2, 3వ తరగతులను అంగన్‌వాడీలకు అప్పగించటం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకే దోహదపడు తుందని టీఎస్‌యూటీఎఫ్ అభిప్రాయపడుతున్నదన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదన ఆహ్వానించతగినదని ఎంపిక చేసిన పాఠశాలల్లో తరగతికి ఒక్క టీచరును సబ్జెక్టు ఒక్క టీచరును ప్రధానోపాధ్యాయులు తగినంత బోధనేతర సిబ్బంది పాఠశాలలో ఉండేలా ప్రభుత్వం చూడాలని సూచించారు.

గాడి తప్పిన పురపాలన.. ముసిరిన సమస్యలు

- స్వచ్ఛతకు మచ్చ.. మళ్లీ పట్టణంలో పందులు
- అధికారులు, సిబ్బంది తలోదారి.. పట్టించుకోని పాలకవర్గం
- పురపాలనపై కలెక్టర్ దృష్టి సారించేనా..?


ఆదర్శనగర్ లో ఇండ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు


గణేష్ నగర్ లో సిసి రోడ్డు లేక బురదమయంగా మారిన రహదారి


పెద్దూరు లో పందుల స్వైర విహారం

నవతెలంగాణ - సిరిసిల్ల

పురపాలన గాడి తప్పుతోంది అనేక కారణాలతో సిరిసిల్ల మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణంలో మళ్లీ పందులు స్వైర విహారం చేసి స్వచ్ఛతకు మచ్చ తెస్తున్నాయి. పురపాలక సంఘంలోని అధికారులు సిబ్బంది తలోదారిగా ఉన్నారు. సిరిసిల్ల పురపాలక సంఘంలోని పాలకవర్గం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్ కుమార్ ఝా సిరిసిల్ల పురపాలక సంఘంపై దృష్టి సారిస్తేనే మళ్లీ గాడిన పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సిరిసిల్ల అభివృద్ధి వెనకడుగు

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం అభివృద్ధి ఆగిపోయింది. గత ప్రభుత్వంలో సిరిసిల్ల పట్టణం అభివృద్ధిలో రాష్ట్రస్థాయిలోనే సిద్దిపేట తర్వాత ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో అభివృద్ధి వెనకడుగు వేసింది. పట్టణంలో ఏ వీధి చూసినా అపరిశుభ్రంగా కనిపిస్తున్నది. పురపాలక సంఘం అధికారులు సిబ్బంది పట్టించుకోవడం లేదు దానికి తోడు పాలకవర్గం మాకెందుకులే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలో వందల కోట్లు అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం వెచ్చించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8మాసాలు పూర్తవుతున్నా పట్టణ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు వెచ్చించలేదు. ఈ 8మాసాల నుంచి సిరిసిల్ల శాసనసభ్యులు కె తారకరామారావు పట్టణాభివృద్ధికి నిధులు తీసుకురావడం లేదని ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. ఎమ్మెల్యే తారక రామారావు సిరిసిల్ల పట్టణంపై దృష్టి సారించి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సిరిసిల్ల పురపాలక సంఘం గతంలో రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందంజలో ఉండడంతోపాటు అప్పుడు పని చేసిన మున్సిపల్ అధికారులు సిబ్బంది పట్టణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు సిబ్బంది పట్టణాన్ని అసలు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి. ప్రజలు అనేక సమస్యలతో మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన వారి సమస్యలు తీర్చడం పక్కన పెడితే వినే వారు కూడా లేరని ప్రజలు వాపోతున్నారు. పట్టణ సమస్యలు పట్టించుకోని కొంతమంది అధికారులు కొంతమంది సిబ్బంది అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడంలో మాత్రం రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. వీటంతటికి కారణం పాలకవర్గం పట్టించుకోకపోవడంతోపాటు కలెక్టర్ సిరిసిల్ల మున్సిపల్‌పై దృష్టి సారించకపోవడమేనని తెలుస్తున్నది.

ఎక్కడ చూసినా సమస్యలే...

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కడ చూసిన సమస్యలే కనిపిస్తున్నాయి. ప్రధానంగా గణేష్‌నగర్, బాలానగర్, తుకారావ్‌పల్లి, పెద్ద బోనాల, చిన్న బోనాల, శ్రీనగర్‌కాలనీ లాంటి అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు మురుగు కాలువలు లేవు. దీంతోపాటు అనేక ఖాళీ స్థలాల్లో నీటి నిలువలు పెరిగిపోయాయి. ఈ ప్రాంతాల్లో నిధులు వెచ్చించి నిర్మాణాలు చేయకపోవడమే కాకుండా ప్రైవేటు ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉన్నా స్థలాల యజమానులకు అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వడం లేదు. వీటితో దోమలు స్వైర విహారం చేసి పట్టణ ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. పేద మధ్యతరగతి ప్రజలు వేలాది రూపాయలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖర్చు చేస్తున్నారు. దీనికి ప్రధానంగా మున్సిపల్ కారమని ప్రజలు ఆలోచిస్తున్నారు. గతంలో అప్పటి అధికారులు ఎంతో శ్రమించి పట్టణం నుంచి పందులను దూరం చేశారు. కానీ ప్రస్తుతం పందులు పట్టణంలో స్వైర విహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీలో విలీనమైన పెద్దూరు చంద్రంపేట ముష్టిపెల్లి రాజీవ్ నగర్ ప్రాంతాల్లోని పందుల సంచారం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది. సిరిసిల్ల పట్టణ స్వచ్ఛతకు స్ఫూర్తిగా నిలుస్తూ జాతీయస్థాయిలో అనేక అవార్డులు సాధించిన సిరిసిల్ల ప్రస్తుతం పూర్తిగా వెనుకబడిపోయింది. అంతేకాకుండా చెత్త సేకరణ వ్యవస్థ కూడా గాడి తప్పుతోంది. ప్రధాన వీధుల్లో వీధి దీపాలు సైతం వెలగడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. ఇలాంటి అనేక సమస్యలతో కార్మిక క్షేత్రం తల్లడిల్లుతోంది.

బ్రిడ్జికి ఇరువైపులా శాశ్వత పనులు చేపట్టాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆర్‌అండ్‌బి రోడ్డు రాపల్లివాగు బ్రిడ్జికి ఇరువైపులా శాశ్వత పనులు చేపట్టాలని ఆదివారం కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గత ఏడాది కాలంగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ ఇరు వైపులా గుంతలు పడి ప్రజలకు అసౌకర్యంగా ఉందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య సిరిసిల్లలో కేకే మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కేకే మహేందర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజుకు విషయాన్ని వివరించి తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా ఇరువైపులా సీసీ రోడ్డును వేయాలని ఆదేశించారు. వీర్నపల్లి మండలంలో నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీని నిర్మించాలన్నారు. దానికి కావలసిన అంచనాలను తయారుచేసి సమర్పిస్తే మంత్రితో మాట్లాడి నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. దుమాల గ్రామానికి చెందిన ఉల్లి మహేష్ కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలకిషన్, మాజీ సర్పంచ్ దేవేందర్ యాదవ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు మెండే శ్రీనివాస్, నాయకులు నంది కిషన్, బాలగౌడ్ పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో ప్రవేశాలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మహాత్మ జ్యోతిబాపూలే పురుషుల గురుకుల డిగ్రీలో కళాశాలలో 3కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే పురుషుల గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీలో బీఎస్‌సీ(ఎంపీసీఎస్), బీఎస్‌సీ(బిజెడ్‌సి), బికామ్(సీఏ) ఇంగ్లీష్ మీడియంలో సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మార్చి 2024సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో జూలై 31వరకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్ కోసం అప్లికేషన్స్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యతోపాటు ఉచిత వసతి, పాఠ్య పుస్తకాలు, దుస్తులు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్వాన్స్ సప్లిమెంటర్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రిజర్వేషన్, మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ తెలిపారు.

వరద ప్రవాహాల వద్ద పోలీసుల గస్తీ..

హన్మాజీపేట నక్క వాగు, మల్లారం కల్వర్టు వద్ద భద్రత ఏర్పాట్లు



నవతెలంగాణ - వేములవాడ రూరల్ : చుట్టుపక్కల ప్రజలు వరద ఉధృతిని దాటేందుకు ప్రయత్నించి ప్రాణాల మీదికి ఎవరు తెచ్చుకోవద్దని గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని ఆదివారం వేములవాడ రూరల్ మండల ప్రజలకు ఎస్సై మారుతి సూచించారు. రెండు రోజులుగా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట నక్కవాగు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా మల్లారం ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న కల్వర్టు రహదారిపై నుంచి వరద పోటెత్తడంతో వేములవాడ రూరల్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో పోలీసులు రాకపోకలను నిలిపివేసి భద్రత చర్యలను చేపట్టారు. నక్క వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో తాత్కాలికంగా వేసిన రోడ్డు నిర్మాణం వరదలో కొట్టుకుపోయింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వరద ఉధృతిని దాటకుండా పోలీస్ సిబ్బందితో గస్తీని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు దాటేందుకు ఎవరు కూడా ప్రజలు ప్రయత్నించవద్దని ఎస్సై మారుతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గస్తీ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఎడతెగని వాన

నవతెలంగాణ - చందుర్తి : మండలంలో రెండు రోజులుగా ఎడతెరవకుండా వర్షం కురుస్తోంది. దీంతో పలు చెరువులు నిండి మత్తడి దూకుతున్నాయి. మూడపల్లి, రామన్నపేట, అనంతపల్లి, మర్రిగడ్డ, మల్యాల చెరువులు నిండాయి. దీంతో రైతాంగం వ్యవసాయ పొలాలు దున్నడంలో నిమగ్నమయ్యారు.


అలుగు పారుతున్న రామన్నపేట చెరువు

మాది ప్రజా పాలనా.. ఫామ్ హౌజ్ పాలన కాదు

సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ - సిరిసిల్ల : తమది ఫామ్ హౌస్ పాలన కాదని, ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజా పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆదివారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాటమీద నిలబడి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతుందని అన్నారు. మొదటి విడత రూ.32వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, మిగతా 2విడతల్లో పూర్తిస్థాయి రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం చేసి తీరుతుందన్నారు. కేసీఆర్ లాగా ఫామ్ హౌస్‌లో ఉండి నిర్ణయాలు తీసుకోవడం కాదు, మంత్రులందరూ కమిటీగా ఏర్పడి రుణమాఫీ విధివిధానాలను రూపొందించాలని రైతుబంధు పథకంపై కూడా ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్నం.. రుణమాఫీపై మాట్లాడే అర్హత కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు లేదని, పీఠాలు కదులుతున్నాయనే, పిచ్చి పట్టినట్లు తలా తోకా లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ చెయ్యకపోతే రాజీనామా చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటే, రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీష్ రావు ఇప్పుడు ఆరుగ్యారెంటీల పేరిట మాట మారుస్తున్నాడని నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగం నోటిఫికేషన్ ప్రభుత్వం ఇచ్చింది, ఇచ్చిన నోటిఫికేషన్లు రద్దు చేయాలని, కొంతమందిని రెచ్చగొడుతూ రాజకీయ లబ్దికోసం దొంగ దీక్షలు కొందరు నేతలు చేపిస్తున్నారన్నారు. సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నం.. రాహుల్ గాంధీ ఇచ్చిన రుణమాఫీ అమలు చేసామని తెలిపారన్నారు. పార్టీ చేస్తున్న హామీల అమలు చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ జెటోనీ, జిల్లా చేనేత అధ్యక్షులు గోనె ఎల్లప్ప, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుర దేవరాజు, జిల్లా నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివ ప్రసాద్, కత్తెర దేవదాస్, మ్యాన ప్రసాద్, మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, బిమావరం శ్రీనివాస్, అడ్డగడ్డ శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతాం

- వస్త్ర పరిశ్రమ జేఏసీ నాయకుల హెచ్చరిక
- నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు పిలుపు
- దీక్షా పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో నేటి నుంచి సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద చేపట్టబోయే రిలే నిరాహార దీక్షలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, నేతన్నలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని పలు మార్లు వేడుకున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక పదిమంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. దీనిపై ఆధారపడ్డ వేల మంది కార్మికులు, ఆసాములు, యజమానులు రోడ్డున పడ్డారని, సాంచెలను పగలగొట్టి తుక్కు కింద అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇలానే కొనసాగితే పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం, నెలకొన్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు సిరిసిల్ల పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల సంఘాల నాయకులు, సభ్యులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్, ఆసాముల సంఘం అధ్యక్షులు సిరిసిల్ల రవి, ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు పంతం రవి, కోడం రమణ, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడెపు భాస్కర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, మండల సత్యం, బండారి అశోక్, గౌడ రాజు, ఏనుగుల ఎల్లయ్య, బూట్ల నవీన్, శ్రీరామ్ సత్యం, కోడం అశోక్, మండల బాలరాజు, గంగుల శ్రీనివాస్, శ్రీగాద విష్ణు, అన్నల్దాస్ శ్రీనివాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, చేరాల అశోక్, నల్ల ప్రదీప్, సాప గణేష్ పాల్గొన్నారు.

జూకంటికి దాశరథి పురస్కారం పట్ల హర్షం



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దాశరథి పురస్కారం ప్రకటించడం పట్ల తెలంగాణ వివేక రచయితల సంఘం ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు డా.వాసరవేణి పరశురాం మాట్లాడుతూ జూకంటి జగన్నాథం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందినవారని మూడు దశాబ్దాలకుపైగా సాహిత్యాన్ని రచిస్తున్నారన్నారు. పాతాళగరిగ, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గంగడోలు, బొడ్డుతాడు, తల్లికొంగు తారంగం, చిలుక రాహస్యం, సిద్ధి ముల్లె, పాస్, ఊరు ఒక నారుముడి, జూకంటి జగన్నాథం కథలు, ఒకరోజు పది గాయాలు వంటి 20వరకు పుస్తకాలు రచించారన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వృత్తులు క్షీణించి బ్రతుకుల ఆగమైన పరిస్థితులను కళ్లకు కట్టారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. సిరిసిల్ల టీజేఏసీ చైర్మెన్‌గా, రాష్ట్ర సాధనలో తన పాత్ర పోషించారు. ఎందరో కవులకు, యువకులకు స్ఫూర్తిగా నిలిచారు. అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులుగా, జిల్లా రచయితల సంఘం గౌరవ సలహాదారులుగా సేవలందిస్తున్నారన్నారు. తెలంగాణ ఉత్తమ సాహితీవేత్తగా పురస్కారం, గరికపాటి పురస్కారం ఎన్నో అవార్డు పొందరన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశరథీ కృష్ణమాచార్య పురస్కారం ప్రకటించడం హర్షణీయమన్నారు. సోమవారం దాశరథీ జయంతి సందర్భంగా పురస్కారం స్వీకరిస్తారని తెలిపారు. తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వాసరవేణి పరశురాం, జిల్లా కార్యదర్శి దుంపెన రమేష్, కవులు బారా ధనరాజ్, గుండెల్లోకి నిలకంఠం, తంగళ్లపల్లి ప్రభాకర్, ఇ మహేందర్, పెరుమాండ్ల రాజయ్యలు హర్షం వ్యక్తం చేశారు.

క్షణికావేశంతో కేసుల పాలవ్వొద్దు



నవతెలంగాణ - వీర్నపల్లి : క్షణికావేశంలో గొడవలు పడి కేసుల పాలు కావద్దని ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలం పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎల్లయ్య గౌడ్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బదిలీపై వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌కు వారం రోజుల కిందట వచ్చినట్టు తెలిపారు. ఎర్రగడ్డ తండ, జవహర్లాల్ నాయక్ తండ, లాల్ సింగ్ తండ, గొల్య నాయక్ తండ, వీర్నపల్లి, బంజేరు గ్రామాల్లో ప్రజలు అందరిని పిలిపించి గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని అవగాహన కల్పించారు. గ్రామాలలో తండాల్లో ఫారెస్ట్ భూములను పాడు చేయవద్దు, అటవీ జంతువులను వేటాడి కేసుల పాలు కావద్దన్నారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా స్టేషన్‌కు వచ్చి నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు.

వాహనదారులు సహకరించాలి

వాహన దారులు సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని, మైనర్‌లకు బైకులు నడిపితే కొత్త చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపినా, మద్యం తాగి వాహనం నడిపినా, ముగ్గురు టూ వీలర్‌పై వెళ్లినా జరిమానా తప్పదన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కూడా చర్యలు తీసుకుంటామన్నారు. కిరణా దుకాణాలలో అధిక ధరలకు విక్రయించినా, గడువు ముగిసిన వాటిని అమ్మినా, గుట్కా, అంబార్ అమ్మినట్టు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫెర్టిలైజర్ షాపుల్లో నాణ్యమైన మందులనే విక్రయించాలని సూచించారు.

విద్యార్థులు స్కూళ్లోకి వెళ్లేదెలా..?

నవతెలంగాణ - ముస్తాబాద్


పాఠశాల గేటు ఎదుట చెరువును తలిపించేలా వరద

ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాల కళాశాల గేట్ల ముందు వర్షపు నీరు చెరువును తలపించేలా నిలిచిపోయాయి. విద్యార్థులు పాఠశాల కళాశాలలోపలికి వెళ్లడానికి దారి సరిగ్గా లేకపోవడంతో నాన్న ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల కళాశాల ముందు నీళ్లు ఆగకుండా మట్టి పోయించాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..



నవతెలంగాణ - ముస్తాబాద్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 2008-09 చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అప్పటిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడో వారివారి వృత్తులలో స్థిరపడి మళ్లీ 11సంవత్సరాల తర్వాత అందరూ ఒకే వేదికపై కలవడం చాలా సంతోషదాయకమని విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణిమ వేడుకలు

నవతెలంగాణ - ముస్తాబాద్

మండలంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా గురు పూజా మహోత్సవ వేడుకలు శిష్యులు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు రాజు గురుస్వామి శిష్యులు అయ్యప్ప మాలదారులు ఘనంగా గురుపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అయ్యప్ప స్వామి భజన బృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ - ముస్తాబాద్ : డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ముస్తాబాద్ యువకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థులు సామాజిక కార్యకర్త విద్యాభిమాని చింతజీ బాలయ్య ఆధ్వర్యంలో ముస్తాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పోస్టు కార్డులపై రాసి సీఎం క్యాంపు ఆఫీసుకు పంపించారు.

బో'నమో' పోచమ్మ



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల పట్టణంలోని 3వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల, పోతరాజు విన్యాసాల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు అప్పాజెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు, వ్యాపారాలు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని చైర్పర్సన్ అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.లావణ్య, పలు పార్టీల రాజకీయ నాయకులు, విద్యానగర్ - గీత నగర్ అభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గుంతతో పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ - బోయినిపల్లి

మండలం కరీంనగర్ వేములవాడ ప్రధాన రహదారిలో కొదురుపాక మిడ్ మానేరు వంతెన చివరి భాగంలో ఏర్పడిన ఒక గుంతతో వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది, నిత్యం పలు జిల్లాల నుండి దైవదర్శనానికి భక్తులు వేములవాడికి ఈ రహదారి నుంచి వెళ్లడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఈగుంతతో పలువురు ప్రయాణికులు ప్రమాదాలకు గురై చనిపోయిన ఘటనలూ ఉన్నాయి. వెంటనే ఆర్ అండ్ బీ అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

స్తంభంపల్లికి రాకపోకల నిలిపివేత


ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేస్తున్న ఎంపీడీవో జయశీల

నవతెలంగాణ - బోయినిపల్లి : రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని స్తంభంపల్లి గంజివాగు వద్ద నిర్మిస్తున్న హై లెవెల్ వంతెన దగ్గర తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బైపాస్ మట్టిరోడు వరదకు కొట్టుకపోవడంతో వేములవాడ నుంచి స్తంభంపల్లికి రాకపోకలు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో జయశిల ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద సూచిక బోర్డును ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ వేములవాడకి వెళ్లే గ్రామస్తులు గంజి వాగుండా వెళ్లవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, రవీందర్, రవీందర్, గ్రామస్తులు కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన జీపీ కార్మికులు

గ్రామపంచాయతీ కార్మికుల వినతి..

నవతెలంగాణ - వేములవాడ : నేడు గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జీవో నెంబర్ 51 రద్దు చేసి వెంటనే జీతాలను పెంచాలని కోరుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆదివారం ఆయన నివాసంలో వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ తెలిపినట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మల్యాల నరసయ్య, అర్బన్ మండల అధ్యక్షులు రాజశేఖర్, రూరల్ మండల అధ్యక్షులు ముదుగంపెల్లి అనిల్, మల్లారం గంగరాజు, సింగరపు రాజు, అచ్చ కాంతయ్య, కొమ్ము మధు పాల్గొన్నారు.

బీజేవైఎం నుంచి కాంగ్రెస్‌లోకి చేరిక



నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట : మండలంలోని రాగట్లపల్లి గ్రామానికి చెందిన బీజేవైఎం మండల జనరల్ సెక్రటరీ మందాటి లక్ష్మణ్ యాదవ్ ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మందాటి లక్ష్మణ్ యాదవ్ బీజేవైఎంలో నాలుగు సంవత్సరాలు పనిచేశారు. రాగట్లపల్లి మాజీ సర్పంచ్ మందాటిరాజు యాదవ్‌కు స్వయానా సోదరుడు అయినప్పటికి లక్ష్మణ్ యాదవ్ బీజేవైఎంలో చురుకుగా పనిచేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి రాణిరుద్రమ దేవి ఎన్నికల్లో ఆమె వెన్నంటి ఉండి పనిచేసిన తనకు పార్టీలో సముచిత స్థానం దక్కలేదని, నా గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ కోసం నాలుగుసార్లు ప్రస్తుత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసినా ఫలితం దక్కలేదని కాంగ్రెస్‌లో చేరినట్లు లక్ష్మణ్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్‌తోపాటు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు మిరాల శ్రీనివాస్‌యాదవ్, తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు టోనీ ఉన్నారు.

నాయిబ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-పెద్దపల్లి

తెలంగాణ రాష్ట్రంలో నాయిబ్రాహ్మణ కార్పోరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. నాయిబ్రాహ్మణ కులస్థుల సమస్యలు పరిష్కరించాలని, సీఎం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కార్పోరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులు కేటాయించా లని,కార్పోరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు పరమేశ్, పట్టణ అధ్యక్షుడు సొన్నాయిటెంకం సురేష్, నాయకులు గొల్లపెల్లి రాజమల్లు, పాల్గొన్నారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన చతుర్వేదుల శ్రీకాంత్ (35) అనే యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్న శ్రీకాంత్ గుండె పోటుతో వికారాబాద్‌లో మృతి చెందాడు. గోదావరిఖనికి చెందిన రజితతో వివాహం శ్రీకాంత్‌కు వివాహం జరిగింది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో వికారాబాద్‌లోని అనంతగిరి కొండల ప్రాంతానికి స్నేహితుల కుటుంబలతో కలిసి వెళ్లి ఓ హెూటల్‌లో బస చేశారు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా అస్వస్థకు గురై పడిపోయిన అతన్ని తక్షణమే వికారబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే శ్రీకాంత్ గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఫొటోగ్రాఫర్లు నూతన మెలకువలు

నేర్చుకునేందుకు ఎక్స్‌ఫోలు దోహదం



నవతెలంగాణ-ముత్తారం:

ఫొటోగ్రాఫర్లు నూతన మెలకువలు నేర్చుకునేందుకు ఎక్స్‌ఫోలు దోహదప డుతాయని పెద్దపల్లి జిల్లా ముత్తారం ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి భాస్కర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియోగ్రా ఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఫోటోగ్రాఫర్ల పండుగ ఫోటోఎక్స్పో పోస్టర్‌ను ముత్తారం మండల ఫోటో, వీడియోగ్రాఫర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ముత్తారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ ఇలాంటి ఎక్స్‌ఫోలు హాజరై సద్వినియోగం చేసుకొని, నూతన మేలుకు వలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రామగిరి శ్రీనివాస్, అధ్యక్షులు అనుము వీరస్వామి, ప్రధాన కార్యదర్శి వైద్య రాజేందర్, కోశాధికారి గుట్ల తిరుపతి, గోదావరిఖని ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్, సముద్రాల రాజేందర్, తదితరులున్నారు.

ఘన సన్మానం



నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం పారుపల్లి ముదిరాజ్ కుల పెద్ద మనిషిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకుల ఓదెలుకు ముదిరాజ్ పారుపల్లి కమాండ్ సొసైటీ సెక్రటరీ కుక్కల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్ర మంలో కార్యవర్గ సభ్యులు పేయ్యల సారయ్య, అనవేన చిన్న శంకర్, ఏరవేన లింగయ్య, తదితరులున్నారు.

గురువుకు సన్మానం



నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని విటల్‌నగర్‌లో 1964వ సంవత్సరంలో శ్రీదేవి విద్యానికేతన్ పాఠశా లను స్థాపించి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాపయ్య శాస్త్రిని గురుపౌర్ణమిని పురస్క రించుకొని పూర్వ విద్యార్థులు ఆయన నివాసానికి వెళ్లి శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్స్ పంపిణీ చేశారు. పాపయ్య శాస్త్రికి పూర్వ విద్యార్థులు ఉడతా భక్తిగా 5500 రూపాయలు అందించారు.ఈ కార్యక్రమంలో జెల్ల కుమార్, సిపిఐ కనక రాజ్, అబ్దుల్ గఫూర్, ఆకుల వీరేశం, గుండబోయిన అజయ్, తదితరులున్నారు.

బురద రోడ్డుపై బైఠాయించి కార్పొరేటర్ నిరసన



నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు కాలనీవాసులతో కలిసి బురద రోడ్లపై బైఠాయించి వినూత్న నిరసన తెలిపారు. గత కొంత కాలం నుంచి డివిజన్‌లో అభివృద్ధి చేయడం లేదంటూ నిరసన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీలు పద్మావతి కాలనీ, కేసీఆర్ కాలనీ, ప్రగతి నగర్, ఆర్టీసీ కాలనీ, సాయి నగర్, చంద్రబాబు కాలనీ, టీచర్స్ కాలనీ, బృందావనం కాలనీ అభివృద్ధి కోసం ఎలాంటి నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. గత రెండేళ్ల క్రితం డివిజన్‌లోని పద్మావతి కాలనీ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ వేశారని ఆ టెండర్‌కు సంబంధించి పనులు ప్రారంభించినప్పటికీ ఆదిలోనే ఆగిపోయాయని పేర్కొన్నారు. ఈ డివిజన్ నుంచి రామగుండం కార్పొరేషన్ కు అత్యధికంగా ఎల్ఆర్ఎస్ నిధులు వస్తున్నప్ప టికీ అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ పేర్కొన్నారు. డివిజన్‌కు నిధులు కేటా యించాలని, లేదంటే పెద్దపల్లి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఘనంగా మామిడి ఆగయ్య వర్ధంతి

నవతెలంగాణ-గోదావరిఖని

రజక సంఘం అధ్యక్షులు, ఏఐటీయూసీ నాయకులు మామిడి ఆగయ్య 5వ వర్ధంతిని కుటుంబ సభ్యులు, రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోదావరిఖనిలోని ఎండిహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ పిల్లల ఆశ్రమంలో ఆగయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సింగరేణి కార్మిక సంఘ నాయకుడిగా. ఫిదా కార్మిక హక్కుల పోరా టంలో చురుకుగా పాల్గొన్నారని, రజక కుల సభ్యుల ఐక్యతకు, ఇళ్ల స్థలాల సాధన పోరా టంలో ముందుండి ఇళ్ల స్థలాల ఇప్పించిన ఘనత ఆగయ్యకే దక్కుతుందని కొనియా డారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, రజక సంఘం అధ్యక్షులు పైడిపల్లి తిరుపతి, జనరల్ సెక్రటరీ మామిడి సతీష్, ఉపాధ్యక్షులు కొండయ్య, మహిళా అధ్యక్షురాలు ఇజ్జగిరి కొమురక్క తదితరులున్నారు.

సింగరేణిని ఆర్థికంగా దోచుకోవటానికి

ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం



నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణిని ఆర్థికంగా దోచుకోవడానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఇట్టి విధానాన్ని వీడనాడాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆర్థికంగా దోచుకొన్న దానికి ప్రతిఫలంగా కార్మికులు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే దారిలో వెళ్తూ సింగరేణిని ఆర్థికంగా దోచుకోవడానికి తెరలేపిందని ఆయన విమర్శించారు. దానిలో భాగంగానే శనివారం రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పేరుతో సింగరేణి సొమ్మును దోచిపెట్టడా నికి కొత్త పథకాన్ని తీసుకొచ్చిందని ఆయన అన్నారు. సింగరేణి సొమ్ము ప్రభు త్వం వాడుకోవడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. సింగరేణి అధికారులు వాళ్ల ప్రాబల్యం కోసం సింగరేణి ధనాన్ని అధికారంలో ఉన్న ప్రభుత్వానికి దోచి పెడుతు న్నారని ఆయన ఆరోపించారు.

ఎడతెరపి లేని వర్షం

- సింగరేణి ఆర్జీ 1లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం
- ఓసీపీ-5లో భారీగా నీరు వరద నీరు
- ముందుకు కదలని భారీ యంత్రాలు
- గత మూడు రోజులలో ఆర్జీ-1లో 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం



వర్షంతో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-గోదావరిఖని:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఐదు రోజుల పాటు ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేయగా, దీని కారణంగా కోల్‌బెల్ట్ ఏరియా అయిన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడు తుంది. ఈ వర్షాకాలంలో ఇప్పటి వరకు అంతంత మాత్రంగా వర్షాలు కురవ డంతో మొన్నటి వరకు సింగరేణి బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం ఏర్పడలేదు. అయితే బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్న కారణంగా సింగరేణిలో ప్రధాన ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్‌ల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌లో వరద నీరు వచ్చి చేరిన కారణంగా ఈ అంతరాయం కలుగుతుంది. ఆయా ఏరియాల్లో ఓసీపీల్లో వరద నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతు న్నప్పటికీ వర్షాలు నిర్విరామంగా కురుస్తున్న కారణంగా నీటిని తొలగించే కొద్ది వర్షపు నీరు మళ్లీ చేరుతుంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిసింది.

రోజుకు 14వేల టన్నుల చొప్పున ఈ ఏరియా నుంచి బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్న తరుణంలో భారీ వర్షాలు ఎడతెరపి లేకుండా కురుస్తున్న కారణంగా ఉత్పత్తిలో ఆటంకం ఏర్పడుతుంది. గత మూడు రోజులలో ఆర్జీ 1లో 12వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ప్రాజెక్ట్‌లో వరదతో బురద ఏర్పడి భారీ యంత్రాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. వరద నీరు ప్రాజెక్ట్‌లో చేరుతుండగా, ఎప్పటికప్పుడు తొలగిస్తున్నప్పటికీ మళ్లీ కొత్త నీరు వచ్చి చేరడంతో బొగ్గు ఉత్పత్తి చేయలేకపోతున్నారు.

రేవంత్ పాలనలో రైతులకు కన్నీరే

- అన్నదాతను కంటికి రెప్పలా కాపాడిన కేసీఆర్
- మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



నవతెలంగాణ-కోల్‌సిటీ:

సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రైతులకు కన్నీరే మిగిలిందని, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అన్నదాతను కంటికి రెప్పలా కాపాడు కున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, భారాస పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తూ అనేక ఆంక్షలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. అమలుకు సాధ్యం కాని మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని ఇప్పటికే ఈ విషయం ప్రజలకు అర్థమైందన్నారు. ఇంటిం టికీ సంక్షేమ ఫలాలు అందించి, నీతిఆయోగ్ సైతం అభినందించేలా దేశంలోనే ఆదర్శవంత పథకాలను ప్రవేశపెట్టిన ఘనత గత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఏకకాలంలో రైతుల రుణమాఫీతో పాటు, గోదావరి దిశను మార్చి తెలంగాణ ప్రజల దశ మార్చిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆ ర్‌పై తప్పుడు ఆరోపణలు చేసిన నాయకులకు మేడిగడ్డలో ప్రవహించే గోదావరి నీరే నిదర్శన మన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలు, రైతు లు, నిరుద్యోగులతో పాటు, జాబ్ క్యాలెండ ర్‌పై ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పెదవారి ముఖంలో అనందం కోసం "మేము సైతం కేటీఆర్ అన్న బాటలో" అనే వాల్‌పోస్టర్‌ను చందర్ ఆవిష్కరించారు. మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా రామగుండం నియోజక వర్గం ప్రతి డివిజన్‌లో గ్రామంలో గిఫ్ట్ ఏ స్మైల్ సేవ కార్యక్రమాలు చెపడుతున్నా మన్నారు. కార్పొరేటర్ గాధం విజయ, నడిపెల్లి మురళీధర్ రావు, అచ్చే వేణు, చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేష్, నూతి తిరుపతి, జహిద్ పాషా, చెలకల పల్లి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, బోడ్డుపల్లి శ్రీనివాస్, చల్లా రవీందర్ రెడ్డి, ఆడప శ్రీనివాస్, తోకల రమేష్, ఓదేలు, గుంపుల లక్ష్మి, తాళ్ల శ్యాం, చింటూ పాల్గొన్నారు.

దళిత వర్గాలకు అండగా ఉంటా

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



నవతెలంగాణ-పెద్దపల్లి

దళితుల సామాజిక సాంస్కృతిక ఆర్థిక విద్యాపరమైన హక్కులతో పాటు రాజకీయ పరమైన హక్కుల కోసం పోరాటం చేస్తున్న, ఆల్ ఇండియా అంబేద్కర్ యువ సంఘం క్రమశి క్షణకు మారుపే రని,దళిత వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణా రావు అన్నారు. ఆదివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయర మణా రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపట్టిందని, అర్హులందరికి అందే విధంగా కృషి చేస్తానన్నారు. దళిత అణగారిన వర్గాలకు ఏ సమస్య వచ్చిన తాను పరిష్కరించే ందుకు కృషి చేస్తానన్నారు. స్వతంత్రం వచ్చి 75సంవత్సరాల కాలంలో బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే భారతదేశానికి దిక్సూచిగా మారిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కూడా బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన ఆర్టికల్ ద్వారా వచ్చిందన్నారు.ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దళిత అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య అధ్యక్షతన జరిగిన, శిక్షణ తరగతులలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ అధ్యక్షులు, ఎస్ వరుణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు, కాదరం వినయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు లంక సదయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆసంపల్లి శ్రీనివాస్,జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



నవతెలంగాణ-పెద్దపల్లి

ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ఈనెల 23 నుంచి జరగబోయే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై చర్చించి ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గల్లీ నుండి ఢిల్లీ రాక తొలి, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు అందరికీ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ 250 గజాల ఇంటి స్థలాన్ని అందరికీ వర్తింపచేయాలని, కేవలం ఎఫ్ఐఆర్ ఉన్న వాళ్ళకి కాకుండా ఉద్యమాన్ని ఉవ్వెత్తిన లేపి నష్టపోయిన ఉద్యమకారులను కూడా గుర్తించి అందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణల నాయకత్వంలో ఈ ప్రాంత ఉద్యమకారులు అందరికీ న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం, పార్ల మెంట్ కన్వీనర్ బత్తుల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల గట్టయ్య, జిల్లా మహిళ అధ్యక్షురాలు దుబ్బేటి చంద్రకళ, ఉపాధ్యక్షులు మంద భాస్కర్, కార్యదర్శి కళాధర్ రెడ్డి, శారద, లక్ష్మీ, పాల్గొన్నారు.

మాదిగలను అణచి వేస్తున్న

కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-పెద్దపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను అణచివేస్తుందని,మాదిగలంతా ఏకం కావాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు.ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు సురేందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో సామాజిక న్యాయం అనే అంశంపై మాదిగ శక్తి సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఉస్మానియ యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసీం, హైకోర్టు అడ్వకేట్ ఎస్. శరత్ కుమార్,తెలంగాణ ఉద్యమ కారులు సీనియర్ పాత్రికేయులు తెలంగాణ విఠల్‌లు హాజరై మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోనీ మాదిగలనే కాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాదిగలను ఏకం చేయాల్సిన బాధ్యత సురేందర్ మాదిగ మీద ఉన్నదని అన్నారు. రేవంత్ రెడ్డి ఒక్క మాదిగలనే కాకుండా బీసీలకు అందాల్సిన రాజకీయ వాటాను దక్కకుండా చేస్తున్నాడని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ మాదిగలను విస్మరించాడని యావత్తు మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే ముఖ్య మంత్రి అయిన తర్వాత 80 లక్షల జనాభా కలిగిన మాదిగ జాతిని రాజకీయంగా రేవంత్ రెడ్డి బొంద పెట్టాడని అన్నారు.

ముగిసిన సింగరేణి ఉద్యోగ నియామక పరీక్షలు

హైదరాబాద్‌లో 12 కేంద్రాలలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహణ

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన

సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్ ఎన్‌వీకే.శ్రీనివాస్



నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి సంస్థలో 272 ఖాళీల భర్తీకి ఈనెల 20,21వ తేదీలలో 12 సెంటర్లలో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు విజయవంతంగా ముగిశాయని, సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశాల మేరకు తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ఈ పరీక్షలను అత్యంత పటిష్టంగా, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిర్వహించా మని యాజమాన్యం వెల్లడించింది. 20వ తేదీన మూడు షిఫ్టులలో జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రెయినీ (ఎఫ్అండ్ఎ), జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రెయినీ హైడ్రోజియాలజిస్ట్, మేనేజ్మెంట్ ట్రెయినీ సివిల్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, మేనేజ్మెంట్ ట్రెయినీ (ఐఈ), సబ్ ఓవర్ సిర్ ట్రెయినీ సివిల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా మొత్తం 11,724 అభ్యర్థులకు గాను7,073 అభ్యర్థులు (60.53 శాతం) పరీక్షలు రాసినట్లు తెలిపిది. అలాగే 21వ తేదీన రెండు షిఫ్టులలో మేనేజ్మెంట్ ట్రెయినే (మైనింగ్) మేనేజ్మెంట్ ట్రయినీ (పర్సనల్) పోస్టులకు పరీక్ష నిర్వహించగా, మొత్తం 6,931 అభ్యర్థులకు 4,972 (71.73శాతం) అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : పెద్దపల్లి ఏసీపీ కృష్ణ



నవతెలంగాణ పెద్దపల్లి టౌన్

పెద్దపల్లి డివిజన్ పరిధిలోని కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఎవరు బయటకు రావద్దని పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ అన్నారు. ఆదివారం నాడు పెద్దపల్లి సీఐ ఆర్.కృష్ణ, బసంత్‌నగర్ పెద్దపల్లి ఎస్ఐలతో కలిసి సబితం, పెద్దబొంకూర్ దస్తగిరి పల్లి కొత్తపల్లిలోని లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలించా రు. నిరంతర వర్షపాతం కారణంగా జలపాతాన్ని సందర్శించ కుండా వార్న్‌ఫ్లెక్సీలు, బారికేడ్లుఏర్పాటు చేయడం జరిగిందని ఏసీపీ కృష్ణ తెలిపారు. ఏదైనా ఆపద సంభవిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేకుంటే 100 కి కాల్ చేయాలని తెలియజేశారు.

కోట సమ్మయ్య గౌడ్‌కు నివాళులర్పించిన మాజీ ఎంపీపీ



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

ఇటీవల మృతి చెందిన పెద్దపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కోట సమ్మయ్య గౌడ్ సంతాప సభలో పాల్గొని మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సింగం సత్తయ్య గౌడ్, పెద్దపల్లి జిల్లా గోపా అధ్యక్షులు బాలసాని వెంకటేశం గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ కోల లక్ష్మన్ గౌడ్, గౌడ సంఘం నాయకులు బొబ్బిలి రాజమౌళి గౌడ్‌లున్నారు.

పలు గ్రామాలకు నూతన పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-జూలపల్లి/ ఎలిగేడు

ఎలిగేడు మండలంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు బదిలీ కావడంతో కొత్తగా బదిలీపై వచ్చిన కార్యదర్శులు శనివారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో భాస్కరరావుకు తమ జైనింగ్ కాపీలను అందజేశారు. బురహాన్ మీయాపేటకు మల్లేష్, దూళికట్ట పున్నమయ్య, ఎలిగేడు అంజలి, లాలపల్లె సురేష్, లోకపేట మహమ్మద్ మసీద్దీన్, ముప్పిరితోట శిరీష, నర్సాపూర్ లలిత, నారాయణ పల్లె పాపయ్య, రేకల్దేవ్‌పల్లి కె.వి ప్రమోద్ కుమార్, రాములపల్లి రాచర్ల హరిబాబు, శివపల్లి శ్రవణ్ కుమార్, సుల్తాన్‌పూర్ శివకుమార్‌లు బాధ్యతలు చేపట్టారు.

డాక్టరేట్ సాధించిన నర్సాపూర్ యువకుడు సృజన్



నవతెలంగాణ-జూలపల్లి /ఎలిగేడు

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించాడు ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ ఆలోచన విధాన పరుడు కాంపెల్లి లక్ష్మణ్ బాబు అనితల కుమారు డు కాంపెల్లి సృజన్ కుమార్. చిన్నప్పటినుండి చదువులో చురుకైన విద్యార్థిగా మంచి మార్కుల తో ఉత్తీర్ణుడయ్యాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత చదువుల కోసం ఉస్మానియా యూనివ ర్సిటీలో చదివి యూనివర్సిటీ సైన్స్ విభాగం పర్యావరణ శాస్త్రంలో జీవ గార్బేజ్ యెంజం ద్వారా వ్యర్థ జలాల పారిశుద్ధం కోసం ఆరు సంవత్సరాల పరిశోధనకు గాను డాక్టరేట్ సాధించాడు. యూజీసీ అందించే అత్యున్నత జూనియర్ రీసెర్చ్ ఫెలో ఫెలోషిప్‌ను మెరిట్ ద్వారా సాధించాడు. సమాజ మార్పు కోసం తన పరిశోధన ఉపయోగపడితే ఇంతకన్నా సంతోషం లేదని సృజన్ అన్నారు. నా పరిశోధన కోసం నాకు అన్ని విధాలా తోడ్పాటును అందించిన సూపర్వైజర్ డాక్టర్ శశికళ ఎస్టీఎం పన్నా సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

రామగుండం ఎస్సై సమ్మయ్య

రామగుండం-నవతెలంగాణ

వర్షాకాలంలో కరెంట్ ప్రమాదాలకి గురికాకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని రామగుండం ఎస్సై సమ్మయ్య సూచించారు. వర్షాకాలంలో పార్కులు, పబ్లిక్ ప్రదేశాల్లో కరెంట్ స్థంబాలు ముట్టుకోవడం వాటికి ఒరగటం వంటివి చేయరాదని పేర్కొన్నారు. గాలి వీచే సమయాల్లో స్థంబాలు చెట్ల కింద నిలబడకూడదన్నారు.

శిథిలావస్థలో ఉన్న ఇండ్లపట్ల అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ ఆకుల వెంకటేష్



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

గత మూడు రోజులుగా కురుస్తున్న టువంటి వర్షాల పట్ల పెద్దపల్లి పట్టణంలోని 12,16, 32, వార్డులో శిథిలావస్థలో ఉన్నటువంటి ఇండ్లు కూలిపోయాయి. ఆదివారం నాడు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మున్సిపల్ రిస్క్‌టీం సిబ్బందితో కలిసి కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డులలో ఉన్నటువంటి పురాతన ఇండ్లు కూలిపోవడం జరిగిందని ఎటువంటి ప్రాణ నష్టం కానీ ఆస్తి నష్టం కానీ జరగలేదని అట్టి ఇండ్లలో ఎవరు నివసించడం లేదని ఇండ్లలో ఉన్నటువంటి వారిని త్వరగా పునరావాస కేంద్రానికి తరలించడం జరుగుతుందని దయచేసి పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేసేది ఏమిటంటే మీయొక్క వార్డులలో ఉన్నటువంటి పురాతన ఇండ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని అటువంటి ఇల్లు ఏమైనా ఉన్నట్లయితే మా టోల్ ఫ్రీ నెంబర్ 63031 27484 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో 16 వ వార్డు కౌన్సిలర్ రాజాం మహంత కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ దేవానంది రమాకాంత్ రిస్క్ టీం సభ్యులు బండి అనిల్, లక్ష్మీ నరసయ్య, అనాసి శ్రీకాంత్, ఆరెముల్ల శంకర్, సింగారపు శ్రీనివాస్, పాల్గొన్నారు

గురుపూర్ణిమ సందర్భంగా అవార్డు ప్రధానం





నవతెలంగాణ-రామగుండం

గురుపౌర్ణమి సందర్భంగా విశ్వభారతి విద్యాసంస్థల ఛైర్మన్,హెచ్ఎంలు ప్రతి ష్ఠాత్మక అవార్డులను అందుకు న్నారు. గోదావరిఖని, ఎన్టీపీసీ, రామ గుండం పారిశ్రామిక ప్రాంతంలో 32 ఏళ్లుగా విశ్వభారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎందరో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది,అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నందుకు హైదరాబాద్‌లోని నేషనల్ సెమ్స్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రధానం చేశారు. విశ్వభారతి సంస్థల ఛైర్మన్ బంధారపు యాదగిరి గౌడ్‌కు ఎమరాల్డ్ అచీవ్‌మెంట్, హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్ గోల్డెన్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రధానం చేసినట్లు నేషనల్ సెమ్స్ ఒలంపియాడ్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి, కో కన్వీనర్ ఎస్ ఎన్ రెడ్డి, ట్రస్మ రాష్ట్ర అధ్యక్షులు కందాల పాపిరెడ్డి ప్రకటించారు. అవార్డు అందుకున్న యాదగిరి గౌడ్, తిరుపతి గౌడ్‌కు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ
9
కరీంనగర్
సోమవారం | జులై 22, 2024 | www.navatelangana.com

బాధ్యులను కఠినంగా శిక్షించాలి : సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం



నవతెలంగాణ - కరీంనగర్

నగర్‌కర్నూల్ జిల్లాలో మద్యం సేవించి ఇద్దరు మహిళ కూలీల పట్ల విచక్షణ రహితంగా వ్యవహరించి, లైంగికదాడి చేసిన బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళల పట్ల రోజురోజుకు లైంగికదాడులు హత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా కఠిన చట్టాలు అమలు చేయలేకపోయారని, ఈ ప్రభుత్వంలోనైనా కఠినంగా వ్యవహరించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధ్యులను కఠినంగా శిక్షించి, మహిళలను రక్షించాలని అన్నారు. రోజురోజుకు మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందని, పనిచేసే చోట లైంగిక వేధింపులు ఎక్కువైతున్నాయని అన్నారు. షీ టీం, సఖి లాంటి సెంటర్లను ఏర్పాటు చేసి మహిళలకు తోడ్పాటును అందిస్తున్న ప్రభుత్వాలు దుర్ఘటనలు జరిగినప్పుడు పర్యటనలు చేసి తూతూ మంత్రంగా చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. వెంటనే స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షిస్తే తిరిగి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. మహిళలకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం నెలకు మహిళలకు రూ.2500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అన్నదాతలో చిగురించిన ఆశలు..

- పంటలకు అనువుగా వర్షాలు
- పంటల సాగుపై నజర్



నవతెలంగాణ - గంగాధర

పంటలకు అనువుగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలో ఆశలు చిగురించాయి. నిన్న, మొన్నటి వరకు వర్షాలు లేక దుక్కులు దున్ని పత్తి, మక్క విత్తనాలు చల్లగా, నాట్లు వేయడానికి నీరు లేక వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు చూశారు. కాలం కలిసొస్తుందా లేదా అనే దిగులులో ఉన్న రైతాంగం ఆశించినట్టే 3 రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గంగాధర మండలంలోని మెట్ట ప్రాంత రైతాంగంలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా వర్షాకాలం సీజన్‌పైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. బోర్లు, బావులలో నీరున్న రైతులు వరి సాగుపైనే దృష్టి సారిస్తే, చాలామంది రైతులు పత్తి, మక్క, పెసర, కంది, అనుములు వంటి పలు రకాల పంటలను సాగు చేశారు. ఆశించిన వర్షాలు కురువక నిన్న, మొన్నటి వరకు నాట్లు వేయకుండా నిరీక్షించిన రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నం కాగా, పత్తి, మక్క, పెసర, కంది వంటి పంటలు సాగు చేసిన రైతులు కలుపు తీసే పనులను ముమ్మరం చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, చిరు జల్లులను లెక్క చేయకుండా చాలా మంది రైతులు వరిమళ్లలో నాట్లు వేస్తున్నారు. నారు పోసి ఇప్పటికే ముదిరిపోయే పరిస్థితికి చేరడంతో ఆలస్యం చేయకుండా నాట్లు వేసే పనులను వేగవంతం చేశారు. ప్రతి వానాకాలం సీజన్‌లో ఈ ప్రాంత రైతాంగం అయితే అతివృష్టి లేదంటే అనావృష్టి పరిస్థితులు ఏర్పడుతూ తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి యేటా జరుగుతున్నట్టే ఈ యేడు కూడా అటువంటి పరిస్థితులే ఏర్పడుతాయా లేక పంటలకు అనువుగా ఆశించిన వర్షాలు కురుస్తాయా అనే సంశయమే నెలకొంది.

వర్షాధార పంటలే అధికం

చొప్పదండి నియోజక వర్గంలోని గంగాధర, రామడుగు, చొప్పదండి, కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాల్లోని మెట్ట ప్రాంత రైతాంగం ప్రతి యేటా వర్షాధార పంటలే అధికంగా సాగు చేస్తున్నారు. పదేండ్లకు ముందు ఈ ప్రాంతంలో ఎటువంటి వరద కాలువలు, కెనాల్ పారకం కాలువలు లేవు. దీంతో అనుకూలమైన వర్షాలు కురిస్తేనే చెరువు పారకం, బావులు, బోర్ల నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసేది. కాని గడిచిన పదేండ్ల నుండి ఎల్లంపల్లి, మేడిగడ్డ ప్రాజెక్టుల నీటితో ఎత్తిపోతల పథకం చేపట్టారు. తద్వారా వరద కాలువలు, చిన్న తరహా ప్రాజెక్టు కాలువలు, చెరువు నీరు ఈ ప్రాంత రైతాంగానికి అందుబాటులోకి వచ్చాయి. తొమ్మిదేండ్లుగా గంగాధర, రామడుగు, చొప్పదండి, బోయినపల్లి, కొడిమ్యాల, మల్యాలతోపాటు కరీంనగర్ మండలంలోని అనేక గ్రామాల్లో వరితోపాటు అనేక రకాల పంటల దిగుబడి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. కాని మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగడం, ప్రాజెక్టు డ్యామేజ్ కావడంతో గత 8 మాసాలుగా వరద కాలువలు వట్టిపోతుండగా, ఎత్తిపోతలు లేక చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో ఈ ప్రాంతంలో మళ్లీ కరువు ఛాయలే కమ్ముకోగా, తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ వరుణుడి కరుణపైనే ఆశలు పెట్టుకునే గడ్డు పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

సన్నగిల్లిన భరోసా..

ఎల్లంపల్లి, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో ఈ వర్షాకాలంలో నీరు నిల్వ చేసే వీలే లేకపోగా, ఎత్తిపోతలు చేపట్టే పరిస్థితే లేదు. దీంతో వరద కాలువలు, చెరువులు, కుంటలు, సాగునీటి కాలువలు వర్షాలు కురిస్తే నీరు చేరాలి తప్పా ఎత్తిపోతలతో వేటిలోకి నీరు చేరే పరిస్థితి లేదు. వరద కాలువలు, చెరువు, కుంటలపై ఆశలు సన్నగిల్లిన రైతులు వర్షాలు అనుకూలిస్తే తప్పా ఆశించిన పంటల దిగుబడి రాదనే విషయం ముందే గ్రహించారు. దీంతో పంటలు సాగు చేస్తే నీరందుతుందని అనుకున్న భూముల్లోనే రైతులు పంటలు సాగు చేసి వాటిపైనే దృష్టి సారించారు.

సాగు భూములివే

గంగాధర మండలంలో రాగడి, సవుడు, ఎర్ర నేలలే అధికంగా ఉన్నాయి. మండలంలో 39 వేల 269 ఎకరాల భూములు సాగుకు యోగ్యమైనవి ఉండగా, వానాకాలం సీజన్‌లో సుమారుగా 22 వేల 600 ఎకరాల్లో పలు



కురిక్యాలలో సాగు చేసిన పత్తి

రకాల పంటలను సాగు చేస్తున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గతంలో 17 వేల ఎకరాల మేరకు పత్తిని సాగు చేయగా, గడిచిన తొమ్మిదేళ్ల వరిపైనే గురిపెట్టారు. గడిచిన తొమ్మిదేళ్లలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేకపోగా, వరద కాలువలు, కాలువలు, చెరువులు, కుంటల్లోకి ఎత్తిపోతల నీరు చేరే పరిస్థితి లేదు. దీంతో వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సి రావడంతో మళ్లీ పత్తి సాగే అధికంగా చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు.


వర్షాలు కురిస్తేనే పంటలపై ఆశలు



గోలి నారాయణరెడ్డి, కౌలు రైతు, కురిక్యాల

ఆశించిన వర్షాలు కురుస్తాయనే పంటలపై ఆశలు పెట్టుకున్న. 2 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేసిన. నేను, నా భార్య, కూలీల కష్టం కాకుండా ఇప్పటికే 40 వేలు పెట్టుబడి అయ్యింది. నెల కిందే దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేశాం. అప్పుడప్పుడు పడిన చినుకులకు పత్తి మొలకెత్తిన 3 రోజులుగా కురుస్తున్న వానలే పత్తికి జీవం పోశాయి.

వర్షాలు కురిస్తేనే..



అజయ్‌రావు, రైతు, బూర్గుపల్లి

ఎత్తిపోతలు లేక మళ్లీ గడ్డు పరిస్థితులే ఏర్పడుతున్నయి. ఎత్తిపోతల ద్వారా వరద కాలువలు, చెరువులు, కుంటలు నింపితేనే బావులు, బోర్లలో నీరుంటుంది. ఇప్పుడా పరిస్థితులు లేవు. వర్షాలపై ఆధారపడే మళ్లీ పంటలు సాగు చేసే పరిస్థితి ఏర్పడింది. అనుకూలమైన వర్షాలు కురిస్తే పంటలు పండినట్టు లేదంటే అంతే. దేవుడిపైనే భారం వేసి పంటలు సాగు చేస్తున్నం. వర్షం పడితే పంటలు లేదంటే పెట్టిన పెట్టుబడి, పడిన శ్రమ వృథానే.

చేతి వృత్తులకు చేయూత పీఎం విశ్వకర్మ

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కలల సాకారానికి వేదిక స్టార్టప్ ఇండియా యాత్ర

- రాపిడో గ్రో క్రెడిట్ సొసైటీ, కార్బన్ రహిత ఎలైట్ సంస్థల కృషి అభినందనీయం

- జిల్లా పరిశ్రమల మేనేజర్ నవీన్‌కుమార్



నవతెలంగాణ - కరీంనగర్

మన దేశంలో ఎన్నో లక్షల గ్రామాలున్నాయని వాటిలో ఎంతోమంది చేతివృత్తులపై ఆదారపడి జీవిస్తున్నారని.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్న సదాశయంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమల్లోకి తెచ్చిందని జిల్లా పరిశ్రమల మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఆర్య వైశ్య భవన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి వారిద్వారా చిన్న, మధ్య సూక్ష్మ అంకుర సంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో జిల్లాలోని చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా కరీంనగర్ చాప్టర్ లఘు ఉద్యోగ భారతి వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కలల సాకారానికి వేదికగా స్టార్టప్ ఇండియా యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ బస్సు యాత్ర ద్వారా 100రోజుల్లో 100పట్టణాలలో 100 కార్యక్రమాలను నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం మొదలై కరీంనగర్ జిల్లాకు వచ్చిన సందర్భంగా ఈ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రాపిడో గ్రో క్రెడిట్ సొసైటీ, కార్బన్ రహిత ఎలైట్ సంస్థల కృషి అభినందనీయం అన్నారు. జిల్లాలోని యూనియన్ బ్యాంక్ డివిజనల్ మేనేజర్ అపర్ణరెడ్డి, లఘు ఉద్యోగ భారతి ఈసీ కౌన్సిల్ మెంబర్, అశ్విని హెయిర్ ఆయిల్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పారిశ్రామక వ్యక్తులకు బ్యాంకులు అందించే రుణ సదుపాయలను వివరించారు. చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా సంస్థ కరీంనగర్ పట్టణ ప్రెసిడెంట్ చిరంజీవి, వైస్ ప్రెసిడెంట్ మల్లేశం మాట్లాడుతూ చార్టడ్ అకౌంటెంట్‌లు జిల్లా పారిశ్రామిక రంగానికి అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్పాన్సర్స్‌గా వ్యవహరించిన కరీంనగర్ పట్టణం సెవెన్ హిల్ కేంద్రంగా పనిచేసే రాపిడ్ గ్రో సహకార క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ రాజేంద్రర్‌ప్రసాద్, ఎలైట్ కార్బన్ క్లీనింగ్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, రమేష్‌రావు కాలుష్య రహిత వాహనాల నియంత్రణ గురించి వివరించారు. కార్బన్ రహిత వాహనాల ద్వారా ప్రయోజనాలను వివరించారు. దీంతో అక్కడ ఉన్న సీఎలు, వ్యాపారవేత్తలు తమ వాహనాలను కార్బన్ రహితంగా తయారు చేసుకునేందుకు ఆసక్తి చూపారు. ఈ డీ కార్బన్ ఆఫ్ ఇంజన్స్ ద్వారా వాహనాలను కాలుష్య రహితంగా కార్బన రహితంగా తయారు చేసే ప్రక్రియను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన అందరికి ఆకర్షించింది.

ఈ కార్యక్రమానికి కరీంనగర్ చార్టెడ్ అకౌంట్ కరీంనగర్ శాఖ చైర్మన్ అని రెడ్డి చిరంజీవి, వైస్ చైర్మన్ సిఏ వెన్నం మల్లేశం, కార్యదర్శి సిఏ రామిడి సంతోష్, సిఏ ఆర్.సతీష్, సిఏ టి.ఆంజనేయులు, విద్యార్థుల శాఖ చైర్మన్ సిఏ వనపట్ల శేఖర్‌రెడ్డి, సిఏలు డి.నిరంజనచారి, సంతోష్‌రెడ్డి, జి.ఆనంద్ కుమార్ మొదలైన వారితో పాటు రైస్ మిల్లు సంఘం ప్రతినిధులు, గ్రానైట్ కట్టింగ్, పోలీసు యూనిట్ సంఘ ప్రతినిధులు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్, వివిధ రకాలైన సంఘాల ప్రతినిధులు సుమారు 300 మంది హాజరయ్యారు.

సుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ - ఇల్లందకుంట

శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇల్లందకుంట మండల అధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనవెంట జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్, గోలి కిరణ్, ఉప్పుల అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారులు జాగ్రత్తలు పాటించాలి

జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్



నవతెలంగాణ - ఇల్లందకుంట

మత్స్యకారులు ఎవరు చేపల వేటకు వెళ్లొద్దని, ఒకవేళ వెళితే తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్ అన్నారు. ఇల్లందకుంటలో మాట్లాడుతూ జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు చెరువులు, కుంటలు మత్తడులు పడుతున్నాయని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లేటప్పుడు తగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2003-2006 బీకాం డిగ్రీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. డిగ్రీ కళాశాల లెక్చరర్స్ చంద్రమౌళి, లింగారెడ్డి, విజేందర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్‌ను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు కొలువురు సురేష్, వడ్లూరి కిషోర్, మైనర్, కిరణ్, హజరత్ పాషా, జగన్, శ్రీకాంత్ తహేర, అలియాంజ్, అఖండేశ్వరి, అలువేని, నసీమా, రమ్యకృష్ణతోపాటు 50మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ జీవిత బీమా చెక్కు అందజేత



నవతెలంగాణ - జమ్మికుంట

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంట మున్సిపల్ పరిధి, అబాది జమ్మికుంట, వావిలాల గ్రామాలలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన బండి రాజశేఖర్, కొమ్ము కొమురయ్య కుటుంబాలకు రూ.2లక్షల విలువ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'



నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంట మండలంలో భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటల రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చెల్పూరి రాములు కోరారు. ఈ మేరకు ఆదివారం పంటలను పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న పంటలు నీటిలో మునిగి దెబ్బతిన్నాయని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో పంటలను పరిశీలించి, పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వన్‌టౌన్‌లో బాలుడి అప్పగింత

నవతెలంగాణ - కరీంనగర్ : ఆదివారం కరీంనగర్ బస్టాండ్‌లో ఒక 9 సంవత్సరాల బాలుడు ప్లాట్‌ఫామ్ 17 దగ్గర ఒక ప్రయాణికుడు హైదరాబాద్ బస్సు ఎక్కేటప్పుడు అతని జేబులో నుంచి పర్సు తీసే ప్రయత్నం చేస్తుండగా బస్సు స్టేషన్ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. కరీంనగర్ 1 టౌన్‌లో అప్పజెప్పినట్టు సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ ఎం.సాగర్, కానిస్టేబుల్ జి.కవిత, హరీష్ తెలిపారు.

కరెంట్‌షాక్‌తో గేదె మృతి



నవతెలంగాణ - జమ్మికుంట : మండలంలోని శంభునిపల్లి గ్రామంలో ఆదివారం కరెంట్‌షాక్‌తో పాడి గేదె మృతిచెందింది. బాధితుని వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన చెరుకు రాజయ్యకు చెందిన పాడి గేదె మేత కోసం పొలం వైపునకు వెళ్లింది. గేదె మేత మేస్తున్న సమయంలో గాలి వర్షానికి తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో షాక్ గురై అక్కడిక్కడే మృతిచెందింది. గేదె యజమాని ఆదివారం ఉదయం గేదె కోసం వెతుకుతుండగా చనిపోయి ఉంది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఫిట్‌నెస్‌తో ఆరోగ్యకరమైన సమాజం

రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ బంగారు స్వామి

రెనీ స్కై ఫిటెనెస్ క్లబ్ సెంటర్‌ను ప్రారంభించిన మేయర్



నవతెలంగాణ - కరీంనగర్

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు శరీర దృఢత్వానికి సమయం కేటాయించాలని రెనీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బంగారు స్వామి అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లాకేంద్రం ముకరాంపూరలో ఏర్పాటు చేసిన రెనీ స్కై ఫిటెనెస్ సెంటర్‌ను నగర మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, రెనీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బంగారు స్వామి, ఏసీపీ నరేందర్, లక్ష్ గ్రూప్ ఆఫ్‌స్కూల్స్ చైర్మన్ ముస్తాక్‌అలీ, ఫిటెనెస్ సెంటర్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెనీ హాస్పిటల్స్ చైర్మన్ మాట్లాడుతూ ఇనుపకండలు, ఉక్కు నరాలు కలిగిన యువత భారతదేశానికి ఎంతో అవసరమని అన్నారు. స్థానికంగా యువత ఈ ఫిటెనెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిమ్ నిర్వాహకులు 15సంవత్సరాల నుండి తనకు ట్రైనర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. తాను మాత్రమే ఆరోగ్యంగా ఉంటే సరిపోదని, సొసైటీ ఆరోగ్యంగా ఉంచాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ ఫిటెనెస్ క్లబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరు దినచర్యలో భాగంగా వ్యాయమంపై దృష్టిసారిస్తే ఆరోగ్యం బాగుంటదన్నారు. వైద్య సేవలతో పాటు ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ హెల్త్ క్లబ్ ప్రారంభించామన్నారు. ఈ జిమ్‌లో సుశిక్షితులైన సిబ్బంది ద్వారా ట్రైనింగ్ ఇస్తామన్నారు. జిమ్ మేనేజింగ్ డైరెక్టర్, నేషనల్ బాడీ బిల్డింగ్ రిఫరీ, తెలంగాణా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇంతియాజ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో అత్యున్నత, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరికరాలను ఈ జిమ్‌లో ఏర్పాటు చేశామని, కరీంనగర్‌లో మొట్ట మొదటి యూనిసెక్స్ జిమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్త్రీ, పురుషులకు ప్రత్యేక ట్రైనింగ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్, స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, 4వ డివిజన్ కార్పొరేటర్ అలి బా, లయన్స్ క్లబ్ బాధ్యులు కెప్టెన్.డా.బుర్ర మధుసూదన్ రెడ్డి, ఇనుగుర్తి రమేష్, జగదీశ్వరచారి, ముతోజు వేణు, కోట సత్యం, మేకల అరవింద్‌రావు పాల్గొన్నారు.



ఇల్లందకుంట దేవస్థానంలో రాజ్యసభ సభ్యుడి పూజలు



నవతెలంగాణ - ఇల్లందకుంట

ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని రాజ్యసభ సభ్యుడు, హెటీరో డ్రగ్స్ అండ్ ఫార్మసీ చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ తో స్వాగతం తెలిపి సాదరంగా ఆహ్వానించారు. సీతారామచంద్ర ఆలయానికి గతంలో మూడు కోట్ల రూపాయల నిధులతో సాలహారం, రాజగోపురం దేవాలయం లోపల గ్రానైట్ వేయించారని ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. ఆలయంలో భక్తుల కోసం వసతి గృహాలు, భక్తుల సౌకర్యార్థం నిధులను మంజూరు చేస్తానని రాజ్యసభ సభ్యుడు తెలిపినట్లు ఈవో తెలిపారు. అనంతరం ఆలయ ఈవో సుధాకర్, ఆలయ సిబ్బంది రాజ్యసభ సభ్యుడిని సన్మానించారు.

వాసవి వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు



నవతెలంగాణ - గన్నేరువరం

మండలంలోని కాసింపేట గ్రామంలో మానసాదేవి ఆలయంలో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌కు చెందిన వాసవి వాగ్దేవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, సభ్యులు, వాసవి వనిత క్లబ్ సెక్రటరీ ఎం.స్వరూప, ఉపాధ్యక్షులు లత, హరిణి, ప్రముఖ వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



నవతెలంగాణ - జమ్మికుంట

ఆర్య వైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎనిమిళ్ళ రాజేంద్ర ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చందరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సంఘం నాయకులు పలువురు రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గురు పౌర్ణమి వేడుకలు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట పట్టణంలోని శ్రీ లక్ష్మీ గణపతి శిరిడి సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను అర్చకులు సముద్రాల ప్రసాదాచార్యులు, కిషోర్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

నవతెలంగాణ - తిమ్మాపూర్

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (అటానమస్) కళాశాల ఆవరణలోని శ్రీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, చైర్‌పర్సన్ విజయలక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కళాశాల ప్రాంగణంలో గల సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు.

నవతెలంగాణ - శంకరపట్నం

మండలంలోని కన్నాపూర్ గ్రామం శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపిటిసి మోతె భాగ్యలక్ష్మిఎల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అడీతం కుమార్, పంజాల రమేష్, సత్యనారాయణ, కాటం సంపత్‌రెడ్డి, రేణుక, రమణారెడ్డి పాల్గొన్నారు.

బియ్యం అందజేత



నవతెలంగాణ - రామడుగు

మండలంలోని వెలిచాల శివారులో ప్రశాంత్ భవన్‌లోని చిన్నారులకు, స్పందన స్వచ్ఛంద సంస్థ వృద్ధాశ్రమంలో రెండు క్వింటాళ్ల బియ్యం, నిత్యావసర సరుకులు సద్గురు రాధారపు నారాయణ స్వామి ఆచార్యులు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గురు పౌర్ణమి సందర్భంగా బియ్యాన్ని అందజేసినట్లు తెలిపారు.

ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి

జమ్మికుంట పట్టణ సీఐ రవి



నవతెలంగాణ - జమ్మికుంట

ప్రజలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని జమ్మికుంట పట్టణ సీఐ రవి అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికులకు చైన్‌స్నాచర్లపై అవగాహన నిర్వహించారు. ప్రయాణికులు ఎల్లవేళలా అజాగ్రత్తగా ఉండకుండా జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలకు గురి కాకుండా అలాగే చైన్ స్నాచర్ల బారిన పడకుండా, మాయమాటలు చెప్పి బ్యాగులు దొంగతనాల చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ - కరీంనగర్

గోసంగి, కుమ్మరి కులస్తుల పోచమ్మ బోనాలలో ఆదివారం సుడా చైర్మెన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. స్థానిక బైపాస్‌లోని దేవుళ్లపురిలో ఉన్న పోచమ్మ గుడిలో కుమ్మరి కులస్తుల బోనాల పూజలో పాల్గొన్న నరేందర్‌రెడ్డికి డప్పు చప్పుల్లతో స్వాగతం పలికారు. జ్యోతినగర్‌లోని సంతోషిమాత దేవాలయం నుంచి గోసంగి కుల ప్రతినిధులు మహిళలు బోనాలెత్తుకొని పోచమ్మ గుడి వరకు వెళ్లారు. ప్రతినిధులు రాధారపు శ్రీనివాస్, కొరేపు లక్ష్మయ్య, నాంపల్లి శంకర్, సదానందం, గోసంగి కుల ప్రతినిధులు మామిడిపల్లి రమేష్, కామారపు రమణ, రామచంద్రం, సత్యం, శ్రీకాంత్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, పెద్దిగారి తిరుపతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ - శంకరపట్నం

శంకరపట్నం మండలం కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996- 97వ విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మొలంగూర్‌లోని వీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుద్దాల కుమార్, వీరేశం, హెడ్‌మాస్టర్ సురేందర్, రాజు, సమ్మయ్య, విజయలక్ష్మి నాటి విద్యార్థులు అరుణ, సునీత, వాసవి, సువర్ణ, స్వరూప, బండ సతీష్, ఎన్.బుచ్చయ్య మల్లేశం, మురళీకృష్ణ, ప్రమోద్‌రెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ



నవతెలంగాణ - శంకరపట్నం

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి తక్షణమే చెల్లించాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ.ఖాద్రీ ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఖాద్రీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆడబిడ్డల పెండ్లి చేయలేక, ఇండ్లు కట్టుకోలేక సతమతమై ఆత్మక్షోభకు గురియై కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని పేర్కొన్నారు. వారికి సంబంధించిన సప్లిమెంటరీ సాలరీ, సరెండర్, మెడికల్, జీపీఎఫ్ ఫైనల్ పేమెంట్, టీజీజీఎల్ఐ, పార్ట్ ఫైనల్ బిల్స్ తదితర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో చాలామంది అసహనానికి గురవుతున్నారన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

బాధల్లో 'బత్తాయి' రైతన్న

ఏపుగా పెరిగి... దిగుబడి తగ్గి...

- ఆరేండ్లయినా కాపు కాయని వైనం
- పిందె దశలోనే నేలపాలు
- ఆవేదనలో రైతులు
- పరిహారం కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొత్త రకం నిమ్మ జాతి 'సద్గుడి' రకం మొక్కలు నాటిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. పంట ఏపుగా పెరుగుతున్న కొద్ది సంతోష పడే రైతన్న నేడు ఆవేదన చెందుతున్నారు. పంట ఏపుగా పెరిగింది కానీ దిగుబడి మాత్రం ఆశించినస్థాయిలో రావడం లేదు. సాధారణంగా బత్తాయి మొక్కలు నాటిన నాలుగేండ్లకు పంట దిగుబడి ప్రారంభమవుతుంది. కానీ ఆరేండ్లయినా దిగుబడి రాకపోవడం, కాపు కాసినా రాలిపోవడం, పూత దశలోనే తెగుళ్లు వంటి పరిస్థితులతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

మొక్కలు ఎక్కడ తెచ్చారు

తెలంగాణ ఉద్యాన శాఖ సూచనమేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం తిరుపతి పరిధిలోని పండ్ల మొక్కల పరిశోధన కేంద్రాల (తిరుపతి, వెంకటగిరి, మహానంది, అనంతపురం) నుంచి మొక్కలు తెచ్చారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి, కనెగల్, గుర్రంపోడ్, నిడమనూరు మండలాలకు చెందిన 70 మంది రైతులు 400 ఎకరాల్లో తిరుపతి నిమ్మ రంగాపూర్ (సద్గుడి) రకం బత్తాయి మొక్కలు కొనుగోలు చేసి నాటారు. అయితే మొక్కలు నాటిన నాలుగేండ్లకు కూడా కాపు రావడం లేదు. తమ భూముల్లో భూసారం తగ్గిపోయిందేమోనని రైతులు ఆలోచనలో పడ్డారు. లేకపోతే వాతావరణ మార్పుల కారణంగా ఇలా జరుగుతుందేమోనని భావించారు. కానీ వారి భూముల పక్కనే మరోరకం జంబేరి మొక్కలు నాటుకున్న రైతులకు ఆశించిన దాని కంటే ఎక్కువ దిగుబడి వచ్చింది. దీంతో సద్గుడి రకమే తమను ముంచిందని ఆవేదన చెందుతున్నారు. నాణ్యతలేని బత్తాయి మొక్కలను నాటడంతోనే కాత రావడం లేదని చెబుతున్నారు. 2014 నుంచి 2024 వరకు పండ్ల మొక్కల పరిశోధన కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన రైతులు నష్టపోయారు.

రైతన్నపై ఆర్థిక పిడుగు

బత్తాయి రైతులపై ఆర్థిక పిడుగు పడింది. ఆరేండ్లుగా కంటికి రెప్పలా తోటలను కాపాడుకుంటున్న రైతుకు సాగు వ్యయం తడిసిమోపెడైంది. ప్రతిఏటా పశు వు ఎరువు, క్రిమి సంహారక మందులు, జింకు, బోరాన్, మెగ్నీషియం, మాంగనీస్, ఫెర్రస్, కాపర్ వంటి సూక్ష్మపోషకాలు ఉపయోగించాల్సి ఉంటుంది. కూలీలు, ట్రాక్టర్ కల్టివేటింగ్ ఖర్చులు రెట్టింపయ్యాయి. ఉదాహరణకు ఒక ఎకరాకు సుమారుగా రూ 70వేలు ఖర్చు పెట్టాల్సి ఉంది. ఐదెకరాల రైతు ఏడాదికి రూ 3.5 లక్షల ఖర్చు అవుతున్నది. ఐదేండ్లలో రూ 17.5 లక్షలు ఖర్చు అవుతున్నది. ఇవే కాకుండా మొక్కలు కొనడం డ్రిప్ పైపులు కొనుగోలు కోసం రూ. 2.5 లక్షలు వ్యయమవుతున్నది. మొత్తంగా నల్లగొండలో 400 ఎకరాల్లో బత్తాయి మొక్కలు నాటిన రైతులు సుమారుగా రూ.2.80 కోట్లు నష్టపోయినట్టు అంచనా వేసింది. ఇలాంటి నాసి రకమైన మొక్కలకు, నాణ్యమైన మొక్కల కంటే అధికంగా పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి రాగా సరైన దిగుబడి రాకపోవడంతో రైతులు ఆర్థిక ఊబిలో కూరుకపోయారు.

కారణమెవరు?

నల్గొండ జిల్లాలో బత్తాయి అధికంగా సాగవుతున్నది. నాణ్యమైన బత్తాయి మొక్కలను అందించడంలో ఉద్యాన వన శాఖ విఫలమైంది. ప్రతి రైతు ప్రయివేటు నర్సరీలను ఆశ్రయించే పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తున్న రీసర్చ్ స్టేషన్లను రైతులు నమ్మలేని దుస్థితి ఉన్నది. ప్రయివేటు నర్సరీల పెంచుతున్న జంబేరి బత్తాయి రకం మొక్కలు అధిక దిగుబడిని ఇస్తున్నాయి. ప్రభుత్వ నర్సరీలు మొక్కలు మాత్రం దిగుబడి తగ్గుతున్నాయి. కాయ సైజు రాకపోవడంతో మార్కెట్లో గిట్టుబాటు ధర రాక వ్యాపారుల వద్ద రైతులు మోసపోతున్నారు. ఈ క్రమంలో నష్టపోయిన బత్తాయి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు. తమకు నష్టపరిహారం అందించి ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలి :
గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు, గ్రామం తిప్పలమ్మ గూడెం



సెంట్రల్ సిట్రస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలి. 2014-2024 వరకు నల్గొండ జిల్లా రైతులకు అందించిన బత్తాయి (రంగపూర్ సద్గుడి) రకం మొక్కలపై తక్షణమే దృష్టి సారించాలి. బాధిత రైతుల తోటలను పరీక్షించి తగు చర్యలు తీసుకోవాలి. మొక్కలకు డీఎన్ఏ, ప్లాంట్, లీఫ్, ఫ్రూట్ అనాలసిస్ పరీక్షలు నిర్వహించాలి. దిగుబడి రానందున పంట నష్టాన్ని కూడా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం (తిరుపతి) పరిధిలోని పండ్ల మొక్కల పరిశోధన కేంద్రాల నుంచి తిరిగి ఇప్పించాలి.

న్యాయం చేయాలి :
సురుగురు శ్రీనివాసరెడ్డి, రైతు, ఎర్రబెల్లి గ్రామం



డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం తిరుపతి పరిధిలోని పండ్ల మొక్కల పరిశోధన కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన బత్తాయి మొక్కలు నాసిరకంగా దిగుబడి ఇవ్వడం లేదు. తెలంగాణ ప్రభుత్వం చొరవ చూపి తక్షణమే విచారణ జరిపించి నష్టపోయిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలి.

సరైన దిగుబడి రావట్లేదు :
రైతు కిరణ్‌కుమార్‌రెడ్డి గ్రామం ఆరెగూడెం



ఉద్యాన విశ్వవిద్యాలయం తిరుపతి పరిధిలోని పండ్ల మొక్కల పరిశోధన కేంద్రాల నుంచి బత్తాయి మొక్కలు రంగాపూర్ రకానికి చెందినవి. నేటికి పదేండ్లు పూర్తయినా కూడా సరైన దిగుబడి రాకపోవడం బాధాకరం. ఇలాంటి మొక్కలు సాగు చేస్తున్న బత్తాయి రైతులందరికీ యూనివర్సిటీ నుంచి తక్షణమే నష్టపరిహారం అందించాలి.



బ్యాటరీ కంపెనీలో దొంగలు హల్‌చల్

- కత్తితో బెదిరింపు
- రూ.50 లక్షలు అపహరణ

నవతెలంగాణ-రాజేంద్రనగర్

పాత బ్యాటరీ కంపెనీలో దొంగలు హల్‌చల్ చేశారు. కత్తితో బెదిరించి రూ.50 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను డీసీపీ శ్రీనివాస్ మీడియాకు ఆదివారం వెల్లడించారు. కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలోని ఒక పాత బ్యాటరీ కంపెనీని రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి నడిపిస్తున్నారు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా ఈ నెల 19 న రూ.21లక్షలు, 20 న రూ.29 లక్షలు వచ్చాయి. ఈ మొత్తం రూ.50లక్షల సొమ్మును కంపెనీలోని బీరువాలో భద్రపరిచి యజమాని ఇంటికి వెళ్లారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో కంపెనీ గేటు దూకి లోపలికి వచ్చిన దొంగలు అందులో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులను కత్తితో బెదిరించి బీరువాలో ఉన్న రూ.50 లక్షలు ఎత్తుకెళ్లారు. వెంటనే కార్మికులు యజమానికి సమాచారం అందించారు. యజమాని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. అయితే తెలిసిన వ్యక్తులే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని..
జన్ ఔషధ్ కేంద్రంలో తనిఖీ

- నిషేధిత డ్రగ్స్ సీజ్



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని జనరిక్ మందుల షాప్‌లో డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మెడికల్ షాప్‌లో నిషేధిత డ్రగ్స్ గుర్తించిన అధికారులు ఆ మందులను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తెలిపిన వివరాలు ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని 10వ నంబర్ ప్లాట్ ఫారం వద్ద జన్ ఔషద్ కేంద్రంలో 2018లో ప్రభుత్వం నిషేధించిన ఆఫ్లాక్సాసిన్, ఆర్నిడజోల్ సస్పెన్షన్ వంటి మందులు ఉన్నట్టు గుర్తించి వాటిని సీజ్ చేశారు. షాపు నిర్వాహకులు రోహన్(25)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వివరాలను కోర్టుకు అందజేసినట్టు వెల్లడించారు. ఈ మందులను మహారాష్ట్రలోని థానేలో లోక్-బేటా ఫార్మాస్యూటికల్స్ కంపెనీ తయారు చేసి సరఫరా చేస్తుందని, ఈ మందులు రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని తెలిపారు. 2018 సెప్టెంబరు 7న ఈ మందులను కేంద్ర ప్రభుత్వం నిషేధించిందని గుర్తు చేశారు. ఈ తనిఖీల్లో మలక్‌పేట్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ముషీరాబాద్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రేణుక, బేగంపేట్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రనాథ్ ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్లా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రామచంద్రాపురంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా మన్నె చంద్రయ్య (హన్మకొండ)ను ఎన్నుకున్నారు. అంతకు ముందు గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేసిన భిక్షంగౌడ్ సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందుకు రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా ఆయన్ను తొలగించారు. కొత్తగా ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. పీఆర్టీయూ గౌరవాధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి పులి దేవందర్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో పదోన్నతులు, బదిలీలు చేపట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలనీ, తదితర తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం. చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోటా రద్దు

- బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు తీర్పు

ఢాకా : ఇటీవల దేశవ్యాప్తంగా భారీ అల్లర్లకు దారి తీసిన ప్రభుత్వ ఉద్యోగాల్లో అనేక కోటాలను బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు ఆదివారం రద్దు చేసింది. ఒక హైకోర్టు కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో 93 శాతం ఉద్యోగాలు మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలని సుప్రీంకోర్టు అప్పీలేట్ డివిజిన్ ఆదేశించింది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ అటార్నీ జనరల్ ఎ.ఎం. అమీన్ ఉద్దీన్ మీడియాకు వెల్లడించారు. ఆదివారం తీర్పుతో దేశంలో సాధారణ పరిస్థితులు మళ్లీ నెలకుంటాయని, దురుద్దేశాలు ఉన్న కొంత మంది వ్యక్తులు అమాయక ప్రజల్ని ప్రేరేపించడం మానేస్తారని ఆశిస్తున్నట్లు అమీన్ ఉద్దీన్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న హింసాకాండలో తాము భాగం కాదని విద్యార్థులు స్పష్టం చేసినట్లు ఆయన వెల్లడించారు. హింసాకాండ వెనుక ఉన్న నిందితులను కనుగొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు. పాకిస్తాన్ నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాల ఉద్యోగ కోటాను 5 శాతానికి తగ్గించాలని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశించినట్లు అటార్నీ జనరల్ తెలిపారు. మిగిలిన రెండు శాతం కోటాలు ఇప్పటికీ వెనుకబడిన తరగతులు, వికలాంగులకు ఉన్నాయని చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో 93 శాతం రిక్రూట్‌మెంట్‌లు మెరిట్ ఆధారంగానే జరగాలని ఆదేశించిన సుప్రీంకోర్టు. మిగిలిన ఏడు శాతం కోటాలో రిజర్వేషన్లకు అనుమతించింది. దీనికి సంబంధించి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కూడా సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ సమయంలో విద్యార్థుల తరపున మాట్లాడేందుకు ఐదుగురు న్యాయవాదులకు కోర్టు అనుమతించింది. సుప్రీంకోర్టు విచారణలో పాల్గొన్న తొమ్మిది మంది న్యాయవాదులలో ఎనిమిది మంది దిగువ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయడాన్ని సమర్థించారు. ఆదివారం ఉదయం 10:30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి ఒబైదుల్ హసన్ నేతృత్వంలోని బెంచ్ విచారణ ప్రారంభించింది. హైకోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ అటార్నీ జనరల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో అమలవుతున్న కోటాలను ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వం 2018లో రద్దు చేసింది. అయితే ఒక హైకోర్టు వీటిని గత నెలలో పునరుద్ధరించింది. మొత్తం కోటాలను 56 శాతంగా నిర్ణయించింది. ఈ తీర్పు దేశంలో అల్లర్లకు దారితీసింది. ఈ అల్లర్లలో 114 మంది మృతి చెందారు.

బోనమెత్తిన లష్కర్

నవతెలంగాణ-సిటీబ్యూరో, బేగంపేట

మహిళల బోనాలు, కోలాటలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీ యువకుల నృత్యాల కోలాహలాలు, ఆనందోత్సవాల నడుమ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం కన్నుల పండువగా సాగింది. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి దర్శనం కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లష్కర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేశారు. దాంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. ఉదయం నుంచే వేలాది మంది మహిళలు, భక్తులు, సందర్శకులు అమ్మవారికి బోనాలు సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అర్చకులు సీఎంకు స్వాగతం పలికారు. అనంతరం మహంకాళి అమ్మవారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆయన వెంట మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, నగర సీపీ కె.శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు. అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో దేవాలయానికి రాగా ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన సతీమణి బోనంతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం 3.30 గంటలకు పొన్నం కుటుంబ సభ్యులు మొదటి పూజ నిర్వహించిన అనంతరం సాధారణ భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం కల్పించారు. ఆషాఢమాస ప్రతిష్టాత్మకమైన బోనాల్లో భాగంగా శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని, అందరికీ అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు. సకాలంలో మంచి వర్షాలు, పడి పంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నానని మంత్రి తెలిపారు.

మహంకాళీ అమ్మవారి దర్శనానికి ప్రముఖులు

శ్రీఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని బోనం సమర్పించారు. మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, సీహెచ్ మల్లారెడ్డి, శ్రీగణేష్, ముఠాగోపాల్, మాగంటి గోపినాథ్ దర్శించుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురి శెట్టి, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి దంపతులు, మహిళ కమిషన్ చైర్మెన్ నేరళ్ల శారద, మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు దర్శించుకున్న వారిలో ఉన్నారు. బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల నుంచి ఇతర మార్గాల వైపు ట్రాఫిక్‌ను మళ్లించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న రంగం కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

- చట్టం ఒకటే అయినా అందరికీ సమానంగా లేదు : రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్
- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఓయూలో సెమినార్



నవతెలంగాణ-ఓయూ

విద్యా, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, విద్యతోనే సమాజ మార్పు సాధ్యమని, చట్టాలు అందరికీ సమానమేనని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ, ఆంధ్ర మహిళా సభ డిగ్రీ ఉమెన్స్ కళాశాల ఆధ్వర్యంలో 'విద్యా, వైద్య రంగాలు - సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. దేశంలో ప్రైమరీ స్కూల్స్‌పై ఇప్పటికీ ప్రభుత్వాలకు, ప్రజలకు స్పష్టత లేదన్నారు. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచి శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా పాఠ్యాంశాలు ఉండాలని, అందుకనుగుణంగా పాఠ్యపుస్తకాలను రూపొందించేలా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. యూనివర్సిటీ స్థాయిలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు అశాస్త్రీయ పద్ధతులను పాటించడం ఎంటని ప్రశ్నించారు. యువత ఎక్కువగా సాంకేతిక విద్య పట్ల ఆసక్తి చూపుతోందని, ఇది ఏ మాత్రం మంచిది కాదన్నారు. సామాజిక అంశాలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఆర్ట్స్, సైన్స్ సమాజ అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు

జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. చట్టం ఒక్కటే అయినా అది అందరికీ సమానంగా అందడం లేదని, సమాజంలో పేదలకు సరైన న్యాయం అందడం లేదని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. పేదలకు ఒకలా, ధనవంతులకు మరోలా న్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ విరించి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతని చెప్పారు. కానీ ప్రభుత్వాలు ఈ బాధ్యత నుంచి క్రమంగా తప్పుకుంటున్నాయని అన్నారు. చిన్న చిన్న రోగాలకు సైతం పేదలు కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సర్కార్ ఆస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వర రావు, టి. శ్రీనాథ్, రాష్ట్ర నాయకులు వెంకటరమణారెడ్డి, జితేందర్, చెలిమెల రాజేశ్వరరావు, ప్రొఫెసర్ బి.యస్.రెడ్డి, డాక్టర్ రమాదేవి, ఎస్పీ లింగస్వామి, రవీంద్రబాబు, భీమేశ్వర్, ఆంధ్ర మహిళా సభ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి. రజిని, ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సీ రాణి, అధ్యాపకులు కరుణ, వసుంధర, సంధ్యారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి బీజేపీ ప్రమాదకారి

- ఐక్యపోరాటాలు చేయాలి :ఆప్ ఎమ్మెల్యే దిలీప్ పాండే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశానికి బీజేపీ ప్రమాదకరమని, ఆ పార్టీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఐక్యంగా పోరాడాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ ప్రభుత్వ విప్, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దిలీప్ పాండే పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని తిరస్కరించి ఇతర పార్టీల ప్రభుత్వాలను ప్రజలు ఎన్నుకుంటే వాటిని సజావుగా పాలించకుండా బీజేపీ అడ్డంకులు సృష్టిస్తున్నదని తెలిపారు. ఢిల్లీకి హర్యానా నుంచి తాగునీరు రాకుండా ఇబ్బందులు పెడుతున్నదన్నారు. స్కాం ఆరోపణలు వచ్చినా ఈడీ, సీబీఐ బీజేపీపై విచారణ జరపడం లేదని విమర్శించారు. కేజ్రీవాల్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక జైల్లో బంధించారని దుయ్యబట్టారు. ఆయనను బంధించారు కానీ ఆయన ఆలోచనలను బంధించలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పార్టీని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయనున్నట్టు వెల్లడించారు.

కేజ్రీవాల్‌ను చంపేందుకు కుట్ర

కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ జైల్లోనే ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను చంపేందుకు ప్రయత్నిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఫెడరల్ కాస్ట్రోను శత్రువులు చంపేందుకు ఏ విధంగా ప్రయత్నించారో అలాంటి ప్రయత్నాలు బీజేపీ సర్కార్ చేస్తున్నదని విమర్శించారు. ఆరోగ్యం క్షీణిస్తున్నా వేధింపులు ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు అడ్వకేట్ డాక్టర్ సొలొమోన్ రాజ్, అన్సారీ, మాజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ, ప్రధాన కార్యదర్శి యమున తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో విద్యా రంగానికి నిధులు పెంచాలి : పీడీఎస్‌ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యను ప్రజలకు ఉచితంగా అందించాల్సిన ప్రభుత్వాలు బాధ్యత నుంచి తప్పుకొని వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యకు11 శాతం ఉన్న కేటాయింపులను తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 8 శాతానికి తగ్గించారని విమర్శించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8214.57 కోట్ల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మార్చి నాటికి బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పూర్తి

- ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పూర్తికి రూ.2,200 కోట్లు మంజూరు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

వచ్చే మార్చి నాటికి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును పూర్తి చేస్తామనిరోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పూర్తికి ముఖ్యమంత్రితో మాట్లాడి రూ.2,200 కోట్లు మంజూరు చేయించడమే కాకుండా, నిదుల విడుదలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్రీన్‌ఛానల్‌లో నిధులు ఏర్పాటు చేశామని చెప్పారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపాలాయపల్లి శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో ఆలయ చైర్మెన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీ సుదర్శన యాగ సహిత రుద్రయాగంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారిజాల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో రూ.2 కోట్లతో భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు సీఎంతో మాట్లాడి త్వరలోనే వాటిని మంజూరు చేస్తామని వెల్లడించారు. చెర్వుగట్టులో కాటేజీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా శ్రీ వారిజాల శ్రీ వేణుగోపాలస్వామి గుడిపైకి వచ్చే రహదారిని ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రెన్యువల్ చేయిస్తానని తెలిపారు. 32 వేల కోట్ల రూపాయలు రైతులకు రుణ మాఫీ చేస్తున్నామన్నారు. హైదరాబాద్-విజయవాడ ఆరు లైన్ల జాతీయ రహదారికి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ అంగీకరించారని, వచ్చే నెలలో ఈ రహదారి పనులకు టెండర్లు పిలువనున్నట్టు తెలిపారు. జీఎంఆర్ సంస్థ టెండర్లు రద్దు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి టెంపుల్ చైర్మెన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ శివరాంరెడ్డి, మాజీ స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్లో పప్పు భోజనమే..

- మెస్ చార్జీలు పెంచాలి : కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు
- సంఘం ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల అధ్యయన యాత్ర
- ఇబ్రహీంపట్నం ఎస్ఎంహెచ్ హాస్టల్ సందర్శించిన బృందం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు పప్పు భోజనమే పెడుతున్నారని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.1500 నుంచి రూ.2500 పెంచాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నుంచి 30 వరకు చేపట్టిన హాస్టల్స్ అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని సంక్షేమ హాస్టల్‌ను అధ్యయన బృందంతో పాటు ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారికి అందుతున్న ప్రభుత్వ ఫలాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనేక విషయాలు వెలుగు చూశాయి. ఈ హాస్టల్‌లో కేవలం 80 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్ పొందాల్సి ఉండగా.. 160 మందికి అడ్మిషన్ ఇచ్చారని, దాంతో ఉన్న 24 గదుల్లో ఒక్కో గదిలో 6 నుంచి 8మందిని ఉంచుతున్నారని విద్యార్థులు బృంద సభ్యులకు తెలిపారు. ఇలా అనేక సమస్యలను విద్యార్థులు కేవీపీఎస్ బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం స్కైలాబ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల దుస్థితికి ఇబ్రహీంపట్నం హాస్టల్ నిదర్శనమన్నారు. కనీస వసతుల లేమితో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారని చెప్పారు. 160 మంది విద్యార్థులు ఉంటున్న హాస్టల్లో కేవలం 24 గదులు మాత్రమే ఉన్నాయని తెలిపారు. స్నానాలకు, బట్టలు ఉతుకోవడానికి నీళ్లు సరిపోవటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 15 నెలలుగా భవనం అద్దె చెల్లించడం లేదని తెలిపారు. ఐదు నెలలుగా కరెంటు బిల్లు బకాయి ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా అదనపు హాస్టల్ భవనాన్ని నిర్మించాలని కోరారు. విద్యార్థుల పోటీ పరీక్షల మెటీరియల్ ప్రభుత్వం అందించాలన్నారు. హాస్టల్లో ఉదయం పూట పెట్టాల్సిన టిఫిన్ ప్రతిరోజూ పప్పుతో కూడిన రైస్ పెడుతున్నారని, కనీసం ఇడ్లీ, వడ పూరి, దోశ వంటివి విద్యార్థులు నోచుకోవట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌరసరపరాల నుంచి సన్నబియ్యం ఇస్తున్నామని పదేపదే పాలకులు చెబుతున్నారని, కానీ అవి సన్నబియ్యం కాదని అన్నారు. 2016 సంవత్సరం నుంచి మెస్ చార్జీల కోసం కేవలం రూ.1500 మాత్రమే అందిస్తున్నారని, వాటి పెంపుదలకు తక్షణమే బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు హాస్టల్స్‌ను నెలకోసారి సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల్ని తెలుసుకోవాలని జీవో ఉన్నప్పటికీ అది అమలు కావడం లేదని అన్నారు. డీఏహెచ్ హాస్టల్లో వాటర్ సమస్య తీవ్రంగా ఉందని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని సంక్షేమ హాస్టళ్లలో గీజర్ సౌకర్యం కల్పించాలని, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించాలని కోరారు. ఈనెల 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించి సమస్యలపై సంక్షేమ శాఖ అధికారుల ను కలిసి వినతి పత్రం అందజేస్తామ న్నారు ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థుల సమస్యలు పరిష్క రించకపోతే కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పర్యటించిన వారిలో.. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోడ సామేల్, ఎం.ప్రకాష్ కరత్, మండల కార్యదర్శి ఎం. ఆనంద్ తదితరులు ఉన్నారు.

తన 70వ దశకంలో మలయాళ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టారు. శక్తివంతమైన పాత్రతో ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. ఇది ఆమె జీవితంలో ఓ చిన్న భాగం మాత్రమే. ఆమె గురించి చెప్పుకునేందుకు ఇంకా ఎంతో ఉంది. అదే ది మ్యాక్స్ ఫౌండేషన్. దీని ఆధ్వర్యంలో గత 30 ఏండ్ల నుండి క్యాన్సర్ రోగులకు అవసరమైన సహాయసహకారాలను అందిస్తున్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆమే విజి వెంకటేష్. జీవితం చివరి దశలోనూ సమాజానికి అంకితమై పని చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

'ఉమ్మచి'కి ముందు



71 ఏండ్ల వయసులో విజి వెంకటేష్ మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. భారతదేశంలోని క్యాన్సర్ కేర్ కమ్యూనిటీకి మూలస్తంభంగా ఉన్నారు. ఉమ్మచి అని అందరూ ముద్దుగా పిలుచుకునే ఆమె ఇటీవలే అఖిల్ సత్యన్ దర్శకత్వంలో ప్రముఖ నటుడు ఫహద్ ఫాసిల్‌తో కలిసి 'పచ్చుం అల్భుతావిలక్కుమ్'తో సినీ రంగ ప్రవేశం చేశారు. కానీ ఆమె జీవితంలో దీనికంటే ఇంకా ఎంతో ఉంది. ది మ్యాక్స్ ఫౌండేషన్ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారతదేశంతో పాటు దక్షిణాసియాకు ఆ సంస్థ రీజియన్ హెడ్‌గా పనిచేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ రోగులకు నాణ్యమైన మందులు అందించే లక్ష్యంతో ఆమె నిరంతరం కృషి చేస్తున్నారు.



క్యాన్సర్ సంరక్షణ వైపు

2002 నుండి ఆమె ది మాక్స్ ఫౌండేషన్‌లో పని చేస్తున్నారు. గ్లివెక్ ఇంటర్నేషనల్ పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రాం (GIPAP) నిర్వహణకు నాయకత్వం వహిస్తున్నారు. స్థానిక నోవార్టిస్ ఆంకాలజీ యాక్సెస్ (ఎన్‌ఓఏ) ప్రోగ్రామ్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడటానికి ఆ రోగాన్ని అనుభవించాల్సిన అవసరం లేదంటున్నారు ఆమె. 'అలా చేయడానికి నన్ను ప్రేరేపించిందేమిటి అని చాలా మంది అడుగుతుంటారు. నాకు క్యాన్సర్ లేదు. క్యాన్సర్ రోగుల కోసం నిధుల సేకరణకు అంకితమైన సంస్థకు సహకరించాలని అనుకున్నాను. ముంబైలోని వ్యాపారులు, సంస్థల నుండి మద్దతు పొందడం ద్వారా నిధులను సేకరించడం ప్రారంభించాను' అని వివరించారు.

కార్మికుల్లో అవగాహన

ముంబైలో ఎక్కువ మంది ఫ్యాక్టరీకార్మికులు క్యాన్సర్‌కు కారణమైన పొగాకుకు అలవాటు పడ్డారని విజి గుర్తించారు. 'నా పని ప్రారంభ రోజుల్లో నేను సమీపంలోని బ్రిటిష్ కౌన్సిల్ లైబ్రరీకి వెళ్లి క్యాన్సర్‌పై దొరికిన అన్ని పుస్తకాలను తీసుకున్నాను. వాటిని అధ్యయనం చేసాను. యూనియన్ నాయకులతో మాట్లాడటానికి కర్మాగారంలోని సంక్షేమ అధికారిని ఒప్పించే ప్రయత్నం చేసాను. అలా వారితో మాట్లాడి పొగాకు వల్ల కలిగే హానికరమైన ప్రభావాల గురించి అవగాహన కల్పించగలిగాను. భారతదేశంలో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అత్యంత సాధారణం. ఈ మూడింటిని చాలా త్వరగా గుర్తించవచ్చు' అని ఆమె వివరించారు. ఆమె బృందం బ్యాంకులు, కార్పొరేట్ కార్యాలయాలను సందర్శించారు. వైద్యులు తమ ఖాళీ సమయాన్ని క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించే శిబిరాలను నిర్వహించడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు.

లుకేమియా బాధితుల కోసం

'టాటా మెమోరియల్ హాస్పిటల్‌లో ప్రివెంటివ్ ఆంకాలజీ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయడానికి నన్ను నియమించారు. మూడేండ్లలో క్యాన్సర్ గురించి ప్రతిదీ నేర్చుకున్నాను. ఆ డాక్టర్లలో కొందరు ఇప్పుడు ఆసుపత్రుల డైరెక్టర్లుగా ఉన్నారు' అని చెప్పారు. సీటెల్‌లో ప్రధాన కార్యాలయంగా ఉన్న ది మాక్స్ ఫౌండేషన్ 1997లో లుకేమియాతో బాధపడుతున్న పిల్లల కుటుంబాలకు విద్య, మద్దతు అందించేందుకు స్థాపించబడింది. 2001లో సంస్థ వెనుక బడిన 70 దేశాలలోని క్యాన్సర్ రోగులకుచికిత్సను అందించేందుకు, గ్లివెక్ ఇంటర్నేషనల్ పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేయడానికి ఫార్మా దిగ్గజం నోవార్టిస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది.

మలుపుతిప్పింది

విజి ఢిల్లీలోని ఓ సాధారణ కుటుంబంలో పెరిగారు. ఆంగ్లంలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు పూర్తి చేసి 1974లో వివాహం చేసుకున్నారు. తర్వాత ముంబైకి వెళ్లారు. అక్కడి వాతా వరణం ఢిల్లీకి పూర్తి భిన్నంగా ఉంది. 'ముంబై నగరం నా ఆసక్తులను కొనసాగించడంతో పాటు కొంత స్వేచ్ఛను కూడా పొందాను. ఈ ప్రయాణంలో నా భర్త కూడా నాకు సహకరించారు. 80ల చివరలో ఆంగ్ల డిగ్రీతో ఉద్యోగం సంపాదించడం ఎంత కష్టమో అందరికీ తెలిసిన విషయమే. అయితే క్యాన్సర్ రోగుల కోసం పనిచేయాలనే నా కోరిక నా మార్గాన్ని వేరే మలుపు తిప్పింది' ఆమె చెప్పింది.

ఉమ్మచిగా జీవితం

మేకప్, లిప్‌స్టిక్, కాజల్, ముక్కు పుడుక, వెండి గాజులు... తన మొదటి సినిమా సెట్స్‌లో ఆమె సిగ్నేచర్ స్టైల్‌కి వీడ్కోలు చెప్పవలసి వచ్చింది. తన సహజమైన రూపాన్ని చిత్రంలో చూపించారు. ఇందులో ఆమె పాత్ర ఓ స్వతంత్ర వృద్ధ మహిళ. సామాజిక నిబంధనలను ధిక్కరించే మాతృమూర్తి. సాధారణ చిత్రణలకు, సవాలు చేసే మూస పద్ధతులకు మించి ఉంటుంది. ఇదంతా ఒకరోజు అఖిల్ టీమ్ నుండి ఒక ఫీచర్ ఫిల్మ్ కోసం కాస్టింగ్ డైరెక్టర్ ద్వారా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకి మెసేజ్ రావడంతో మొదలైంది. 'నేను సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తాను. అఖిల్, అతని బృందం ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫొటోను చూశారు. ఓ ఫొటో 'ఉమ్మచి' పాత్ర సరిపోతుందని వారు భావించారు. నాకు కాల్ చేసి అడిగారు. నాకంత ఆసక్తి లేదు, పైగా మలయాళం కూడా పెద్దగా రాదు. ఈ వయసులో నటించడం ఏంటి అనుకున్నాను' అంటూ ఆమె చెప్పారు.

టీమ్ సపోర్ట్‌తో...

తర్వాత విజి అఖిల్‌ని ముంబైలోని ఓ కేఫ్‌లో కలిశాడు. 'అతను చాలా ఉద్వేగభరితమైన, శక్తివంతమైన యువకుడు. కథ, పాత్ర విన్నాక ఓకే చెప్పారు' అని ఆమె వివరించారు. వెంటనే సినిమా బృందం ఆమెకు మలయాళం నేర్చుకునేందుకు సహాయం చేసింది. ఎలాంటి అనుభవం లేకపోయినా అదే నటించడం ఆమెకు సులభతరం చేసింది. 'ఫహద్ ఫాసిల్‌తో సినిమా కోసం నా మొదటి సన్నివేశం చిత్రీకరిస్తున్నప్పుడు డైలాగులు చెప్పలేక పోయాను. షూటింగ్ పూర్తయిన తర్వాత ఫహద్ నా దగ్గరకు వచ్చి 'హాయ్, నేను ఫహద్..' అన్నారు. దానికి నేను 'నువ్వు ఫహద్ అని నాకు తెలుసు!' అని చెప్పాను. ఇన్ని తప్పులు చేసినా చిత్రీకరణ టీమ్ అంతా తనకు సపోర్ట్‌గా ఉందని విజి పంచుకున్నారు. ఈ చిత్రం తర్వాత ఆమె రెండు సినిమాల్లో అవకాశం వచ్చింది. ఇటీవలే ప్రముఖ దర్శకుడు జయరాజ్‌తో ఓ చిత్రానికి సైన్ చేశారు.

క్యాన్సర్ అవగాహన కోసం చాయ్

భారతదేశంలోని క్యాన్సర్ రోగులకు మద్దతు ఇచ్చే చాయ్ ఫర్ క్యాన్సర్ అనే అవగాహన, నిధుల సేకరణ ప్రచారానికి కూడా విజి నాయకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రచారంలో భాగంగా చాయ్ అడ్డాల వద్దకు వెళుతున్నారు. దీని ద్వారా దాతలు, మద్దతుదారులను ఒకచోట చేర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఓ భయంకరమైన పరిస్థితి చుట్టూ సాధారణ స్థితిని సృష్టించడానికి ఒక కప్పు చాయ్‌ని ఉపయోగించు కుంటున్నారు. ఈ ప్రచారం 'డ్రింక్ టు ఎ కాజ్' అనే నినాదంతో ముందుకు వచ్చింది. 'నేడు కొత్త పురోగతులు, చికిత్సలు చాలా ఉన్నాయి. అన్నీ అందుబాటులో ఉన్నాయి కానీ రోగులకు అందుబాటులో లేవు. చాలా దేశాల్లో రోగులకు ప్రభుత్వం నుండి పెద్దగా మద్దతు లభించదు. అలాంటి వారికి నిధులు అందించాలి' అంటూ ఆమె పంచుకున్నారు.



అన్నీ ఉన్నప్పటికీ...

'క్యాన్సర్‌ని నయం చేయవచ్చు. అయితే దాని కోసం డబ్బు కావాలి. మన దగ్గర సాంకేతికత బాగానే ఉంది. కానీ క్యాన్సర్‌ను చాలా ఆలస్యంగా గుర్తించడం, దానికి సంబంధించిన అపోహలు, వివక్ష వంటి సమస్యలున్నాయి' ఆమె జోడించారు. ఎవరైనా క్యాన్సర్‌తో మరణిస్తే 'క్యాన్సర్‌తో పోరాడి ఓడిపోయారు' అని చెబుతారని ఆమె నొక్కి చెబుతున్నారు. ఇది కరెక్టు కాదని ఆమె నమ్ముతున్నారు. ఆరు నెలల కిందట విజి క్యాన్సర్‌తో పోరాడిన భర్తను కోల్పోయారు. 'అతను రోగ నిర్ధారణ తర్వాత ఐదు వారాల పాటు జీవించాడు. నాకు మంచి పలుకుబడి వుంది. అత్యుత్తమ వైద్యులు అందుబాటులోకి వచ్చారు. ఆ సమయంలో నా భర్తకు కావలసినవన్నీ నేను చేయగలిగాను. కానీ అది సరిపోలేదు' ఆమె చెప్పారు. ఏది ఏమైనప్పటికీ విజి వ్యాధికి వ్యతిరేకంగా పోరాడేందుకు అంకితమై ఉన్నారు. యువత గురించి ఆమె మాట్లాడుతూ 'మీ మనసు చెప్పింది వినండి. మీరు ఏం చేయగలరో అది చేయండి. నిర్భయంగా ఉండండి. ప్రజలు మిమ్మల్ని మీరు చూసే విధంగానే చూస్తారు. మిమ్మల్ని సంతోషపెట్టే శక్తి మీవద్దనే ఉంచుకోండి. అవకాశాలు వచ్చినప్పుడు బెదిరిపోకూడదు. వాటిని ఉపయోగించుకోండి' అంటూ ముగించారు. ■

డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకే ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు మౌనం వహించిందని ప్రశ్నించారు. ఎన్నికల అనంతరం ఏపీలో చెలరేగుతున్న హింస, ప్రతిపక్షంపై దాడులను వైసీపీ ప్రస్తావించింది.

ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజిజు హాజరు కాగా, కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, గౌరవ్ గొగోయ్, కె సురేష్ హాజరయ్యారు. టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, గంటి హరీష్, జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి, వైసీపీ ఎంపీలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్ సురేష్ రెడ్డి, డీఎంకే ఎంపీలు టి.ఆర్. బాలు, తిరుచ్చి శివ, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్, ఎల్‌జేపీ నేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, అనుప్రియ పటేల్, ఎస్పీ ఎంపీ రాం గోపాల్ యాదవ్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసి, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, ఆర్‌జేడీ ఎంపీ అభయ్ కుష్వాహ, జేడీయూ ఎంపీ సంజయ్ ఝా సహా పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

నేటి నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ఆర్థిక సర్వేను, మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. కాగా నీట్ పేపర్ లీక్ కేసు నుంచి రైల్వే భద్రత వరకు సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఐక్య ప్రతిపక్షం సిద్ధమైంది. ఆగస్టు 12 వరకు 19 రోజులు ఈ సమావేశాలు జరుగనున్నాయి.

సజావుగా నడపడం సమిష్టి బాధ్యత : కిరణ్ రిజిజు

సమావేశం అనంతరం పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 44 పార్టీల నుంచి 55 మంది నేతలు సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. పార్లమెంటును సజావుగా నడపడం ప్రభుత్వం, ప్రతిపక్షాల సమిష్టి బాధ్యతని ఆయన అన్నారు. పార్లమెంట్ నిబంధనలకు లోబడి ఎలాంటి చర్చకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కీలకమైన 24 శాఖలకు సంబంధించి స్టాండింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని, వాటికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అంతే కాకుండా వివిధ శాఖల మంత్రులతో ఎంపీలు నేరుగా సంప్రదింపులు జరిపేందుకు వీలుగా సంప్రదింపుల కమిటీలను పునరుద్ధరించాలని అఖిలపక్ష భేటీలో కోరినట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలపై చర్చించాలి

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని సీపీఐ(ఎం) రాజ్యసభ డిప్యూటీ లీడర్ జాన్ బ్రిట్టాస్ డిమాండ్ చేశారు. పార్లమెంటరీ సమావేశానికి ముందు ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్చలకు పార్లమెంటు వేదిక అనే సందేశాన్ని కూడా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తెలియజేస్తున్నాయన్నారు. దానిని అర్థం చేసుకుని ముందుకు సాగేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రతిపక్షం ఏదైనా సమస్యను లేవనెత్తితే, మంత్రిని సంప్రదించి దానికి సమాధానం ఇచ్చేవారని, లేకుంటే విడిగా చర్చ జరిగేదని గుర్తుచేశారు. పదేండ్లుగా వీటి ప్రస్తావన లేదని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సెషన్‌లోనే మణిపూర్, నీట్ అంశాలపై చర్చ చేయాలని డిమాండ్ చేశారని, కానీ అనుమతించలేదని గుర్తు చేశారు. ఈ పద్ధతి మారాలని, చర్చలకు అనుమతించాలని కోరారు. సమాఖ్య సూత్రాలను గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్రాల అధికారాలను హరించటం, రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోయడానికి గవర్నర్లు పోటీ పడటం దారుణమన్నారు. నిరుద్యోగం, పేదరికం వంటి అనేక సమస్యలపై ప్రభుత్వ లెక్కల్లో అసమానతలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం జనాభా లెక్కలు కూడా నిర్వహించలేక పోతోందని, నీట్, మణిపూర్, కాశ్మీర్, నిరుద్యోగం, ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, అగ్నిపథ్ వంటి అన్ని ముఖ్యమైన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉండాలని బ్రిట్టాస్ కోరారు. కావడి యాత్ర ఉత్తర్వులు మతతత్వానికి గురిచేసే ప్రమాదాన్ని గుర్తించి యూపీ ప్రభుత్వం వెనక్కి తీసుకునేలా ఒప్పించేందుకు కేంద్రం సిద్ధంగా ఉండాలని కోరారు. దీనికి సభకు అధ్యక్షత వహిస్తున్న రాజ్‌నాథ్ సింగ్ చొరవ తీసుకోవాలని కోరారు.

తుమ్మితే ఊడే ఉద్యోగం

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. 2003-04లో అంతకుముందు ఏడాదితో పోలిస్తే కార్మికుల సంఖ్య ఆరుశాతానికి పైగా తగ్గింది. ఆ తర్వాతి సంవత్సరాల్లో పెరుగుదల కన్పించింది. కానీ 2012-13లో అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే కార్మికుల సంఖ్య నాలుగు శాతానికి తగ్గిపోయింది. 2020-21లో అంటే కోవిడ్ తొలి దశలో ఉత్పత్తి రంగంలో కార్మికుల సంఖ్య 3.6 శాతం పడిపోయింది. ఆ తర్వాతి సంవత్సరం 8.1 శాతం మేర పెరిగి 1.36 కోట్లకు చేరిందని ఏఎస్ఐ సమాచారం తెలిపింది.

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలే కాంట్రాక్ట్ కార్మికులను అధిక సంఖ్యలో తీసుకుంటాయి. 2002-03లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య ఒకేలా ఉంది. కానీ ఆ తర్వాత ఈ రెండు ప్రాంతాల మధ్య అంతరం బాగా పెరిగిపోయింది. 2021-22లో గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికుల్లో 43.5 శాతం మంది కాంట్రాక్ట్ కార్మికులే. 2002-03లో ఈ సంఖ్య కేవలం 23.2 శాతం మాత్రమే. అదే పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 23.1 శాతం నుంచి 37.5 శాతానికి పెరిగింది.

పరిశ్రమల వారీగా...

కాంట్రాక్ట్ కార్మికుల వాటా అన్ని రకాల కర్మాగారాల్లో ఒకేలా లేదు. కోక్, రిఫైన్డ్ పెట్రోలియం, అణు ఇంధన పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య అధికంగా ఉంది. 2021-22లో ఈ పరిశ్రమలో పనిచేసిన ప్రతి నలుగురు కార్మికుల్లో ముగ్గురు (74.6 శాతం) కాంట్రాక్ట్ కార్మికులే. నాన్-మెటాలిక్ ఖనిజ పరిశ్రమ, రవాణా పరికరాల పరిశ్రమ, ఎలక్ట్రికల్-ఆప్టికల్ పరికరాల పరిశ్రమలో కూడా కాంట్రాక్ట్ కార్మికులు ఎక్కువగానే ఉన్నారు. దీనికి భిన్నంగా వస్త్రాలు, జౌళి ఉత్పత్తులు, తోలు-పాదరక్షల పరిశ్రమలో నేరుగా నియమితులైన శాశ్వత ఉద్యోగుల సంఖ్యే అధికంగా ఉంది. ఇందులో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య కేవలం 16.8 శాతం మాత్రమే. కలప-కార్క్ పరిశ్రమ, కాగితం-గుజ్జు పరిశ్రమ, తయారీ-రీసైక్లింగ్ పరిశ్రమలో కూడా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య తక్కువగానే ఉంటోంది.

2002-03తో పోలిస్తే కాగితం-గుజ్జు పరిశ్రమ, వస్త్ర పరిశ్రమ మినహా అనేక పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. కోక్, రిఫైన్డ్ పెట్రోలియం, అణు ఇంధన పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల వాటా అత్యధికంగా 58.1 పర్సంటేజ్ పాయింట్లు పెరిగింది. ఇతర మెటాలిక్ ఖనిజ పరిశ్రమలు, ప్రాథమిక లోహాలు, ఇతర కల్పిత లోహ ఉత్పత్తుల పరిశ్రమల్లో కూడా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య బాగానే పెరిగింది. మూలధన ప్రోత్సాహక పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఓ కార్యాచరణ పత్రం తెలిపింది. నిపుణుల అవసరం ఎక్కువగా ఉన్న కర్మాగారాల్లో కూడా ఇదే ధోరణి కన్పించడం గమనార్హం.

రాష్ట్రాల వారీగా...

వివిధ రాష్ట్రాల్లో పారిశ్రామిక శ్రామికశక్తి కూర్పులో వైవిధ్యం కన్పిస్తోంది. 2021-22లో కాంట్రాక్ట్ కార్మికుల వాటా త్రిపురలో అత్యధికంగా 85.8 శాతంగా ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లో వీరి వాటా కేవలం 9.7 శాతం మాత్రమే. బీహార్ (68.6 శాతం), తెలంగాణ (64.9 శాతం), మేఘాలయ (62 శాతం), గోవా (61.7 శాతం), ఒడిశా (58.4 శాతం) రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పనిచేస్తుండగా మణిపూర్ (11.5 శాతం), కేరళ (21.4 శాతం), తమిళనాడు (23.1 శాతం), పంజాబ్ (30.6 శాతం) వంటి రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. గత 20 సంవత్సరాల కాలంలో పలు రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే ఆ పెరుగుదల రాష్ట్రాల మధ్య ఒకేలా లేదు. జార్ఖండ్‌లో అత్యధికంగా 40 పర్సంటేజ్ పాయింట్లు (22 శాతం నుంచి 53 శాతానికి) పెరిగింది. ఉత్తరాఖండ్‌లో వారు 24 శాతం నుంచి 54 శాతానికి పెరిగారు.

పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోని సంస్థలు తమ కర్మాగారాలను నడపడానికి కాంట్రాక్ట్ కార్మికుల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. వీరిని ఆయా సంస్థలు నేరుగా నియమించుకోవు. థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిపై తీసుకుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. శాశ్వత ఉద్యోగులకు లభించే పలు ప్రయోజనాలు...అంటే ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, వేతనంతో కూడిన సెలవులు వంటివి కాంట్రాక్ట్ కార్మికులకు వర్తించవు. ఒక్క మాటలో చెప్పాలంటే వారిది తుమ్మితే ఊడిపోయే ఉద్యోగం.

పండుటాకులు

(మొదటిపేజీ తరువాయి)

యాభై శాతం పట్టణ ప్రాంతంగానే ఉంటుందని అంటూ మురికివాడలను అభివృద్ధి చేయడానికి, వాయు కాలుష్యాన్ని అడ్డుకోవడానికి, పర్యావరణ సంబంధమైన సమస్యలను పరిష్కరించడానికి స్మార్ట్ సిటీలు నిర్మించాలని, పటిష్టమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. మహిళలు సురక్షితంగా, భద్రంగా ఉండేలా చూసేందుకు పట్టణ ప్రణాళికలు రూపొందించుకోవాలని, వారికి ఆరోగ్య రక్షణ కల్పించాలని, విద్య, ఉద్యోగ అవకాశాలు అందించాలని ఓజ్‌సర్ కోరారు. లింగ సమానత్వాన్ని సాధించాలని, మహిళలు నాణ్యమైన జీవితాన్ని పొందేలా చూడాలని చెప్పారు. వలసవాదులు, ఒంటరి మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అంటూ వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆంద్రూ ఓజ్‌సర్ సూచించారు.

గోదావరి ఉధృతి పై నిఘా పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టవలసిన రక్షణ సంబంధిత చర్యల గురించి ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లు ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా సంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలసి ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాల్లో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తెలియచేశారు. ఏ విధమైన సహాయం కావాలన్నా రాష్ట్ర రాజధానికి ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చునని మంత్రి సూచించారు.

స్వేచ్ఛకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతోందని అందులో తెలియజేసింది. మీడియా స్వేచ్ఛకు సంబంధించి అమలులో ఉన్న నాలుగు చట్టాలు, వాటి పరిమితులను ఆ లేఖలో వివరించింది.

'గత సంవత్సరం ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులోని అనేక నిబంధనలు పాత్రికేయులు తమ విధులు నిర్వర్తించేందుకు అవరోధం కలిగిస్తాయి. గత సంవత్సరమే తీసుకొచ్చిన బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ బిల్లు కూడా పత్రికా స్వేచ్ఛకు సవాళ్లు విసురుతోంది. మీడియాను కట్టడి చేసేందుకు, తన అదుపాజ్ఞల్లో ఉంచుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు శాసనపరమైన చర్యలు చేపట్టింది. వీటిలో కొన్నింటికి పార్లమెంట్ ఆమోదం కూడా లభించింది. చట్టాల రూపకల్పన, ఆమోదంలో సంబంధిత వ్యక్తులు, సంస్థలతో చర్చించలేదు. పార్లమెంటులో వాటిపై పరిశీలన జరగలేదు. నిబంధనలన్నీ అస్పష్టంగా ఉన్నాయి. వాటి పరిధిని బాగా విస్తరించారు. చట్టబద్ధమైన పాత్రికేయ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. నిబంధనలు ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలకు విశేషాధికారాలు కట్టబెట్టాయి. అవి తీసుకునే చర్యలు జర్నలిజం, పత్రికా స్వేచ్ఛపై ప్రభావం చూపవచ్చు' అని ఆ లేఖలో ఎడిటర్స్ గిల్డ్ వివరించింది.

పత్రికల స్వతంత్రత, భావ ప్రకటనా స్వేచ్ఛ రక్షణకు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని ఎడిటర్స్ గిల్డ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా 2021వ సంవత్సరపు ఐటీ నిబంధనలకు చేసిన సవరణలపై పత్రికా సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు, పాత్రికేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సవరణలను ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్ట్ అండ్ డిజిటల్ అసోసియేషన్, హాస్య నటుడు కునాల్ కమ్ర ఇప్పటికే న్యాయస్థానంలో సవాలు చేశారు. ఈ సవరణలు భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేస్తున్నాయని వారు ఆరోపించారు.

అదరలే..బెదరలే..

(మొదటిపేజీ తరువాయి)

కూడా చైనా వేదికగా పనిచేస్తున్న కొన్ని అమెరికా సంస్థలు మాత్రమే దీనిని వాడుతున్నాయి. దీంతో ఈ సమస్య చైనాపై పెద్దగా ప్రభావం చూపలేదు.

మరో ప్రధాన కారణం.. చైనాలోని మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీసులను స్థానిక భాగస్వామి అయిన 21 వయానెట్ నిర్వహిస్తోంది. చైనా నిబంధనల ప్రకారం.. గ్లోబల్ క్లౌడ్ సర్వీసులను అక్కడి స్థానిక సంస్థలే నిర్వహించాల్సి ఉంటుంది. అందుకే మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలను 21 వయానెట్‌కు అప్పగించింది. అందువల్ల మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు మిగతా దేశాలతో పోలిస్తే చైనాలో భిన్నంగా ఉంటాయి. అంతేకాకుండా ఇతర దేశాల్లో సైబర్ ముప్పుగానీ, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వాటి ప్రభావం దేశంపై పడకుండా చైనా సొంతంగా పటిష్ట సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేసుకుంది. ఈ కారణం వల్లే సాంకేతిక సమస్యతో ప్రపంచమంతా ఉక్కిరిబిక్కిరి అయినా చైనాలో దాని ప్రభావం నామమాత్రంగానే ఉంది.

విండోస్‌లో తలెత్తిన క్రౌడ్ స్ట్రైక్ సమస్య ప్రపంచ వ్యాప్తంగా 8.5 మిలియన్ల కంప్యూటర్లపై పడినట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. వందలాది మంది ఇంజినీర్లను, నిపుణులను వినియోగదారుల దగ్గరికి వెళ్లి సేవలు పునరుద్ధరించేలా కృషి చేసినట్లు తెలిపింది. ఈ మేరకు తన అధికారిక బ్లాగ్‌లో రాసుకొచ్చింది. అయితే, విమాన సర్వీసులతోపాటు.. వివిధ వ్యాపారాలను స్తంభింపజేసిన ఈ సమస్య.. పర్సనల్ కంప్యూటర్లలో మాత్రం కనిపించలేదు. దానికి గల కారణాలను సాంకేతిక నిపుణులు వివరించారు. క్రౌడ్ స్ట్రైక్ సెక్యూరిటీని ప్రముఖ ఐటి సంస్థలు, సైబర్ దాడుల ముప్పు నుంచి పొంచి ఉండే కీలక సంస్థలే ఉపయోగిస్తాయి. పర్సనల్ కంప్యూటర్లలో క్రౌడ్ స్ట్రైక్ ఉపయోగించేవాళ్లు చాలా తక్కువ. అందుకే పిసిలపై దీని ప్రభావం కనిపించలేదని నిపుణులు వెల్లడించారు.

అనుమానాస్పదంగా ముగ్గురు మృతి

(మొదటిపేజీ తరువాయి)

మాధవి(50), హరి(30) విగతజీవులుగా పడి ఉన్నారు. ముందుగా విద్యుదాఘాతంతో మృతి చెందినట్టు భావించినప్పటికీ.. అలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

దాశరథి సవ్యసాచి

సాయుధ పోరాట జ్వాలలు రగిల్చిన యోధుడు : సీఎం





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దాశరథి కృష్ణమాచార్యులు సవ్యసాచి అనీ, నా తెలంగాణ కోటి రత్నాల వీణ అంటూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట జ్వాలలు రగిల్చిన యోధుడు అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. 22న దాశరథి శతజయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ మేరకు ఆదివారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలుగు, ఉర్దూ, సంస్కృత, ఇంగ్లీష్ భాషల్లో పండితుడైన దాశరథి తన కలం నుంచి ఓవైపు విప్లవాగ్నులను రగుల్చుతూనే, మరోవైపు అనువాద, ప్రణయ కవిత్వాలను, సినీ గీతాలను వెలువరించిన సవ్యసాచి అని పేర్కొన్నారు. దాశరథి పోరాట పటిమ మలిదశ తెలంగాణ ఉద్యమ పోరాటానికి, పోరాట సాహిత్యానికి స్ఫూర్తిగా నిలిచిందని సీఎం కొనియాడారు.

ఆసియా కప్‌లో అమ్మాయిలకు ఎదురు లేదు. గ్రూప్ దశలో పాకిస్థాన్, యుఏఈలను చిత్తు చేసిన టీమ్ ఇండియా సెమీఫైనల్ బెర్త్ లాంఛనం చేసుకుంది!. రిచా ఘోష్ (64 నాటౌట్), హర్మన్‌ప్రీత్ కౌర్ (66) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో చెలరేగటంతో పొట్టి ఫార్మాట్‌లో భారత మహిళల జట్టు తొలిసారి 200 పరుగుల మార్క్ అందుకుంది. బౌలర్లు సమిష్టిగా మెరవటంతో ఛేదనలో యుఏఈ చేతులెత్తేసింది. 78 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది.

రిచా, హర్మన్‌ప్రీత్ ధనాధన్

- ఘోష్, హర్మన్‌ప్రీత్ అర్ధ సెంచరీలు
- యుఏఈపై భారత్ ఘన విజయం

భారత్ 201/5, యుఏఈ 123/7



నవతెలంగాణ-దంబుల్లా

ఏడుసార్లు చాంపియన్ ఏకపక్ష విజయాల జోరు కొనసాగుతుంది. ఆసియా కప్ గ్రూప్ దశలో తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన భారత మహిళల జట్టు.. తాజాగా యుఏఈపై ఘన విజయం సాధించారు. బ్యాట్‌తో, బంతితో దుమ్మురేపిన టీమ్ ఇండియా 78 పరుగుల తేడాతో గెలుపొందింది. గ్రూప్ దశలో మరో మ్యాచ్ ఉండగానే.. సెమీఫైనల్ బెర్త్ లాంఛనం చేసుకుంది. స్పిన్నర్ దీప్తి శర్మ (2/23) మాయకు రాధ యాదవ్, తనూజ కన్వార్ జోరు తోడవటంతో ఛేదనలో యుఏఈ తేలిపోయింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు 123 పరుగులే చేసింది. ఆల్‌రౌండర్ కవిశ (40 నాటౌట్, 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ఓపెనర్ ఇషా ఓజా (38, 36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో యుఏఈ గౌరవప్రద స్కోరు సాధించింది. తొలుత బ్యాటింగ్ భారత అమ్మాయిలు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగుల భారీ స్కోరు సాధించింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ (64 నాటౌట్, 29 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66, 47 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. షెఫాలీ వర్మ (37, 18 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిసింది. రిచా ఘోష్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. గ్రూప్-ఏ చివరి మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ తలపడనుంది.

తిప్పేశారు

యుఏఈని భారత బౌలర్లు తిప్పేశారు. స్పిన్నర్లు దీప్తి శర్మ (2/23), రాధ యాదవ్ (1/29) మూడు వికెట్ల మాయజాలం చేయగా.. పేసర్లు రేణుక సింగ్, తనూజ కన్వార్, పూజ వస్త్రాకర్‌లు మరో మూడు వికెట్లు పడగొట్టారు. పవర్‌ప్లే నుంచే వికెట్ల వేట మొదలెట్టిన బౌలర్లు యుఏఈ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఓపెనర్ ఇషా ఓజా (38) టాప్ ఆర్డర్‌లో ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. తీర్థ సతీశ్ (4), రినిత (7), సమైర (5) నిరాశపరిచారు. అయినా, ఓ ఎండ్‌లో నిలబడి స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. ఆల్‌రౌండర్ కవిశ (40 నాటౌట్)తో కలిసి ఇషా మంచి భాగస్వామ్యం నెలకొల్పింది. భారీ ఛేదనలో భారత బౌలర్లపై ఎదురుదాడి చేయలేని యుఏఈ.. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. 20 ఓవర్లలో 7 వికెట్లకు 123 పరుగులకే పరిమితమైంది. 78 పరుగుల తేడా భారత్ ఘన విజయం సాధించింది. గ్రూప్-ఏలో యుఏఈకి ఇది వరుసగా రెండో పరాజయం. వరుసగా రెండో విజయంతో భారత్ సెమీస్ బెర్త్ లాంఛనం చేసుకోగా.. యుఏఈ ఇంటిబాట పట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంది.



రిచా రచ్చ రచ్చ

టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న యుఏఈ... భారత్‌కు పవర్ ప్లేలో గట్టి షాక్ ఇచ్చింది. భారత ఓపెనర్లు గట్టి షాక్ ఇచ్చారు. ప్రమాదకర ఓపెనర్ షెఫాలీ వర్మ (37) తనదైన శైలిలో దంచికొట్టింది. కానీ మరో ఎండ్‌లో భారత్ ఏకంగా మూడు వికెట్లు కోల్పోయింది. స్మృతీ మంధాన (13), హేమలత (2) సహా షెఫాలీ సైతం పవర్‌ప్లేలోనే డగౌట్‌కు చేరుకున్నారు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగిన షెఫాలీ పవర్‌ఫుల్ ఇన్నింగ్స్ నమోదు చేసింది. షెఫాలీ జోరుతో ఆరంభంలో భారత్ దండిగా పరుగులు పిండుకుంది. ఆరు ఓవర్ల అనంతరం 56/3తో నిలిచిన టీమ్ ఇండియాను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66) ముందుకు నడిపించింది. జెమీమా రొడ్రిగస్ (14) నిరాశపరిచినా..రిచా ఘోష్ (64 నాటౌట్)తో కలిసి భారత్‌కు రికార్డు స్కోరు అందించింది. ఐదు ఫోర్లతో 41 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన హర్మన్‌ప్రీత్ కౌర్ భారత్‌కు గెలుపు స్కోరు ఖాయం చేయగా.. రిచా ఘోష్ విశ్వరూపంతో పొట్టి ఫార్మాట్‌లో మహిళల జట్టుకు అత్యధిక స్కోరు రికార్డును అందించింది. హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్ ధనాధన్‌తో ఆఖరు 9 బంతుల్లో భారత్ 34 పరుగులు పిండుకుంది. 19వ ఓవర్లో చివరి మూడు బంతులను హర్మన్‌ప్రీత్ కౌర్ 4, 4, 6గా మలిచింది. ఆఖరు ఓవర్ తొలి బంతికి హర్మన్‌ప్రీత్ రనౌట్‌గా నిష్క్రమించినా.. ఆ తర్వాతి ఐదు బంతులను రిచా ఘోష్ బౌండరీకి తరలించింది. దీంతో భారత్ తొలిసారి టీ20ల్లో 200 ప్లస్ పరుగుల మైలురాయి దాటింది.



స్కోరు వివరాలు :

భారత మహిళల ఇన్నింగ్స్ : షెఫాలీ వర్మ (సి) తీర్థ సతీశ్ (బి) ధర్నిధారక 37, స్మృతీ మంధాన (సి) రినితం రజిత్ (బి) కవిశ 13, హేమలత (బి) హీనా 2, హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్) 66, జెమీమా రొడ్రిగస్ (సి) రినిత రజిత్ (బి) కవిశ 14, రిచా ఘోష్ నాటౌట్ 64, పూజ వస్త్రాకర్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 05, **మొత్తం :**(20 ఓవర్లలో 5 వికెట్లకు) 201.

వికెట్ల పతనం : 1-23, 2-52, 3-52, 4-106, 5-181.

బౌలింగ్ : షమిర ధర్నిధారక 4-0-42-1, ఖుషీ శర్మ 1-0-15-0, కవిశ 4-0-36-2, హీనా 4-0-40-1, వైష్ణవి 3-0-28-0, ఇషా 2-0-26-0, ఇందుజ నందకుమార్ 2-0-14-0.

యుఏఈ మహిళల ఇన్నింగ్స్ : ఇషా ఓజా (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) కన్వార్ 38, తీర్థ సతీశ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక సింగ్ 4, ధర్నిధారక (సి) కన్వార్ (బి) దీప్తి శర్మ 5, కవిశ నాటౌట్ 40, ఖుషీ శర్మ (సి) మంధాన (బి) రాధ 10, హీనా (సి) షెఫాలీ (బి) దీప్తి శర్మ 8, రితిక రజిత్ (రనౌట్) 6, ఎక్స్‌ట్రాలు : 05, **మొత్తం :**(20 ఓవర్లలో 7 వికెట్లకు) 123.

వికెట్ల పతనం : 1-11, 2-24, 3-36, 4-76, 5-95, 6-107, 7-123.

బౌలింగ్ : రేణుక సింగ్ 4-0-30-1, తనుజ కన్వార్ 4-0-14-1, పూజ వస్త్రాకర్ 4-1-27-1, దీప్తి శర్మ 4-0-23-2, రాధ యాదవ్ 4-0-29-1.

ఒలింపియన్లకు బీసీసీఐ ఆర్థిక సాయం

ఐఓఏకు రూ.8.5 కోట్లు అందజేత
వెల్లడించిన బీసీసీఐ కార్యదర్శి జై షా





ముంబయి : ప్రపంచ అత్యంత ధనిక క్రికెట్ బోర్డు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారత ఒలింపియన్లకు ఆర్థికంగా మద్దతుగా నిలిచేందుకు ముందుకొచ్చింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడే భారత అథ్లెట్ల కోసం బీసీసీఐ రూ.8.5 కోట్ల నిధులను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)కు అందజేసింది. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శి జై షా సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. '2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నాను. పారిస్ ఒలింపిక్స్‌లో పతక వేటకు భారత ఒలింపిక్ సంఘానికి బీసీసీఐ రూ.8.5 కోట్లు అందజేస్తుంది. ఒలింపిక్స్ పతక వేటలో నిలిచిన ప్రతి ఒక్క భారత క్రీడాకారుడికి శుభాకాంక్షలు. భారత్ గర్వపడే ప్రదర్శన చేయాలని కోరుకుంటున్నాను' అని జై షా ట్వీట్ చేశాడు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి ఈ సారి 117 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఇందులో 70 మంది అథెట్లు పురుషులు కాగా.. 47 మంది మహిళా అథ్లెట్లు ఉన్నారు. పారిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుకలు జులై 26న జరుగనున్నాయి. కానీ రగ్బీ 7, ఫుట్‌బాల్, ఆర్చరీ వంటి క్రీడాంశాల్లో ప్రాథమిక రౌండ్ మ్యాచులు ముందుగానే ఆరంభం కానున్నాయి. పారిస్‌లో భారత ఒలింపిక్ పతక వేట జులై 25 నుంచే ఆరంభం కానుంది. ఆర్చరీ ర్యాంకింగ్ రౌండ్స్‌లో భారత ఆర్చర్లు బరిలో నిలువనున్నారు. ఆగస్టు 11న పారిస్ ఒలింపిక్స్ పోటీలకు చివరి రోజు. మహిళల రెజ్లింగ్ పతక ఈవెంట్ సైతం అదే రోజు ఉండటంతో భారత్ బోణీతో, అదిరే ముగింపు కోసం రంగం సిద్ధం చేసుకుంది.

నేడు శ్రీలంకకు భారత్!

గంభీర్, అగార్కర్ ప్రెస్ మీట్ నేడు



ముంబయి : ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయోత్సవం ముగించుకున్న టీమ్ ఇండియా నేడు శ్రీలంక పర్యటనకు బయల్దేరనుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని యువ భారత్ జింబాబ్వే పర్యటనను విజయంతం చేసుకుని స్వదేశం చేరుకోగా.. ఆ జట్టులోకి కుర్ర క్రికెటర్లకు బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ శ్రీలంకతో ద్వైపాక్షిక సిరీస్‌లో అవకాశాలు కల్పించింది. శ్రీలంక పర్యటనలో భారత్ మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. టీ20 జట్టుకు సూర్యకుమార్ యాదవ్, వన్డే జట్టుకు రోహిత్ శర్మ కెప్టెన్సీ వహించనున్నారు. శ్రీలంక పర్యటన నుంచే టీమ్ ఇండియా చీఫ్ కోచ్‌గా తొలి పరీక్ష ఎదుర్కొన్న గౌతం గంభీర్.. నేడు భారత చీఫ్ కోచ్‌గా నేడు తొలిసారి మీడియా ముందుకు రానున్నాడు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగర్కార్‌తో కలిసి ప్రెస్ మీట్‌లో పాల్గొననున్నాడు. ఈ మేరకు బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. టీమ్ ఇండియా సెలక్షన్ నిర్ణయాలపై అజిత్ అగర్కార్ మీడియా నుంచి కఠిన ప్రశ్నలు ఎదుర్కొనే అవకాశం కనిపిస్తుంది.


స్కూల్ లైఫ్ ప్రారంభం


సావిత్రి కృష్ణ, పులివెందుల మహేష్, కిరణ్ అబ్బవరం

నైనీషా క్రియేషన్స్, జెనియా ఎంటర్టైన్మెంట్స్, క్రౌడ్ ఫండింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'స్కూల్ లైఫ్' సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. పులివెందుల మహేష్ హీరోగా నటిస్తూ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాతలు నైనీషా, రాహుల్ త్రిశూల్ నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు వి సముద్ర విచ్చేసి టీమ్‌కి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా హీరో, దర్శకుడు పులివెందుల మహేష్ మాట్లాడుతూ, 'ఈ సినిమా నా ఒక్కడిదే కాదు. సినిమా మీద ఉన్న ఇష్టంతో సినిమా కథ నచ్చి క్రౌడ్ ఫండింగ్ ద్వారా వచ్చిన ప్రజల డబ్బుతో, అలాగే నా ఇల్లు అమ్మి ఈ సినిమా తీస్తున్నాను. సినిమాలో కంటెంట్ ఉంటే ప్రేక్షకులు కచ్చితంగా సక్సెస్ చేస్తారు అని నమ్ముతాను. వచ్చిన బడ్జెట్ సరిపోనప్పుడు కథ నచ్చి, నన్ను నమ్మి ఇన్వెస్ట్ చేసి ఈరోజు రామానాయుడు స్టూడియోలో మూవీ ఓపెనింగ్ ప్రెస్ మీట్ పెట్టే స్థాయికి తీసుకువచ్చిన నిర్మాత రాహుల్ త్రిశూల్‌కి కృతజ్ఞతలు' అని తెలిపారు.

'గతంలో నేను రాంగోపాల్ వర్మ సినిమా కథని ఓటీటీకి చేశాను. యాంకర్ రవి హీరోగా 'రాయలసీమ ప్రేమ కథ' అని మరో సినిమా నిర్మించాను. నిర్మాతగా ఇది నాకు మూడవ సినిమా. మహేష్ నాకు 'రాయలసీమ ప్రేమ' కథ టైమ్ నుంచే పరిచయం. ఈ సినిమా గురించి మహేష్ చెప్పినప్పుడు కథ నచ్చి ఈ సినిమాలో ఇన్వెస్ట్ చేసి నేను కూడా ఒక భాగమయ్యాను. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు 2న స్టార్ట్ అయ్యి సెప్టెంబర్ 2 వరకు జరిగే సింగిల్ షెడ్యూల్లో కంప్లీట్ చేస్తున్నాం' అని నిర్మాత రాహుల్ త్రిశూల్ చెప్పారు. హీరోయిన్ సావిత్రి కృష్ణ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మహేష్‌కి కృతజ్ఞతలు. మంచి కంటెంట్ ఉన్న సినిమా 'స్కూల్ లైఫ్'. కచ్చితంగా ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి డి ఓ పి : ధర్మ ప్రభ, సంగీతం : హర్ష ప్రవీణ్, ఎడిటర్ : నందమూరి హరిబాబు, లిరిక్స్ : ఎం అనిల్, బాలు, అసుర కె, రైటర్స్ : అనాస్, అప్పసాని మధు, వీరాంజనేయ చారి, సురేష్, నవీన్, నరసింహ, డైలాగ్స్ : అంజి తన్నీరు.


రవితేజ

ఆగస్ట్ 15న మిస్టర్ బచ్చన్ విడుదల

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో రాబోతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మిస్టర్ బచ్చన్'. ఆగస్ట్ 15 ఇండిపెండెన్స్ డే రోజున ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఆగస్ట్ 19న (సోమవారం) రక్షా బంధన్ హాలీడేతో 5 రోజుల లాంగ్ వీకెండ్‌ను ఈ సినిమా ఉపయోగించుకోనుంది. ఈ సినిమా ప్రీమియర్ షోలు ఆగస్ట్ 14న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రిలీజ్ చేసిన రవితేజ స్లిక్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తున్న రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకోవడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నందున రెగ్యులర్ అప్‌డేట్స్‌తో వచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. జగపతి బాబు, సచిన్ ఖేడేకర్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వప్రసాద్ గ్రాండ్ నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.

నవచిత్రం

తంగలాన్ రిలీజ్ డేట్ ఫిక్స్


విక్రమ్

విక్రమ్ హీరోగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు.

పా రంజిత్ దర్శకత్వంలో నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ చిత్ర ట్రైలర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే 'మనకి మనకి..' లిరికల్ సాంగ్ కూడా ఛాట్ బస్టర్ అయ్యింది. రిలీజ్ చేసిన ప్రతి కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో ఈ మూవీ మీద ఉన్న క్రేజ్ మరింత పెరుగుతోంది. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతిని కచ్చితంగా కలిగిస్తుందని చిత్ర యూనిట్ తెలిపింది.

ఇది చిన్న కథ కాదు


విశ్వదేవ్

నివేత థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన న్యూ ఏజ్ క్లీన్ ఎంటర్‌టైనర్ '35-చిన్న కథ కాదు'. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్, డైరెక్టర్. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ విశ్వదేవ్‌ను ప్రసాద్‌గా పరిచయం చేస్తూ ఒక స్పెషల్ గ్లింప్స్‌ని రిలీజ్ చేశారు. విశ్వదేవ్‌ను కేరింగ్ అండ్ రెస్పాన్స్‌బుల్ మిడిల్‌క్లాస్ ఫాదర్‌గా ప్రజెంట్ చేసిన ఈ గ్లింప్స్ చాలా ఆసక్తికరంగా ఉంది. విశ్వదేవ్ రియలిస్టిక్ పెర్ఫార్మెన్స్ అందర్నీ ఆకట్టుకుంటోంది. క్యారెక్టర్ ఎసెన్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసిన గ్లింప్స్ చాలా అందరిలోనూ క్యురియాసిటీని పెంచింది. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా సిద్ధమైంది. 'పెళ్లి చూపులు, సమ్మోహనం, అంటే సుందరానికీ' వంటి తదితర చిత్రాలకు అద్భుతమైన సంగీతం అందించిన వివేక్ సాగర్ ఈ చిత్రానికి మ్యూజిక్ సమకూర్చారు. 'ఆకాశం నీ హద్దు రా, అంటే సుందరానికి, సర్ఫిరా, కుబేరా' తదితర చిత్రాలకు గ్రేట్ విజువల్స్‌తో మంచి పేరు తెచ్చుకున్న నికేత్ బొమ్మి ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. విజువల్ అప్పీల్‌ని యాడ్ చేస్తూ ప్రొడక్షన్ డిజైన్‌ను లతా నాయుడు నిర్వహిస్తున్నారు. ఆగస్టు 15న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో ఈ సినిమా ఒకేసారి విడుదల కానుంది.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: నంద కిషోర్ ఈమాని, నిర్మాతలు: రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఎడిటర్: టి సి ప్రసన్న, డైలాగ్స్: నంద కిషోర్ ఈమాని, ప్రశాంత్ విఘ్నేష్ అమరావతి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ సౌమిత్రి, క్రియేటివ్ ప్రొడ్యూసర్: శివాని దోభాల్, లిరిక్స్: కిట్టు విస్సాప్రగడ, భరద్వాజ్ గాలి, కాస్ట్యూమ్ డిజైనర్: ప్రిన్సి వైద్, లైన్ ప్రొడ్యూసర్: విన్సెంట్ ప్రవీణ్.

సరికొత్త ముక్కోణ ప్రేమకథ


శ్రద్ధా శ్రీనాథ్

హీరో విశ్వక్ సేన్ తాజాగా నటిస్తున్న 'మెకానిక్ రాకీ' దీపావళి రేసులో ఉందని ఇటీవల మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 31న విడుదల కానుంది. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి రైటింగ్, డైరెక్షన్ వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మాత రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

ట్రై యాంగిల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. తాజాగా శ్రద్ధా శ్రీనాథ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. హైబడ్జెట్‌తో భారీ కాన్వాస్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు.

నవంబర్‌లో సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ సీజన్ 2



సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ సీజన్ 1ని టీసీఏ ఫిబ్రవరిలో నిర్వహించారు. అది పెద్ద సక్సెస్ అవడంతో తాజాగా సీజన్ 2 కోసం సన్నాహాలు చేస్తున్నారు. ద రాయల్ చిల్డ్రన్స్ హాస్పిటల్ మెల్బోర్న్ ఛారిటీ కోసం తెలుగు సినీ సెలబ్రిటీస్ ఈ క్రికెట్ మ్యాచ్ ఆడబోతున్నారు. ఈ సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ సీజన్2కి సంబంధించిన సాఫ్ట్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ఫౌండర్ సాయికృష్ణ, హీరోలు శ్రీకాంత్, తరుణ్, అశ్విన్ బాబు, సుశాంత్, ఆది సాయికుమార్, సామ్రాట్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్, ఆర్టిస్ట్ భూపాల్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, 'టిసిఏని 2006లో స్థాపించారు. సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ ద్వారా క్రికెట్ మ్యాచ్ ఆర్గనైజ్ చేసి ఛారిటీ ద్వారా సహాయం అందిస్తున్న సాయి కృష్ణకి మా అందరి తరపున అభినందనలు. చాలా దేశాల్లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సీజన్ 1 ఆడాం. ఒకే సంవత్సరంలో రెండు సీజన్లు నిర్వహించడం అనేది అంత ఈజీ కాదు. సీజన్ 1 పెద్ద సక్సెస్ అవ్వడం వల్ల నవంబర్‌లో సీజన్ 2 నిర్వహిస్తున్నారు. సాయికృష్ణకు సినిమా అనుభవం కూడా ఉంది. ఇంతమంది సెలబ్రిటీస్‌ని తీసుకెళ్లి ఆస్ట్రేలియాలో క్రికెట్ మ్యాచ్ ఆడించడం అంత ఈజీ కాదు. అలాంటిది సీజన్ 2 నిర్వహిస్తున్నారు. నవంబర్ 15, 16న జరిగే ఈ ఈవెంట్ సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. 'ఫిబ్రవరిలో సీజన్ 1 నిర్వహించాం. హీరోలు శ్రీకాంత్, తరుణ్ ముందు నుంచి ఎంతో సపోర్ట్ ఇస్తున్నారు. వీరంతా ఎంతో బిజీగా ఉన్నా ఛారిటీ కోసం వచ్చి క్రికెట్ ఆడి సపోర్ట్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ ఫౌండర్ సాయికృష్ణ చెప్పారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.